www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 3-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 169 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి రా. 2.58 తదుపరి విదియ; నక్షత్రం: హస్త మ 3.32 తదుపరి చిత్త; వర్జ్యం: రా.12.34-2.22; దుర్ముహూర్తం: ఉ.10.05-10.52, మ.2.49-3.36; అమృతఘడియలు: ఉ.8.44-10.33; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.58 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నవ్య
కుటుంబ కదంబం





పొలంలో విత్తడం మొదలు అది ఇంటికి ధాన్యంగా చేరి, కంచంలో అన్నంగా మారే వరకు... ప్రతి దశలో మహిళా రైతు కూలీల శ్రమ వెలకట్టలేనిది. దేశానికి అన్నం పెట్టే ఆ అన్నపూర్ణల జీవితం నిండా కన్నీటి గీతాలు, పోరాట గాథలే.! వాటిని సజీవ చిత్రాలుగా మన కళ్లముందుంచారు పూణెకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ **విద్యా కులకర్ణి**. అందుకోసం తెలంగాణ, మహారాష్ట్ర, పంజాబ్ పల్లెల్లో రోజుల తరబడి తిరిగారామె. శ్రమైక జీవన సౌందర్యానికి అద్దంపట్టే ఆ దృశ్యకావ్యాలను 'కల్టివేటింగ్ ఫ్యూచర్స్' పేరుతో హైదరాబాద్‌లో ప్రదర్శించిన సందర్భంగా విద్యను 'నవ్య' పలకరించింది.

వాళ్ల జీవితం వ్యక్తిత్వ వికాస పాఠం

రైతు అనగానే తలకు వస్త్రాన్ని చుట్టి పొలంలో శ్రమిస్తున్న పురుషుడి రూపం మాత్రమే మన ఊహకు అందుతుంది. నిజానికి విత్తనాలు వేయడం మొదలు ఎరువు చల్లడం, కలుపు తీయడం, పంట కోయడం తదితర పనులన్నింటిలో మహిళల చాకిరి మాటలకు అందనిది. ఆ సంగతి మనందరికీ తెలిసినా, ఆమె శ్రమ పట్ల సమాజానికి పెద్దగా పట్టింపు ఉండదు. అన్నిరంగాల్లో ఉన్నట్టే ఇక్కడా వారి భాగస్వామ్యానికి తగిన గుర్తింపు, గౌరవం లేదు. మనం అంగీకరించినా, లేకున్నా వ్యవసాయ రంగానికి వెన్నెముక మహిళలు. దేశానికి గోరుముద్దలు తినిపిస్తున్న ఆ అమ్మలు ఎదుర్కొంటున్న సవాళ్ళు కూడా అంత సాధారణమైనవి ఏమీ కావు. ఒక్కొక్కరి జీవితం ఒకొక్క యుద్ధ క్షేత్రమైతే, అందులో వారు గెలవడానికి సాగిస్తోన్న పోరాటం అసామాన్యమైనది. నిజమైన ఈ షీరోల గాథలను లోకానికి తెలియజేయాలన్న సంకల్పంతో 'మహిళా కిసాన్ అధికార్ మంచ్' (మకాం) తెలంగాణ, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాల్లో క్షేత్ర స్థాయి అధ్యయనం సాగించింది. మహిళా రైతు, కూలీల జీవితాలను దృశ్యమానం చేయడానికి ఫొటోగ్రాఫర్‌గా మకాం బృందం వెంట నేనూ మూడు రాష్ట్రాలలోని కొన్ని గ్రామాలకు వెళ్లాను. ఆ సమయంలో నేను తీసిన ఫొటోలను 'కల్టివేటింగ్ ఫ్యూచర్స్' పేరుతో హైదరాబాద్‌లో రెండు రోజులు ప్రదర్శించాం. దానికి మంచి ఆదరణ లభించింది. మా ఫొటో ఎగ్జిబిషన్ చూసినవారంతా ఛాయా చిత్రాలన్నీ సజీవమైన దృశ్యకావ్యాలుగానూ, అత్యంత హృద్యంగానూ ఉన్నాయని కొనియాడుతుంటే ఎంతో సంతోషంగా అనిపించింది.

అదొక కొత్త అనుభూతి...

నా పల్లె అనుభవాలు చెప్పేముందు, నా నేపథ్యం గురించి ఇక్కడ కొంత ప్రస్తావించాలి. నేను పుట్టి, పెరిగిందంతా పూణెలోనే.! అక్కడే జర్నలిజం పూర్తి చేసి, స్థిరపడ్డాను. మూడు దశాబ్దాలుగా మహిళా హక్కుల ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉన్నాను. మొదట ఒకటిరెండు ఆంగ్ల పత్రికల్లో పాత్రికేయురాలిగా పనిచేసినా, ఫొటోగ్రఫీ మీద ఆసక్తితో ఫ్రీలాన్స్ ఫొటో జర్నలిస్టుగా మారాను. ఆ క్రమంలో



కొన్నిసార్లు గ్రామీణప్రాంతాలకూ వెళుతుంటాను. కానీ మకాం అధ్యయనం కోసం తెలంగాణ జిల్లాల్లో పది రోజులు, మహారాష్ట్రలో నెలరోజుల పాటు పల్లెల్లో తిరిగి మహిళా రైతు, కూలీలతో సంభాషించడం, వారి జీవితాలను చాలా దగ్గరగా చూడడం మాత్రం నాకు కొత్త అనుభూతిని కలిగించింది. ఇంకా చెప్పాలంటే, ప్రతి గ్రామీణ మహిళ జీవితం ఒక వ్యక్తిత్వ వికాస పాఠం. మంచిర్యాల జిల్లా వెంకటాపురం పరిధిలోని ఒక తండాలో... స్వయం సహాయక బృంద సభ్యురాళ్ళు కొందరు సమష్టిగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మూడేళ్ళుగా నిర్వహిస్తున్నారు. వారి నిబద్ధత, నిజాయితీ, పారదర్శకత చూసి ముగ్ధురాలినయ్యాను. నల్గొండ జిల్లాలోని ఒక గ్రామంలో మంజుల అనే రైతు... ఇల్లు, పొలాన్ని వదిలి భర్త వెంట పట్టణానికి వలస వెళ్లడం ఇష్టంలేక, ఒంటరిగా సొంతూరులో వ్యవసాయం చేస్తుండటం చూసి నిర్ఘాంతపోయాను. ఆమె సాహసం నన్ను కట్టిపడేసింది.

వారి స్థైర్యానికి హ్యాట్సాఫ్...

మహారాష్ట్రలోని కొన్ని జిల్లాలలో కుటుంబాలన్నీ దీపావళి తర్వాత చెరుకు కోతలకు ఉస్మానాబాద్, బీడ్, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు ఆరునెలల పాటు వలస వెళతాయి. అంత కాలం వారంతా చిన్న గుడిసెల్లో తలదాచుకుంటారు. అక్కడ మహిళా రైతు కూలీల భద్రత అతి పెద్ద ప్రశ్న. నీరు, మరుగుదొడ్డి లాంటి కనీస సౌకర్యాలు సరిగ్గాలేక వారెంత నరకం అనుభవిస్తున్నారో కళ్లారా చూశాం. గ్రామాల్లో ఒంటరి మహిళల జీవితం వర్ణనాతీతం. భర్తను కోల్పోయిన ఒక మహిళా రైతు... తాను ఒంటరిగా పొలానికి వెళుతున్నపుడు మనసులో కలిగే భయాందోళనల గురించి చెబుతుంటే నా మనసును మెలిపెట్టినట్టు అయింది. ఇరుగుపొరుగు సూటిపోటు మాటలు, అవమానాలు, లైంగిక వేధింపులు ఇక అవి చెప్పేవి కావు. అయినా, వాటన్నింటినీ పంటిబిగువున భరిస్తూ, ముందుకెళుతున్న వారి స్థైర్యానికి హ్యాట్సాఫ్.! అప్పుల బాధతో భర్త ఆత్మహత్య చేసుకున్నా, పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్న సంకల్పంతో నాగలి పట్టిన ఆ తల్లుల మనోబలం ముందు విధినైతం తలవంచడం కళ్లారా చూశాను.



అందుకు నా వంతు ప్రయత్నం...

హరితవిప్లవానికి పుట్టినిల్లుగా చెప్పే రాజస్థాన్ లోనూ రైతుల ఆత్మహత్యలు ఎక్కువ ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వ్యవసాయ పనులు యాంత్రీకరణ చెందిన రాష్ట్రం అది. ఇక అక్కడి రైతుల ఇళ్ళు, పొలం చూసి ధనికులనుకొంటాం. కానీ పంటకు గిట్టుబాటు ధర లభించక, బ్యాంకు రుణాలు చెల్లించలేక యువ రైతులు ఊపిరి తీసుకొంటున్నారు. అలాంటి కుటుంబాల్లో మహిళలు బాధపడుతూ ఇంటికే పరిమితం అవ్వకుండా, పొలంబాట పడుతున్నారు. అప్పులు తీర్చుతూ, కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఇలా వ్యవసాయ రంగంలోని మహిళల భాగస్వామ్యాన్ని, వారి శ్రమశక్తిని కళ్ళకు కడుతూనే... జీవితాల్లోని భిన్న పార్శ్వాలను నా కెమెరాతో బాహ్యాప్రపంచానికి కొంత మేరకైనా చూపించగలగాను. అందుకు నాకు తృప్తిగా ఉంది. ప్రతి సంఘటన వెనుక ఒక వాస్తవం దాగి ఉంటుంది. దాన్ని వెలుగులోకి తేవడం ఫొటోగ్రాఫర్‌గా నా బాధ్యత. దాన్ని నిర్వర్తించడంలో నా వయసును కూడా లక్ష్యపెట్టను. ఇప్పుడు నాకు 61ఏళ్లు. అయినా ఈ ప్రయాణాలు నాకు ఎంతమాత్రం ప్రయాస కాదు. మన కనురెప్పను తాకని ఎంతో మంది శ్రమ జీవుల జీవన సౌందర్యాన్ని నా కెమెరా ద్వారా ఈ లోకానికి చూపించడానికి నావంతు ప్రయత్నిస్తాను.



• సాంత్వన్

దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ బాలాత్రిపురసుందరీదేవి
ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి, గురువారం




శరన్నవరాత్రి ఉత్సవాలలో మొదటి రోజున శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో బెజవాడ కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనదనీ, శ్రీ బాలా మంత్రం సమస్త దేవీమంత్రాల్లోకెల్లా అత్యున్నతమైనదనీ ఆధ్యాత్మికులు చెబుతారు. అందుకే శ్రీవిద్యోపాసకులకు మొట్టమొదటగా ఈ మంత్రాన్ని ఉపదేశిస్తారు. షోడశ విద్యలకు ఆమె అధిష్ఠాన దేవత. కాబట్టి ఉపాసకులు త్రిపురసుందరీదేవి అనుగ్రహం కోసం బాలార్చన చేస్తారు. త్రిపురాత్రయంలో బాలాత్రిపుర సుందరీదేవి మొదటి స్వరూపం. మహాత్రిపురసుందరీ దేవి నిత్యం కొలువుండే పవిత్రమైన శ్రీచక్రంలో తొలి ఆమ్నాయంలో ఉండే తొలి దేవత బాలాదేవి. అందుకే ముందుగా బాలాదేవి అనుగ్రహం పొందితేనే మహా త్రిపురసుందరీదేవి అనుగ్రహాన్ని పొందగలరని పెద్దలు చెబుతారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు పూర్ణ ఫలం అందించే అలంకారం బాలాత్రిపురసుందరీదేవి. ఈ తల్లిని ఆరాధిస్తే మనోవికారాలు తొలగిపోతాయనీ, సర్వ సంపదలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ రోజు రెండు నుంచి పదేళ్ల లోపు బాలికలను అమ్మవారి స్వరూపంగా భావించి పూజిస్తారు. 'లలితా త్రిశతి' పారాయణ చేస్తారు.

నైవేద్యం: పాయసం, పులగం
అలంకరించే చీర రంగు: లేత గులాబీ రంగు
అర్చించే పూల రంగు: అన్ని రకాలు
పారాయణ: లలితా త్రిశతి

వేడుక

నేడు అటుకుల బతుకమ్మ



ప్రకృతి స్వరూపిణిగా తెలంగాణ ప్రజలు ఆరాధించే బతుకమ్మ వేడుకల్లో రెండో రోజైన ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు (గురువారం) ప్రకృతి స్వరూపిణి అయిన గౌరమ్మను 'అటుకుల బతుకమ్మ'గా ఆరాధిస్తారు. ఈ రోజున ప్రధానంగా నివేదించేవి అటుకులు కాబట్టి 'అటుకుల బతుకమ్మ' అని పిలుస్తారు. వివిధ రకాల పూలతో రెండు ఎత్తులలో గౌరమ్మను పేరుస్తారు. ఆటపాటలతో వేడుక చేసుకుంటారు.

ఈ రోజు నైవేద్యం: సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు

కౌన్సెలింగ్

వరుస గర్భస్రావాలను ఆపేదెలా?

Q A

డాక్టర్! నా వయసు 29. పెళ్లై ఏడేళ్లయింది. ఈ ఏడేళ్లలో పలు సార్లు అబార్షన్లు అయ్యాయి. మొదటిసారి గర్భం దాల్చినప్పుడు, మూడు నెలలకే పిండంలో ఎదుగుదల లేదనే కారణంతో గర్భస్రావం చేయించుకోవలసి వచ్చింది. రెండోసారి కూడా ఇలాగే జరిగింది. ముందుందు కూడా ఇదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలున్నాయని వైద్యులు అంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించుకుని, పండంటి బిడ్డను కనే మార్గం లేదా?

- ఓ సోదరి, హైదరాబాద్.



రెండు, అంతకంటే ఎక్కువ సార్లు గర్భస్రావాలైతే, ఆ పరిస్థితిని రికరెంట్ ప్రెగ్నెన్సీ లాస్ అంటారు. ఇలాంటి వాళ్లు తప్పనిసరిగా కొన్ని పరీక్షలు చేయించుకోవాలి. మరీ ముఖ్యంగా జన్యుపరమైన కారణాలున్నాయేమో పరీక్షించుకోవలసి ఉంటుంది. అందుకోసం భార్యాభర్తలిద్దరి జెనెటిక్ అనాలసిస్ చేయించుకోవాలి. కుటుంబంలో వరుస గర్భస్రావాలు జరుగుతున్న సందర్భాలు ఉన్నప్పుడు కూడా జన్యుపరమైన సమస్యగానే పరిగణించాలి. అలాగే ప్రెగ్నెన్సీకి వ్యతిరేకంగా శరీరంలో యాంటీబాడీస్ పెరగడం వల్ల గర్భస్రావం జరుగుతుందేమో కూడా తెలుసుకోవాలి. అలాగే థైరాయిడ్, మధుమేహాలను కూడా పరీక్షించుకోవాలి. వీటితో పాటు రక్తం గడ్డకట్టే తత్వం ఎక్కువగా ఉన్నప్పుడు, బిడ్డకు రక్తసరఫరాలో అంతరాయం ఏర్పడి, గర్భస్రావం జరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఆ అంశాన్ని కూడా పరీక్షించుకోవాలి. ఈ పరీక్షలన్నీ చేయించుకుని, అసలు సమస్యను కనిపెట్టి, తగిన చికిత్సను ఎంచుకోగలిగితే, ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించే వీలుంటుంది. కాబట్టి మీరు మొదట ఈ పరీక్షలన్నీ చేయించుకుని, మూల కారణాన్ని కనిపెట్టి, గర్భం దాల్చే ప్రయత్నం చేయడం ఉత్తమం.

- డాక్టర్ మంజుల అనగాని
హెచ్ఓడి ఆఫ్ గైనకాలజీ, కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్.

సెలబ్ ఫిట్

అందానికి చక్కని అభినయం కూడా తోడైతే... ఆమే దివ్యా దత్తా.
మూడు పదులు దాటిన కెరీర్... అరవైకి పైగా చిత్రాలు...
నలభై ఏడేళ్ల వయసులోనూ తరగని గ్లామర్‌తో అలరిస్తోంది.
జనసామాన్యానికి దగ్గరైన పాత్రలతో... విలక్షణ నటిగా...
ప్రేక్షకుల చప్పట్లే కాదు... ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులూ గెలుచుకుంది.
కష్టపడే తత్వం... శారీరక, మానసిక ఆరోగ్యం...
ఇవే తన విజయ దరహాసానికి కారణం అంటుంది దివ్య.



దివ్యమైన రూపం

వయసు పైబడుతున్నకొద్దీ కథానాయికలకు అవకాశాలు తగ్గిపోతుంటాయి. కానీ దివ్యా దత్తా అందుకు మినహాయింపు. వయసుతో పాటు ఆమె పోషించే పాత్రల్లో కూడా పరిణతి కనబడుతుంది. 1994లో 'ఇష్క్ మే జీనా ఇష్క్ మే మర్‌నా'తో తొలిసారి వెండితెర మీద మెరిసిన దివ్య... ఆ మరుసటి ఏడాది 'వీర్‌గతీ'లో సల్మాన్‌ఖాన్‌కు జోడీగా నటించింది. ఆ సినిమా విజయం సాధించకపోయినా ఆమె నిరాశ చెందలేదు. ప్రధాన పాత్రల కోసం కూర్చోకుండా... ప్రాధాన్యమున్న పాత్రల్లో ఒదిగిపోయింది. 'వీర్ జారా, భాగ్ మిల్కా భాగ్, వెల్కమ్ టూ సజ్జన్‌పూర్, ఢిల్లీ6, హీరోయిన్' తదితర చిత్రాల్లో అద్భుతమైన నటనతో అభిమానులను సంపాదించుకుంది. మొన్నామధ్య విడుదలైన 'శర్మాజీ కీ బేటీ' చిత్రానికి మంచి ఆదరణ లభించింది. ప్రముఖుల ప్రశంసలు సైతం అందుకుంది. కాలంతో పాటు తనూ మారుతున్నానని, రోల్స్ ఎంపికలో శ్రద్ధ వహిస్తున్నానని, అందుకే భిన్నమైన కథలు వస్తున్నాయని ఓ సందర్భంలో చెప్పింది దివ్య. విశేషమేమంటే... హీరోల కోసం సృష్టించిన కొన్ని పాత్రలను తాను పోషించడం.

"కెరీర్ ఆరంభంలో వైవిధ్యమైన కేరెక్టర్లు అనేకం వచ్చేవి. అయితే నాకూ ఒక అభిరుచి ఉంటుంది కదా... 'ఇలాంటి రోల్స్ చేయాలి' అని. నిదానంగా అలాంటి కథలు రావడం మొదలయ్యాయి. అంటే నేను 'నో' చెప్పలేనివి. కానీ రాత్రికి రాత్రి ఇవన్నీ జరిగిపోలేదు. కొన్నేళ్ల కఠోర శ్రమ ఫలితం. ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఈ స్థాయికి చేరాను. అన్నిటి కంటే సంతృప్తిని, సంతోషాన్ని ఇచ్చింది ఏమిటంటే... మగ నటులను దృష్టిలో పెట్టుకొని, వారి కోసం రాసుకున్న కొన్ని పాత్రలు నేను చేయడం. ఇలాంటివి పరిశ్రమలో చాలా అరుదుగా జరుగుతాయి" అంటున్న దివ్య... స్వస్థలం పంజాబ్‌లోని లుధియానా. తల్లి నళిని దత్తా వైద్యురాలు. దివ్యకు ఏడేళ్లప్పుడు ఆమె తండ్రి మరణించారు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యతలను తల్లి నళిని తీసుకున్నారు. తన ఇద్దరు పిల్లలకూ ఏ లోటూ రాకుండా చూసుకున్నారు. 'ధీశాలి' అంటూ తన తల్లి గురించి దివ్య పలు సందర్భాల్లో చెప్పింది. 'మా అమ్మే నాకు స్ఫూర్తి. చిన్న వయసులోనే నాన్న మాకు దూరమైతే... ఒంటరిగా నన్ను, తమ్ముడినీ పెంచింది. వృత్తిలో ఎంత ధైర్యంగా, నిజాయతీగా ఉంటుందో... ఇంట్లో మాతో అంత సరదాగా గడిపేది' అంటూ గతంలో ఓసారి తన చిన్ననాటి రోజులు గుర్తు చేసుకుంది దివ్య. 'గిప్పి' చిత్రంలో పప్పీ పాత్రకు తన తల్లినే ప్రేరణగా తీసుకుంది. నళిని రాసుకున్న కవితలను దివ్య, ఆమె సోదరుడు కలిసి ఒక పుస్తకంగా అచ్చు వేయించారు.

దివ్య మామయ్య దీపక్ బారీ దర్శకనిర్మాత. లుధియానాలోని ఓ కాన్వెంట్‌లో చదివిన ఆమె... తొలుత పంజాబ్‌లో మోడలింగ్ చేసింది. లండన్ సంగీత ద్వయం బేస్‌మెంట్ జాక్స్ రూపొందించిన మ్యూజిక్ వీడియో 'రోమియో'లో నటించింది. అదే సమయంలో చిత్ర సీమలోకి అడుగు పెట్టింది. సినిమాలతో పాటు టీవీ, వెబ్‌సిరీస్‌లు కూడా చేసింది. ఎవర్‌గ్రీన్ నటిగా అభిమానుల ప్రశంసలు అందుకొంటున్న దివ్య... చేపట్టే ప్రాజెక్టుల విషయంలోనే కాదు... ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన జీవనశైలిపై కూడా ఎంతో శ్రద్ధ పెడుతుంది.

వర్కవుట్ ఇలా...

దివ్య దృష్టిలో ఫిటెనెస్ అంటే సిక్స్ ప్యాక్‌ల్లాంటివి తెచ్చుకోవడం కాదు. 'అద్దంలో నన్ను నేను చూసుకున్నప్పుడు ఆనందం కలగాలి. చికాకుగా అనిపించకూడదు. మన జీవనశైలిలో ఫిట్‌నెస్ అనేది కీలకం. అయితే ఎవరి శరీర తత్వాన్ని బట్టి వారు వ్యాయామాలు చేయాలి' అంటున్న దివ్య వారంలో ఐదు రోజులు జిమ్‌కు వెళుతుంది. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైనపుడు దాని నుంచి ఎలా బయటపడాలో కూడా తనకు తెలుసంటారు దివ్య. 'అది అంత సులువైంది కాదు. కానీ సాధనతో అలవాటు చేసుకున్నా. బాగా ఒత్తిడి అనిపిస్తే దగ్గరలోని ఏదోఒక వస్తువుపై దృష్టి కేంద్రకరించి, పది అంకెలు లెక్కపెడతా. శరీరాన్ని ఎలాగైతే ట్రైన్ చేస్తామో... మనసును కూడా అలాగే నియంత్రణలో ఉంచుకోవాలి' అంటుంది ఆమె.

- ఉదయం లేవగానే ఇరవై నిమిషాలు కార్డియో
- వెయిట్‌లిఫ్టింగ్ తదితర వ్యాయామాలతో స్ట్రెంత్ ట్రెయినింగ్
- అధిక కేలరీలు కరిగించాల్సి వస్తే వర్కవుట్స్ తీవ్రతను పెంచుతుంది.
- ఆక్వా జుంబా దివ్యకు చాలా ఇష్టం
- ఒకవేళ జిమ్ అందుబాటులో లేకపోతే స్విమ్మింగ్, డ్యాన్సింగ్, యోగా.
- బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఏదైనా కారణంతో హోటల్ గదికే పరిమితం కావాల్సి వస్తే... సూర్య నమస్కారాలు చేయడం ఆమెకు అలవాటు.

ఇదీ మెనూ...

ఆహార విషయంలో తన అమ్మమ్మ, తాతయ్యలే దివ్యకు ఆదర్శం. స్వచ్ఛమైన, తాజా ఇంటి వంటకు ఆమె ప్రాధాన్యం ఇస్తుంది. గోధుమ, పంచదార, ప్రాసెస్‌డ్, జంక్‌ఫుడ్స్‌కు దూరం. ఎప్పుడన్నా తీపి పదార్థాలు తినాలని అనిపిస్తే చెరుకు గడ తీసుకొంటుంది.

- ఉదయం లేవగానే సోంపు గింజలతో గ్లాసుడు గోరువెచ్చటి నీరు.
- బ్రేక్‌ఫాస్ట్‌లో పోహా/ఓట్స్, తాజా పండ్లు.
- మధ్యాహ్న భోజనంలో పప్పు, ఉడకబెట్టిన కూరగాయలతో జొన్న రొట్టెలు, సలాడ్.
- సాయంత్రం వేళ మఖానా, జీడిపప్పు, బాదం/ లేదంటే పండ్లు
- డిన్నర్‌కు పప్పు అన్నం లేదంటే సూప్



ఈ పదేళ్ల చిన్నారి కాలుష్యాన్ని కడిగేస్తోంది

సముద్రాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ చెత్త పర్యావరణ నిపుణులను భయపెడుతోంది. ఇది ఇలాగే కొనసాగితే 2050 కల్లా సముద్రాల్లో ఒక్క చేప కూడా కనిపించదని వారు అంటున్నారు. అయితే ఈ మాటలను పట్టించుకునే వారే లేరు. కానీ చెన్నైకు చెందిన పదేళ్ల తారగై ఆరాధన మాత్రం మెరైన్ పొల్యూషన్‌ను తొలగించే బాధ్యతను తీసుకుంది. స్క్యూబా డైవర్‌గా మారి సముద్రంలో ప్లాస్టిక్‌ను ఏరివేసే పని ప్రారంభించింది. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'సేవ్ ద ఓషన్' పేరుతో పదకొండున్నర గంటలు ఈది రికార్డు నెలకొల్పింది. ఆ చిన్నారి విశేషాలు మరికొన్ని ఇవి...

'పర్యావరణ సమతుల్యత దెబ్బతినకూడదంటే సముద్రాలను కాపాడుకోవాలి. ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా క్లాత్ బ్యాగులు వాడాలి' అంటూ ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తుంది తారగై ఆరాధన. పదేళ్ల వయసులోనే పర్యావరణ కార్యకర్తగా మారి మెరైన్ లైఫ్ ప్రొటెక్షన్ కోసం పనిచేస్తుంది. ఇండియా యంగెస్ట్ పీఏడీఐ సర్టిఫైడ్ డైవర్‌గా ఆ చిన్నారి గుర్తింపు పొందింది. మెరైన్ ప్లాస్టిక్ పొల్యూషన్‌పై అవేర్‌నెస్‌ను కల్పించడం కోసం శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి ధనుష్‌కోడి వరకు ఈది అందరి మన్ననలు అందుకుంది. తారగై సర్టిఫైడ్ డైవర్‌గా మారడంలో ఆమె తండ్రి అరవింద్ తరుణ్‌శ్రీ కృషి ఉంది. తండ్రి స్ఫూర్తితోనే ఆమె ఈ రంగంలోకి వచ్చింది. అరవింద్ ప్రొఫెషనల్ స్క్యూబా డైవర్, ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్. తారగై ఎనిమిదేళ్ల వయసులోనే డైవింగ్ చేయడం మొదలుపెట్టింది. "తారగై పుట్టిన మూడో రోజే నీళ్లలో దింపాను. తొమ్మిదినెలలు వచ్చే సరికి నీళ్లపై తేలియాడింది. రెండున్నర ఏళ్ల వచ్చేసరికి ఈదడం నేర్చుకుంది" అని తండ్రి అరవింద్ చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు తారగై సముద్రంలో నుంచి 1200 కేజీల ప్లాస్టిక్‌ను తొలగించింది.



ఎనిమిదో యేటనే స్క్యూబా డైవింగ్

తారగై తన ఎనిమిదో పుట్టిన రోజున మొదటిసారి స్క్యూబా డైవ్ చేసింది. "మొదటిసారి స్క్యూబా డైవ్ చేసిన రోజు ఎప్పటికీ మరిచిపోలేను. ఆ రోజు నా ఎనిమిదో పుట్టిన రోజు. సముద్రంలో జెల్లీ ఫిష్, జాక్‌ఫిష్, కోరల్స్ చూడటం ఎంతో ఆనందాన్నిచ్చింది" అంటుంది తారగై. ప్రతి ఆదివారం తారగై బీచ్‌లను శుభ్రం చేసేందుకు వెళుతుంది. అదే సమయంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తూ ఉంటుంది. "అందరినీ నేను కోరేది ఒక్కటే. ప్లాస్టిక్ బదులుగా క్లాత్ బ్యాగ్‌ను ఇవ్వమని అడగండి. ఈ ఒక్క పని ఎంతో మార్పును తీసుకొస్తుంది" అని అంటుంది తారగై. కోవెలాంగ్ నుంచి నీలాంకరి వరకు 18 కి.మీ దూరం ఈది ప్రపంచరికార్డును నెలకొల్పింది. 'సేవ్ ద ఓసియన్' థీమ్‌తో ఈ రికార్డును సాధించింది. "నేను ఈదడం ప్రారంభించగానే వర్షం మొదలయింది. నీళ్లు బాగా చల్లగా ఉన్నాయి. కానీ ఏడుగంటల ప్రయాణాన్ని చాలా ఎంజాయ్ చేశాను" అని అంటుంది. సముద్ర కాలుష్యంపై స్కూల్స్, బీచ్‌లలో అవేర్‌నెస్‌ను కల్పించడం కోసం తండ్రీ కూతుళ్లు ఇద్దరూ కలిసి ఒక డాక్యుమెంటరీ రూపొందించి విడుదల చేశారు.



హవాయి మాంక్ సీల్స్, పసిఫిక్ లాగర్‌హెడ్ సముద్ర తాబేళ్లు వంటి అరుదైన కొన్ని రకాల జాతులు ప్లాస్టిక్ చెత్త వల్ల అంతరించి పోయే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఇండియా తీరప్రాంతం 33.6 శాతం మేర కోతకు గురైనట్టు అధ్యయనాల్లో వెల్లడయింది. ప్రకృతికి వ్యతిరేకంగా వెళ్లడం మంచిది కాదని, ప్లాస్టిక్ తయారీని నియంత్రించడం చాలా అవసరమని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. అందరూ తారగై ఆరాధనను స్ఫూర్తిగా తీసుకుని సముద్ర కాలుష్యాన్ని నివారించాల్సిన అవసరం ఉంది.


స్వచ్ఛందంగా ఖాళీ చేస్తే 'డబుల్'తో పాటు
పాతిక వేలు
మూసీ పరీవాహక
ప్రాంత వాసులకు ప్రభుత్వం ఆఫర్
హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్ల ప్రకటన
లంక బస్తీలో విషాదం..
గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి 11

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

రేషన్‌కార్డుల దరఖాస్తులకు బ్రేక్
ఫ్యామిలీ డిజిటల్ కార్డుల నేపథ్యంలో నిర్ణయం
రేషన్ సహా అన్ని సంక్షేమ పథకాలు వీటితోనే..
నేటి నుంచి ఫ్యామిలీ
డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టు 9

గురువారం | 3-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 169 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

'ఫీజు' బకాయిలు
₹ 6 వేల కోట్లు



బీఆర్ఎస్ హయాంలోనే చెల్లింపులు బంద్
కాంగ్రెస్ సర్కారు వచ్చినా విడుదల కాని నిధులు
వన్ టైం సెటిల్‌మెంట్‌పై ప్రభుత్వం దృష్టి
సాధ్యం కాదని చెప్తున్న కాలేజీల యాజమాన్యాలు
బీటెక్, బీఫార్మసీ పాసైన విద్యార్థులపై బకాయిల కోసం ఒత్తిడి.. సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరణ
తాజాగా నర్సింగ్ విద్యార్థులదీ ఇదే పరిస్థితి
స్టాఫ్ నర్సుల భర్తీ నేపథ్యంలో సర్టిఫికెట్ల కోసం క్యూ
60-70 వేలు ఇవ్వాల్సిందేనంటున్న కళాశాలలు
డీఎంఈకి ఫిర్యాదులు.. విచారణకు కమిటీ

ప్రైవేట్ నర్సింగ్ కాలేజీల్లో జీఎన్ఎం కోర్సు చేసిన విద్యార్థులు.. సర్టిఫికెట్ల కోసం వెళ్తే యాజమాన్యాలు రూ.60-70 వేలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని.. ఆ డబ్బును విద్యార్థులే చెల్లించాలని అంటున్నాయి. స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తు గడువు దగ్గర పడుతుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. డీఎంఈకి ఫిర్యాదు చేస్తున్నారు.

ప్రైవేట్ కాలేజీల్లో బీటెక్, బీ ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులదీ ఏటా ఇదే పరిస్థితి. ఫైనల్ ఇయర్ తర్వాత సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ససేమిరా అంటుండడంతో అంత మొత్తం కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. కాలేజీల నుంచి సర్టిఫికెట్లు సమయానికి తెచ్చుకోలేక పీజీ ఈసెట్‌లో సీటు సాధించీ.. వదులుకున్న వారు వందల్లో ఉండడం గమనార్హం.

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.6,000 కోట్లకు పైగా పేరుకుపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్ల తరబడి నిధులు విడుదల చేయకపోవడంతో భారీగా బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. గత ఏడాది డిసెంబరు 7న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు విడుదల చేయలేదు. దీంతో ఆ

మిగతా 9వ పేజీలో...



9 నెలల్లో 111 లక్షల కోట్లు!

షేర్ బజారులో కాసుల పంట
భారీగా పెరిగిన మదుపరుల సంపద
దేశ మార్కెట్ చరిత్రలో ఇదే తొలిసారి
సెన్సెక్స్ 12,026 పాయింట్ల వృద్ధి

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్ ఈ ఏడాది కనీవినీ ఎరుగని వేగంతో దూసుకెళ్తోంది. ఓవైపు ప్రపంచ దేశాల్లో ఉద్రిక్తతలు కొత్త మలుపులు తీసుకుంటుండగా.. మరోవైపు దేశీయ ఈక్విటీ మార్కెట్ సూచీలు సరికొత్త రికార్డులు నమోదు చేస్తున్నాయి. తొమ్మిది నెలల్లోనే స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 12,026 పాయింట్లు (16.64%) లాభపడి మదుపరులకు సిరుల పంట పండించింది. జనవరి-సెప్టెంబరు మధ్య మదుపరుల సంపద రికార్డు స్థాయిలో రూ.110.57 లక్షల కోట్లు పెరిగింది. తొమ్మిది నెలల్లో ఈ స్థాయిలో పెరగడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం. గత కొన్నేళ్లుగా స్టాక్ మార్కెట్లో చిన్న మదుపరుల సంఖ్య భారీగా పెరుగుతోంది. డీమ్యాట్ ఖాతాల సంఖ్య 2020 మార్చిలో 3.6 కోట్ల వరకు ఉండగా.. 2024 జూన్ నాటికి 16 కోట్లకు పెరిగింది. చిన్న మదుపరుల పెట్టుబడులు పెరగడం బుల్ జోరుకు మరింతగా తోడ్పడ్డాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మార్కెట్ స్వల్పకాలికంగా కొంత దిద్దుబాటుకు లోనైనప్పటికీ, దీర్ఘకాలికంగా సానుకూలంగానే కనిపిస్తోందంటున్నారు. మార్కెట్ దిద్దుబాటు సమయంలోనూ స్టాక్ ఆధారిత పెట్టుబడికి అవకాశాలు లభించనున్నాయని, దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి ఇది సరైన సమయమని పేర్కొన్నారు.

నాగచైతన్య, సమంత విడాకులు..
కేటీఆర్ వల్లే..

ఆయనతో పడలేకే ఇద్దరు, ముగ్గురు హీరోయిన్లు పెళ్లి చేసేసుకున్నారు









అధికారంలో ఉన్నప్పుడు కొందరు హీరోయిన్ల ఫోన్లనూ ట్యాప్ చేయించి.. బెదిరించారు
తాను డ్రగ్స్ వాడుతూ వారికీ అలవాటు చేశారు
మంత్రి కొండా సురేఖ విపరీత వ్యాఖ్యలు
ఖండించిన నాగార్జున కుటుంబం, సమంత
తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోండి!
మా కుటుంబంపై మీ ఆరోపణలు పూర్తిగా అబద్ధం
మీ ప్రత్యర్థులను విమర్శించేందుకు మా జీవితాల్ని వాడుకోవద్దు.. సురేఖ వ్యాఖ్యలపై నాగార్జున ట్వీట్
విడాకుల వెనుక రాజకీయ కుట్ర లేదు: సమంత
ఒక మహిళా మంత్రి రాక్షసిలా మారి అసత్యాలు ప్రచారం చేయడం సిగ్గుచేటు: నటి అమల
క్షమాపణ చెప్పకుంటే పరువునష్టం దావా
కొండా సురేఖకు కేటీఆర్ లీగల్ నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సినీ హీరో నాగచైతన్య, సమంత విడాకులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆరే వంద శాతం కారణమంటూ మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రచురించడానికి వీల్లేని స్థాయిలో ఆమె చేసిన మరిన్ని ఆరోపణలు.. తీవ్ర దుమారం రేపాయి. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన సురేఖ.. పలు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌తో పడలేక ఇద్దరు, ముగ్గురు హీరోయిన్లు పెళ్లిళ్లు చేసేసుకున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కొంత మంది హీరోయిన్ల ఫోన్లనూ ట్యాప్ చేయించారని.. వారి మాటలను రికార్డ్ చేసి బెదిరించారని ఆరోపించారు. తాను డ్రగ్స్ వాడడమే కాక వారికి కూడా అలవాటు చేశారని అన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు ఎంతో మంది సినీ యాక్టర్ల జీవితాలతో ఆడుకుని, వారిని

మిగతా 12వ పేజీలో...

పశ్చిమాసియా ఉద్రిక్తతలు..
భారత్‌పై తీవ్ర ప్రభావం!

చమురు దిగుమతుల్లో 80% గల్ఫ్ నుంచే..
పశ్చిమాసియాతో సన్నిహిత వాణిజ్య సంబంధాలు
అక్కడ ఉద్యోగాల్లో 90 లక్షల మంది భారతీయులు
దేశానికి భారీ ఎత్తున విదేశీ మారక ద్రవ్యం
ఘర్షణలతో విదేశాంగ విధానంపైనా ప్రభావం

న్యూఢిల్లీ, అక్టోబరు 2: ఇరాన్ నుంచి క్షిపణులు ఇజ్రాయెల్ పైకి దూసుకెళ్తున్నాయి.. ఇజ్రాయెల్ దళాలు లెబనాన్‌లో దాడులు జరుపుతున్నాయి.. మనకు కొన్ని వేల కి.మీ.ల దూరంలో ఈ పరిణామాలు జరుగుతున్నా.. మన మీద ఇవి తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయి. పశ్చిమాసియాతో భారత్‌కు సన్నిహిత సంబంధాలు ఉండటమే దీనికి కారణం. చమురు దిగుమతులు, పలు రకాల ఉత్పత్తుల

మిగతా 10వ పేజీలో...



ఇజ్రాయెల్ వైమానిక దాడులతో లెబనాన్‌లోని బీరుట్‌లో జరిగిన విధ్వంసం

వచ్చిన క్షిపణిని వచ్చినట్టే..

ఇరాన్ దాడిని సమర్థంగా అడ్డుకున్న ఇజ్రాయెల్
కొన్ని ఆఫీసులు, నిర్వహణ ప్రదేశాల ధ్వంసం
మినహా పెద్ద స్థాయి నష్టమేమీ జరగలేదని వెల్లడి

ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతున్న ఇజ్రాయెల్

ఇరాక్ గగనతలంలో ఇజ్రాయెల్ జెట్లు.. ఖతార్‌కు ఇరాన్ అధ్యక్షుడు
ఇజ్రాయెల్‌కు దన్నుగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్.. ఇరాన్ క్షిపణుల అడ్డగింత
హెచ్చరికల్లేకుండా మహిళలు, పిల్లల్ని మూకుమ్మడిగా చంపేస్తున్నారు: లెబనాన్
ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన.. మూడో ప్రపంచయుద్ధం అంచున ఉన్నాం: ట్రంప్

10

ధాన్యం టెండర్లలో
దగా!



రైస్ మిల్లుల్లో కనిపించని ధాన్యం
ధాన్యానికి బదులు డబ్బులివ్వాలని మిల్లర్లపై టెండర్ ఏజెన్సీల ఒత్తిడి
టెండరు ధర కంటే రూ. 200 ఎక్కువ ఇవ్వాలని డిమాండ్
ఇరువర్గాల్లో తెగని పంచాయితీ
38 లక్షల టన్నుల్లో 9.5 లక్షల టన్నుల ధాన్యం సొమ్ము రికవరీ
పౌరసరఫరాల సంస్థకు రావాల్సిన 5,700 కోట్ల ఆదాయానికి బ్రేక్

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ధాన్యం టెండర్లలో దగా రాజకీయం నడుస్తోంది. వేలం పాటలో 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీలు.. రైస్‌మిల్లుల నుంచి వడ్లెత్తకుండా పైసల వసూళ్లకు తెగబడటంతో జరగకూడని అక్రమాలన్నీ జరుగుతున్నాయి. ఇరు వర్గాల మధ్య పంచాయితీ వల్ల పౌర సరఫరాల సంస్థకు రావాల్సిన రూ.5,700 కోట్ల ఆదాయానికి బ్రేక్ పడింది. 2022-23 యాసంగి సీజన్‌లో ఈ పంచాయితీ మొదలైంది. రాష్ట్రంలో ధాన్యం నిల్వలు విపరీతంగా పెరగటం, మిల్లింగ్‌లో జాప్యం జరుగుతుండటంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 38 లక్షల టన్నుల

మిగతా 11వ పేజీలో...

ఢిల్లీలో భారీగా డ్రగ్స్ పట్టివేత

రూ. 2 వేల కోట్ల విలువ చేసే 560 కిలోల కొకైన్ సీజ్.. నలుగురు అరెస్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 2: దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.2,000 కోట్లు విలువచేసే 560 కేజీల కొకైన్‌ను దక్షిణ ఢిల్లీ, మెహ్రౌలీలో సీజ్ చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. దీని వెనుక ఆఫ్ఘన్ జాతీయులు నడుపుతున్న అంతర్జాతీయ ముఠా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. సీజ్ చేసిన కొకైన్‌ను ఢిల్లీ పరిధిలో పంపిణీ చేయడానికి సిద్ధం చేసినట్లు సమాచారం. రెండు నెలల క్రితం లభ్యమైన చిన్న క్లూ ఆధారంగా ప్రత్యేక జట్టు తీగ లాగుతూ వెళ్లింది. 2 రోజుల క్రితం.. శనివారం తిలక్‌నగర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు ఇద్దరు ఆఫ్ఘన్ జాతీయులను అరెస్టు చేశారు. అరెస్టయిన హష్మీ మహమ్మద్ వారిస్, అబ్దుల్ నయీబ్ వారిస్ నుంచి పోలీసులు 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. విచారణ సందర్భంగా వారి నుంచి లభ్యమైన సమాచారం ఆధారంగా భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం అంచున...!

ఇజ్రాయెల్ మీద ఇరాన్ ఆర్నెల్ల క్రితం చేసిన దాడికీ, ఇప్పుడు జరిగిన దానికీ తేడా స్పష్టం. ఏప్రిల్‌లో వందలాది క్షిపణులు, డ్రోన్లు ఇజ్రాయెల్ మీదకు పంపి అంతకుపక్షం రోజుల ముందు సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్ భవనంమీద క్షిపణి దాడితో రివల్యూషనరీ గార్డ్స్ అత్యున్నతస్థాయి కమాండర్లతో సహా పన్నెండుమందిని ఇజ్రాయెల్ చంపివేసినందుకు ప్రతీకారం తీర్చుకుంది. కానీ, ఆ దాడిలో ఇజ్రాయెల్‌కు జరిగిన నష్టం అతి స్వల్పం. కక్షతీర్చుకొనే తన లక్ష్యం నెరవేరిందని, ఆపరేషన్ ముగిసిందని ఇరాన్ వెంటనే ఓ ప్రకటన చేసింది. ఇది ప్రతీకాత్మక దాడేకానీ, ప్రతీకారం కాదని అందరికీ అర్థమైంది. తమ పొరుగుదేశాలకు ఈ దాడికి సంబంధించి డెబ్బయ్‌రెండు గంటల ముందస్తు సమాచారాన్ని అందచేశానని కూడా ఇరాన్ అప్పట్లో ప్రకటించింది. ఇజ్రాయెల్, దాని మిత్రదేశాలకు ఆత్మరక్షణకు తగినంత సమయమూ లభించింది, మరోపక్క ఇరాన్ తన శపథాన్ని నిలబెట్టుకున్నట్టూ అయింది. ముప్పైమూడేళ్ళ తరువాత ఇజ్రాయెల్‌మీద జరిపిన ఆ చర్యతో, ఎంత రెచ్చగొట్టినా ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్‌మీద దాడికిదిగదన్న భ్రమలు కూడా తొలగిపోయాయి. ఆర్నెల్లక్రితంతో పోల్చితే ఇప్పటిదాడి తీవ్రమైనది. ఈ మారు ఖరీదైన క్షిపణులను ఇరాన్ ఉపయోగించిందని, ఇజ్రాయెల్ రక్షణఛత్రాన్ని దాటిమరీ ఆ దేశాన్ని దెబ్బకొట్టాలన్న కసి అందులో ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. హిజ్బొల్లా సీనియర్ నాయకుడు హసన్ నస్రల్లాను హతమార్చడమే కాక, లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ యుద్ధట్యాంకర్లు చొరబడుతున్న తరుణంలో ఈ దాడి జరిగింది. దీనికితోడు ఇరాన్ ప్రజలను దుర్మార్గులైన వారి పాలకుల నుంచి అతిత్వరలోనే విముక్తి చేస్తానంటూ నెతన్యాహూ వీరోచిత వ్యాఖ్యలు కూడా చేశారు. ఇరాన్‌లో ఆవగింజంత ప్రదేశం కూడా తన ఆయుధానికి దూరంగా ఉండలేదని హెచ్చరికలు చేశారు. పశ్చిమాసియాలో ప్రతీ అంగుళం తన రాడార్‌లో ఉందన్నారు. హమాస్, హిజ్బొల్లాల తరువాత, ఇరాన్ పాలకుల పనిపట్టడమే లక్ష్యంగా నెతన్యాహూ అడుగులు పడుతుంటే సహనంగా ఉండటం అసాధ్యం. మొత్తానికి యుద్ధాన్ని విస్తరించాలన్న నెతన్యాహూ వ్యూహమైతే నెరవేరుతున్నట్టు ఉంది.

గతంలో ఇరాన్ దాడిచేసిన తరువాత అమెరికా చెప్పిన మేరకు ఇజ్రాయెల్ కూడా వెంటనే ప్రతీకారం తీర్చుకొనే పనిలో పడలేదు. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నం. యాభైయేళ్ల తరువాత ఇజ్రాయెల్‌కు దక్కిన అవకాశాన్ని వదులుకోకూడదని, ప్రతీకారం పేరిట ఇరాన్ అణుస్థావరాలనుంచి చమురుకేంద్రాలవరకూ దేనినీ వదలకుండా సర్వమూ నేలమట్టం చేయాలని ఇజ్రాయెల్ కీలకనేతలంతా తీర్మానిస్తున్నారు, తదనుగుణంగానే పాలకులు కూడా సంసిద్ధత ప్రకటిస్తున్నారు. ఇరాన్‌కు రక్షణకవచంలాగా వ్యవహరించే హిజ్బొల్లా తీవ్రంగా దెబ్బతినివున్న ప్రస్తుత స్థితిలో ఇజ్రాయెల్‌కు ఇది మరింత సులభం. ప్రతీకారం తప్పదంటూ ఇజ్రాయెల్ పక్షాన అమెరికా దానిమిత్రదేశాలు ఇరాన్‌కు చేస్తున్న హెచ్చరికలను, తరలివెడుతున్న యుద్ధ విమానాలు, నౌకలను, ఇరాన్‌కు అనుకూలంగా రష్యా బరిలోకి దిగుతున్న సూచనలను గమనించినప్పుడు పరిస్థితి కట్టుతప్పుతున్న విషయం స్పష్టమవుతోంది. అమెరికా అధ్యక్షస్థానంలో నోరులేని బైడెన్ ఉండగానే తాను అనుకున్నది చేసుకుపోవాలని నెతన్యాహూ ఆలోచన. ఇజ్రాయెల్ మీద హమాస్ అమానుషదాడికి ప్రతీకారంగా ఆరంభించిన యుద్ధానికి ఏడాది పూర్తవుతున్న తరుణంలో దానిని అక్కడికే పరిమితం చేయాలని నెతన్యాహూ అనుకోవడం లేదు. గాజాను దుంపనాశనం చేసి, హమాస్‌ను తీవ్రంగా దెబ్బతీసినప్పటికీ, బందీలుగా ఉన్న మిగతా ఇజ్రాయెలీలను హమాస్‌నుంచి విడిపించలేదన్న అప్రదిష్ట ఆయనకు తప్పడంలేదు. ఈ దశలో హిజ్బొల్లా అధినేతను మట్టుబెట్టిన తరువాత నెతన్యాహూకు ఇంట్లో కాస్తంత గౌరవం పెరిగిందని అంటారు. ఈ వేడిలోనే గాజా, లెబనాన్, యెమన్, సిరియా, ఇరాన్ వరకూ యుద్ధాన్ని విస్తరించి శత్రుసంహారం పూర్తికావించాలన్నది ఆయన ఆలోచన కావచ్చు. ఇజ్రాయెల్ సైనికస్థావరాలమీదా, మొసాద్ కార్యాలయంమీదా క్షిపణులు ప్రయోగించిన తరువాత, కక్ష తీరింది, ఇక చాలు అన్న అర్థంలో ఇరాన్ ఓ ప్రకటన చేసింది. కానీ, ఇరాన్‌ను ఎప్పుడు ఎలా దెబ్బతీయాలన్నది కాక, అది ఏ స్థాయిలో ఉండాలన్నదే ఇజ్రాయెల్ ఆలోచిస్తోందని వార్తలు వస్తున్నాయి. యుద్ధం విస్తరిస్తూ, దౌత్యానికి తావులేని దిశగా పరిణామాలు వేగంగా మారుతున్న స్థితిలో మిగతా ప్రపంచం ముందుకు రావడం అవసరం.

‘ఎర్రగుర్తులు’ పెట్టడానికి ఎందుకు తొందర?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం, తెలంగాణ సర్కారుకు రాష్ట్ర హైకోర్టు తగిన విధంగా వడ్డింపులు చేశాయి. రెండు చోట్లా జరిగినవి వేరు వేరు అయినా, వాటి మంచి చెడ్డలు ఏమయినా, న్యాయ సందేశంలో ఉమ్మడి అంశం ఒకటే, "అత్యుత్సాహం మంచిది కాదు." పాలకులు వాళ్ల రాజకీయ అవసరం కోసమో, ‘అభివృద్ధి’ పందెంలో భాగంగానో తూకం తప్పి దూకుడుగా పరుగులెత్తుతారు. స్పీడ్ బ్రేకర్లుండడం వారికి, ప్రజలకూ కూడా ఆరోగ్యకరం.

రాజకీయానుభవం, నాయకత్వ ప్రతిభ తప్ప పాలనానుభవం లేని రేవంత్‌రెడ్డి ఆలోచనలో కొంత అవగాహన లోపిస్తే అర్థం చేసుకోవచ్చు. మంచీచెడ్డా చెప్పవలసిన సచివులు, సహచరులు, సలహాదారులు వారి విధి నిర్వహణలో విఫలం కావడం ఏ మాత్రం క్షమించలేని విషయం. ఆక్రందనల, శాపనార్థాల వీడియోలు వైరల్ కాకముందే, ఆత్మహత్యలు జరగక ముందే ‘గాలి మార్పు’ను వార్తాహరులు గమనించి, ఏలికల చెవిన వేసి ఉండవలసింది. వారం వారం రేటింగ్ ఇచ్చే అభిప్రాయసేకరణలు మన దేశంలో జరగవు కానీ, జరిగితే కనుక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ రెండు వారాల కిందటికి, ఇప్పటికీ చాలా మారి ఉంటుంది. బలమైన ప్రతిపక్షం, కాచుక్కూర్చున్న జాతీయపక్షమూ ఉన్నచోట, ఇంత అజాగ్రత్త పనికిరాదు.

చినుకు పడగానే చిరాకుగా తయారయ్యే హైదరాబాద్ ట్రాఫిక్‌కు కారణం, వర్షపునీరు ప్రవహించే దారులు మూసుకుపోవడమేనని, చిన్నాచితకా జలాశయాల చుట్టూ ఆక్రమణలూ, ఎవరికివారు మట్టి గుమ్మరించి పెంచుకునే ఎత్తులతో అష్టావక్రంగా తయారయిన వీధులూ వానాకాలం నగరజీవితాన్ని నానా ఛిద్రం చేస్తున్నాయని ప్రజలలో గుర్తింపు పెరిగింది. ప్రతి ఏటా, వర్షం కురియగానే పాత చెరువులు ప్రత్యక్షమై, ఆక్రమణలను బహిరంగపరుస్తున్నాయి. ప్రముఖ సినీనటుడి ఉల్లంఘన మీద బుల్‌డోజర్ నడిపిస్తే జనం ఓహో అనుకున్నారు. ఎడాపెడా బిల్డింగులు కూలుస్తుంటే, ఎంతటివారినైనా ఖాతరుచేయని బుల్‌డోజర్‌గా కళ్లు విప్పార్చి చూశారు. ఆ రెండు రోజుల సాహసం తెచ్చిన ప్రతిష్ఠ మీద హైదరాబాద్ ప్రజలు కొంతకాలం హైడ్రాను భరించారు. ఆ తరువాత కొంత ‘దృశ్యం’ మారుతూ వచ్చింది. పేదవాళ్లుగా, దిగువ మధ్యతరగతి జీవులుగా కనిపిస్తున్న మనుషులు బేలగా, దీనంగా ఆర్తనాదాలు చేస్తుంటే చూడడం కష్టం. ప్రభుత్వం చెబుతున్న ఆదర్శానికి వాస్తవానికీ పొంతన కుదరనప్పుడు, పెదవి విరుపు మొదలయింది. కోర్టును ఖాతరు చేయని కూల్చివేతలు సహజంగానే అహంకారాన్ని ధ్వనించాయి.

హైదరాబాద్‌లో ఉండిన జలమార్గాలు, జలాశయాలు అన్నీ మూసీ ప్రవాహ వ్యవస్థలోనివే. నగరానికి ఒక ఎత్తు పల్లాల, చెట్టూ చేమల నైసర్గికత ఉంటుంది. నీరు పల్లానికి ప్రవహిస్తుంది. మనుషులు తమ అవసరాల కోసం కొన్ని చోట్ల నీటిని నిలుపుకుంటారు. తక్కిన నీటిని జాగ్రత్తగా వెలుపలికి పంపాలి. ఇది కూడా నదేనా, అని వెక్కిరించే వాళ్లుంటారు కానీ, ఇది నాలుగువందలేళ్ల పైబిలుకు చరిత్రలో అనేకమార్లు తన ఉధృతరూపాన్ని ప్రదర్శించింది. 1908, మనకు తెలిసిన తాజా ‘ముచికుందానది జలప్రళయము’. ఆ తరువాత నగరానికి వరద నివారణ వ్యవస్థ ఒకటి ఏర్పడింది. అప్పటి జనాభాను, నగరభూభాగాన్ని దృష్టిలో పెట్టుకున్నది ఆ వ్యవస్థ ప్రణాళిక. నాలుగు దశాబ్దాలు గడిచేసరికి చాలనితనం ఎదురైంది. సంస్థాన కాలంలో ఉండిన పట్టింపు, విధానవేగం, హైదరాబాద్‌కు స్వతంత్ర భారతంలో లభించలేదు. అందరూ ఈ నగరాన్ని ఆబగా అనుభవించాలనుకోవడమే తప్ప, దీని మీద పడిన ఒత్తిడిని, పెరుగుతున్న మంచినీటి కొరతను, మురుగునీటి తీవ్రతని తగ్గించాలని చూడలేదు. నగరాన్ని తాము గొప్పగా తీర్చిదిద్దామని చెప్పుకోవాలన్న ఆత్రుతే తప్ప, హైదరాబాద్ ఆత్మ కాంక్రీట్ అరణ్యంలో, సహజీవన రాహిత్యంలో అణగారిపోతున్నదన్న గుర్తింపు ఏలికలకు లేకపోయింది. ఈ అవకతవక బీభత్స గందరగోళ అభివృద్ధిలో, టౌన్ ప్లానింగ్ ఎగిరిపోయింది, నాలుగు గజాల నేలలో నిలబడడం నిరుపేదలకు ప్రాణావసరమైంది, వెంచర్లు వెంచర్లుగా కంచెలు కట్టి కబ్జాచేయడం పెద్దలకు దర్జా అయిపోయింది. దళారులు, అవినీతి ఉద్యోగులు, రాజకీయ నాయకులు, అసాంఘిక శక్తులు హైదరాబాద్‌ను అంగుళం అంగుళంగా ఆరగించారు. ఎత్తుపల్లాలు తారుమారయ్యాయి, వాననీటికి దారులు మూసుకుపోయాయి, చెరువులు కుంచించుకుపోయాయి, మూసీ ఒక పాయ అయిపోయింది. దాని కడుపు బస్టాండ్ అయింది.



> అన్నిటికంటె ముందు ప్రభుత్వం గ్రహించవలసింది, ప్రజలు ఈ సుందరీకరణ ప్రాజెక్టుకు శత్రువులు కాదు. మీరు పొరుగు దేశంతో యుద్ధం చేయబోవడం లేదు. ప్రజలను భాగస్వాములను చేసుకోండి. ఇందులో వారికి కూడా ప్రయోజనం ఉంటుందని చెప్పండి, ప్రయోజనం ఉండేట్టు చూడండి. అధికారులను ఇళ్లపైకి తోలి భయపెట్టకండి. ఆత్మహత్యలకు, గుండెపోట్లకు ఆస్కారం ఇవ్వకండి. మూసీ లాంటివారే జనం కూడా. దారులు మూస్తే, ముంచేస్తారు!

చేయాలి. మూసీని బాగుచేయాలి. ముక్కులు తెరుచుకునే లాగా, కళ్లకు పండగ లాగా చేయాలి. దాని దారి నిండా నీళ్ల పరవళ్ల తొక్కాలి. రెండు పక్కలా చెట్లు బారులు తీరాలి. పడవల మీద విహరించాలి. అలసిన మనసుల సాయంత్రాలన్నీ అక్కడ సేదతీరాలి. ఇటువంటి కలలన్నీ కేసీఆర్‌కూ, రేవంత్‌రెడ్డికి మాత్రమే ఉండవు. హైదరాబాద్ ఇష్టమైనవారందరికీ, ఇష్టపడేవారందరికీ అవే కలలు. కానీ, ఈ కలల్ని ఋుళిపించి, జీవితాలను కకావికలం చేయబోయే ముందు అధికారపక్షాలు, ప్రతిపక్షాలు అన్నీ కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి!

ఈ నగరాన్ని వికృతపరచిందెవరు? నిందలు వేస్తున్నది ఎవరిమీద? నట్టింట్లో చెరువు తిష్ఠ వేయాలని ఎవరికి ఉంటుంది? ఒకనాటి వేల చెరువులు ఏమయ్యాయి? దయలేని వ్యవస్థ, మెతుకు కోసం అవస్థ కాకపోతే, మురికిగుంటగా మారిన ముచికుంద కడుపులో ఎవరు మాత్రం ఎందుకు తలదాచుకుంటారు? ప్రియురాలిని చూడడానికి వెళ్లే రాకుమారుడిని ఉక్కిరిబిక్కిరి చేసి వంతెన కట్టించిన అలనాటి మూసీ ప్రవాహం ఏది? నదిని చేపల్లాగా, ఈ నగరాన్ని మనుషులతో నింపమని కులీ కుతుబ్ షా దేవుణ్ణి ప్రార్థించాడు కదా, మరి నదిని కొరుక్కుతింటున్న ఈ తిమింగలాలు ఎక్కడివి? వాటిని ఎవరు కాపాడుతున్నారు?

మూసీ కేవలం హైదరాబాద్‌దే కాదు. ఇప్పుడు దామగుండం నేవీ రాడార్‌తో పచ్చదనాన్ని రాల్చుకోబోతున్న అనంతగిరి కొండల్లో పుట్టి, తెలంగాణ సరిహద్దులో వాడపల్లి దగ్గర కలిసే కృష్ణ దాకా దీనిది చాలా పెద్ద ప్రయాణం. నగరంలోకి అమాయకంగా, స్వచ్ఛంగా వచ్చిన మూసీ, విషతుల్యమై, పాషాణప్రాయమై, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లోకి ప్రవహిస్తుంది. మూసీ నీటితో ఆ జిల్లాల్లో 64 చెరువులు నిండుతాయట. ఈ నదీ ప్రక్షాళన నగరవాసులకే కాదు, ఆ జిల్లాల్లోని రైతాంగానికి చాలా అవసరం. కానీ ఈ మంచి పనిని మనుషులను వెళ్లగొట్టడంతో, ఇళ్లు కూలగొట్టడంతో ఎందుకు ప్రారంభిస్తున్నారు? అలీబాబా నలభై దొంగల లాగా, ఇళ్ల మీద ఎర్ర గుర్తులెందుకు పెడుతున్నారు? మురికి మూలం ఎక్కడో గుర్తించడంతో మొదలు పెట్టాలి కదా, మనుషులతో మాట్లాడడంతో మొదలు పెట్టాలి కదా?

మూసీ మీద జరిగిన అఘాయిత్యాలలో ముఖ్యమైనది దాని ప్రారంభ కేచ్‌మెంట్ ఏరియాలో నియంత్రణ లేని నిర్మాణాలు. న్యాయస్థానం కల్పించుకుని 111 జీవో ద్వారా రక్షణ కల్పించినప్పటినుంచి, దాన్ని ఎట్లా ఎత్తివేద్దామా అని ఆలోచిస్తూ వస్తున్న నేతలు. అసలు మూసీకి క్యాచ్‌మెంట్ ఎందుకు, ఆ అవసరాన్ని తీసేస్తే, 111 కూడా తీసేయవచ్చును కదా అన్న ఆలోచన బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చింది. మూసీ పునరుద్ధరణ, ప్రక్షాళన ఆలోచన ఆ ప్రభుత్వానిదే. కానీ, తరువాత దాన్ని కాళేశ్వరం గొలుసు జలాశయాలతో ముడిపెట్టారు. కేశవాపూర్ చెరువు నుంచి ఉస్మాన్, హిమాయత్ సాగర్‌లకు నీరు తరలిస్తే, ఈ క్యాచ్‌మెంట్ గొడవ ఉండదని, 111 పీడ విరగడ అవుతుందని ఆలోచన. నోబెల్ బహుమతి ఇవ్వదగ్గ గొప్ప ఆలోచన! మూసీని నలువైపులా మూసేసి, కేశవాపూర్ వైపులతో నీరు నింపవచ్చు, క్యాచ్‌మెంట్ ఏరియా అంతటా యథేచ్ఛగా రియలెస్టేట్‌ను వర్ధిల్లచేస్తే, హైదరాబాద్ జంట జలాశయాలు నియంత్రిత వ్యవస్థలు అవుతాయి, సమస్యలు ఏవీ ఉండవు అన్నది ఆ ఆలోచనకు వివరణ. కానీ, నీటికి జ్ఞాపకశక్తి అమోఘం. దారులు మూసేసినప్పుడే కదా అది వెల్లువయ్యేది. క్యాచ్‌మెంట్ ఏరియా అంతటా అరాచకంగా భవనాలు నిర్మిస్తే, కొండల్లో పుట్టిన నీరు



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఎక్కడికి పోతుంది? ఏ దారీ లేకపోతే ఫోర్త్ సిటీకి పోతుంది. ప్రమాదం బదిలీ అవుతుంది.

ప్రభుత్వం వారూ, ముందు కాస్త ఆగి, ఊపిరి పీల్చుకోండి. ఏదో మునిగిపోతున్నట్టు కొంపలు కూల్చే కార్యక్రమం చేయడం కాకుండా, మొత్తం విషయాన్ని స్థిమితంగా ఆలోచించడంతో పని మొదలుపెట్టాలి. రివర్ బెడ్ అని మీరు సక్రమంగా గుర్తించిన ప్రాంతంలో ఉన్నవారి విషయంలో ఏ చర్యా తీసుకోకుండా నిలిపివేయండి. మీరు తక్కిన అన్ని పనులూ చేసి, మూసీలో మంచినీరు ప్రవహించే రోజున వారిని, అవసరమైతే మాత్రమే, తగిన న్యాయ పరిహారంతో తరలించండి. ఎన్నికల సమయంలో ఏదో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని వాగ్దానం చేశారు కదా, ఆ విలువలో భాగంగా, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి. నిపుణులతో, ప్రజాకార్యకర్తలతో, మేధావులతో మాట్లాడండి. నది వెంట ఉన్నవారు, నదితో ముడిపడినవారు, నగరానికి

> ఈ మంచి పనిని మనుషులను వెళ్లగొట్టడంతో, ఇళ్లు కూలగొట్టడంతో ఎందుకు ప్రారంభిస్తున్నారు? అలీబాబా నలభై దొంగలలాగా, ఇళ్ల మీద ఎర్ర గుర్తులెందుకు పెడుతున్నారు? మురికి మూలం ఎక్కడో గుర్తించడంతో మొదలు పెట్టాలి కదా, మనుషులతో మాట్లాడడంతో మొదలు పెట్టాలి కదా?

వెలుపల నది లబ్ధిదారులు అందరితో విస్తృత స్థాయిలో సంప్రదింపుల ప్రక్రియ చేపట్టండి. నిర్వాసితులయ్యేవారు కానీ, ఏదో రకంగా ఎంతో కొంత కోల్పోయేవారిని గుర్తించి, వారి సామాజికార్థిక సమాచారాన్ని సేకరించి, క్రోడీకరించండి. వృత్తి ఆక్రమణదారులతో కఠినంగా ఉండండి. పలుకుబడి, ధనమదంతో ఉల్లంఘనలకు పాల్పడేవారితో నిర్దాక్షిణ్యంగా వ్యవహరించండి. మూసీ నదీగర్భం, బఫర్ జోన్‌కు సంబంధించిన పటాలను, ప్రాజెక్టు పూర్తి నివేదికను, ప్రభుత్వం వారి ఇతర ఆలోచనలను బహిరంగపరచి, చర్చకు ఆహ్వానించండి. ఏదీ దాపరికంతో చేయకండి. ఏదైనా అంతర్జాతీయ లేదా విదేశీ ఆర్థిక సంస్థ గనుక ప్రభుత్వం మీద కూల్చివేతలకు ఒత్తిడి చేస్తుంటే ఆ విషయం కూడా ప్రజలకు చెప్పండి, అనుమానాలకు, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకండి. ఈ సుందరీకరణ ప్రాజెక్టుకు ఖర్చు ఎంత పెట్టగలరో ముందే ఒక అవగాహన ఏర్పరచుకుని, ఆ తరువాత పరిహార, పునరావాస కల్పనల గురించి ఆలోచించండి. మీరు చెబుతున్న ప్రకారం మూసీకి ఇరుపక్కలా ఉన్న నివాస భవనాలను భూసేకరణ పరిధిలోకి తీసుకువస్తే, లక్షా యాభైవేల కోట్లు ఏ మూలకూ సరిపోవు. గణితం బాగా తెలిసిన అధికారులను, కన్సల్టెంట్‌లను నియమించుకోండి.

అన్నిటికంటె ముందు ప్రభుత్వం గ్రహించవలసింది, ప్రజలు ఈ ప్రాజెక్టుకు శత్రువులు కాదు. మీరు పొరుగు దేశంతో యుద్ధం చేయబోవడం లేదు. ప్రజలను భాగస్వాములను చేసుకోండి. ఇందులో వారికి కూడా ప్రయోజనం ఉంటుందని చెప్పండి, ప్రయోజనం ఉండేట్టు చూడండి. అధికారులను ఇళ్లపైకి తోలి భయపెట్టకండి. ఆత్మహత్యలకు, గుండెపోట్లకు ఆస్కారం ఇవ్వకండి. మూసీ లాంటివారే జనం కూడా. దారులు మూస్తే, ముంచేస్తారు!

అజ్ఞానం కాదు, హిపోక్రసీ!

ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా "2026 కల్లా మావోయిస్టులను ఏరిపారేస్తాం’ అన్న మాటకు వ్యతిరేకంగా సీపీఐ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ‘మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా?’ అంటూ ఆంధ్రజ్యోతిలో (సెప్టెంబర్ 24) రాసిన వ్యాసం చూస్తే నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. మొత్తం పార్టీని పణంగా పెట్టి గెల్చుకున్న ఆ ఒక్క సీటుకే ఇక్కడేదో రష్యా విప్లవం వచ్చినట్లు ఈ కమ్యూనిస్టు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇక్కడ కార్ల్ మార్క్స్, మావో సేటుంగ్ వంటివారి ఆత్మలన్నీ లేచి కూర్చున్నాయి.

‘ప్రశ్నించే గొంతులు’ అంటూ సాంబశివరావు మోకాలికీ, బోడిగుండుకూ లంకె పెట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలు తుపాకీ గొట్టంలో ఉండవని ఆయనకు తెలియనిదా? నిజానికి నక్సలిజం, పీపుల్స్‌వార్ పుట్టిన, పెరిగిన నాటి పరిస్థితులు ఇపుడు ఈ దేశంలో లేవు. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో దేశం ముందుకు దూసుకుపోతోంది. వ్యవస్థలోని లోపాలను సరిచేయకుండా కొందరు యుద్ధానికి సిద్ధం అంటున్నారు. భిన్న సంస్కృతులు, అనేక విశేషాలు గల భారతదేశంలో మనమున్న ఈ సమాజంలో మావోయిజం నడుస్తుందా? మావో పుట్టిన చైనా ఇవాళ అన్ని సిద్ధాంతాలను పక్కన బెట్టి ప్రత్యామ్నాయ అభివృద్ధిలో దూసుకుపోతోంది.



> ఎందరో పార్లమెంటేరియన్ల గురించి చెప్పిన కూనంనేని సాంబశివరావు ఇప్పుడు మావోయిస్టులను కూడా ఆ పార్లమెంటుకు రమ్మని చెప్పాలి. అడవిలో ఉండి, దేశంపై తిరగబడతాం అంటే సాధ్యపడదు. రష్యాలో స్టాలిన్ కూడా మొదట తన దేశ జాతీయవాదం, తరువాతే కమ్యూనిజం కావాలన్నాడు.

మన దేశంలో దండకారణ్యంలో మిగిలిన దళిత, బహుజన కులాలకు చెందిన మావోయిస్టులు మరణించడమో, లొంగిపోవడమో, పోలీసు బలగాలను దెబ్బతీయడమో చూస్తాం. కానీ మహానగరాల్లో కూర్చొని అడవిలోని వాళ్ళను రెచ్చగొడుతున్న ఈ అర్బన్ నక్సల్స్ గురించి మనం ఆలోచించడం మానేశాం. నగరాల్లో కూర్చొని స్వయంప్రకటిత మేధావులుగా చలామణీ అవుతూ, మావోయిజం వ్యాప్తిచేస్తున్న వాళ్ళ మీద ఉపా కేసులు పెట్టారని సాంబశివరావు బాధపడటం అజ్ఞానమా, అమాయకత్వమా? ఉపా భారత రాజ్యాంగం ద్వారా వచ్చింది అన్న విషయం రోజూ రాజ్యాంగం పట్టుకుతిరిగే వాళ్ళను అడిగితే చెప్తారు కదా! అమాయకులను అరణ్యంలోకి పంపి 1980 నుంచి 2005 వరకు తెలుగు ప్రాంతాల్లోనే ఎన్నో ప్రాణాలు గాల్లో కలిపిన మేధోవర్గం కుటుంబాల్లో ఒక్కరి కుమారుడైనా మరణించాడా?

వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చర్చల పేరిట అడవుల్లోని అన్నలను హైదరాబాద్‌కు పిలిపించారు. వాళ్ళ ముఖాలను టీవీలు, పత్రికల ద్వారా లోకానికి తెలిపి వాళ్ళకు నిలువనీడ లేకుండా చేశారు. ఆ తర్వాత ఎన్‌కౌంటర్లలో ఎందరో నక్సల్స్ మరణించారు. కానీ రోజూ పేపర్లలో వచ్చే వ్యాసాలు, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోనూ, అప్పుడప్పుడూ ప్రెస్ క్లబ్‌లలోనూ జరిగే కార్యక్రమాలు చూస్తే మనం ఉన్నది మావోయిస్టుల రాజ్యంలోనేనేమో అన్న అనుమానం కలుగుతుంది. ఈ మహానగర మావోయిస్టులంతా గుబురు గడ్డాలు పెంచుకొని, రీడింగ్ గ్లాసెస్ పెట్టుకొని విశ్వవిద్యాలయాల్లో మేధావుల్లా నటిస్తూ దేశ వ్యతిరేక చర్యలకు ఆజ్యం పోస్తున్నారు. మావోయిస్టులతో సంబంధాలున్న నేరంపై గతంలో అరెస్టయిన జి.ఎన్.సాయిబాబా సన్నిహితుడు రోనా విల్సన్ గురించి విన్నాక దేశం నివ్వెరపోయింది. మావోయిస్టులకు సంబంధించి పట్టణ, ఆటవీ ప్రాంతాలు, అంతర్జాతీయ నెట్‌వర్క్ సమన్వయం చేసే బాధ్యతను ఈ రోనా విల్సన్ చూడడం వెనుక ఏ కుట్ర దాగి ఉందో చెప్పలేం.

ప్రతి రోజూ కమ్యూనిస్టులంతా ‘మతతత్వంపై మా పోరాటం’ అంటారు. వీళ్ళు ముస్లిం లీగ్, మజ్లిస్, ఆజాంఖాన్‌ల మతతత్వంపై ఎన్నడూ పోరాటం చేయరు. వాళ్ళ కార్యవర్గాల్లో బహుజనులకు స్థానం ఉండదు. నంబూద్రిపాద్ మొదలుకొని కూనంనేని సాంబశివరావు వరకు ఒకే సామాజిక వర్గం వారు అధిష్ఠానాల్లో ఉంటుంటారు. అంతెందుకు– తెలుగునాట ‘కామ్రేడ్’లు అంతా ఎవరో ఈ ‘కామ్రేడ్’ పదం విడదీస్తే తెలుసుకోవచ్చు. అమరుల కుటుంబాల చావుడప్పుల వద్ద పిడికిలి బిగించి లాల్‌సలాం చెప్పే వరవరరావు ఎవరు? దున్నేవాడిదే భూమి అని గద్దర్ అద్భుతంగా గానం చేశాడు. ‘ఊరు మనదిరా ఈ వాడ మనదిరా’ పాటను గొప్పగా ప్రచారం చేశాడు. ‘దొర ఏందిరో వాని పీకుడేందిరో’ అని కాలికి గజ్జెకట్టి గంతేసాడు. కానీ ఇంటి ప్రక్కనున్న ‘దొర’ను అంతే గొప్పగా గౌరవించాడు. ఆయనపై పన్నెత్తుమాట పాట పాడలేదు. కాలెత్తి గజ్జ కదపలేదు. ఆయన భూమిలో ఎర్రజెండా పాతలేదు. ఆఖరుకు తన కుమారుడు కాంగ్రెస్‌లో చేరుతుంటే ఆపలేదు. జీవితాంతం కాంగ్రెస్ చేసిన ఎన్‌కౌంటర్లు కళ్ళారా చూసిన గద్దర్ చివరికి కాంగ్రెస్ పార్టీకి ప్రీతిపాత్రుడవటం మహా ఆశ్చర్యం! ఇదంతా ఎటువంటి మావోయిజమో సాంబశివరావు చెప్పాలి.

టీవీల్లో, సామాజిక మాధ్యమాల్లో చెలరేగిపోతున్న హిందూమత వ్యతిరేకుల వెనుక ఉన్నది ఈ మహానగర మావోయిస్టులే! ఇపుడు తుపాకులతో, తూటాలతో సాధ్యం కావడం లేదు కాబట్టి విద్యార్థుల మనసుల్లో విషబీజాలు నాటుతున్నారు. అఫ్జల్‌గురులను, యాకూబ్‌మెమన్‌లను ఆరాధించే కన్హయ్య కుమార్, ఉమర్ ఖలీద్, షెహ్లా రషీద్‌లను ఈ అర్బన్ నక్సల్స్ సృష్టిస్తున్నారు. ‘అధికారాన్ని ఆక్రమించు’ అన్న స్టాలిన్ మాటలను ఈ గ్యాంగుల వెనుక ఉన్న పెద్దలు ప్రోత్సహిస్తున్నారు. కుల తత్వాన్ని సమన్వయంతో కాకుండా సంఘర్షణతో ఎదుర్కోవాలని రెచ్చగొడుతున్నారు.

ఎందరో పార్లమెంటేరియన్ల గురించి చెప్పిన కూనంనేని ఇప్పుడు మావోయిస్టులను కూడా ఆ పార్లమెంటుకు రమ్మని చెప్పాలి. అడవిలో ఉండి, దేశంపై తిరగబడతాం అంటే ఏ దేశంలోనూ సాధ్యపడదు. రష్యాలో స్టాలిన్ కూడా మొదట తన దేశ జాతీయవాదం, తరువాతే కమ్యూనిజం కావాలన్నాడు. దేశంపై తిరగబడి ప్రజాస్వామ్యం పాటించిన నాయకుల పేర్లు ఉదహరించడం కూనంనేనికే చెల్లింది. పార్టీలు, ప్రభుత్వాలు ఓట్ల కక్కుర్తితో ఈ మేధో ఉగ్రవాదాన్ని చూసీ చూడనట్లు వదిలేస్తే అది భస్మాసుర హస్తం కావడం ఖాయం.

● పి. భాస్కరయోగి

రాష్ట్రంలో విద్య పరిరక్షణపై నేడు సమావేశం

విద్యా వ్యతిరేక, నిరంకుశ బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. ప్రజాపాలన తీసుకొస్తానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీనికి పౌర సమాజం గణనీయమైన కృషి చేసింది. అయితే విద్యారంగంలో పాత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని ఆపే బదులు కొత్త ప్రభుత్వం కొత్త చర్యలు తీసుకొంటూ సమస్యలు సృష్టిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిపోతున్నదో అధ్యయనం చేసి సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థులు లేరనే సాకుతో పాఠశాలలను మూసివేస్తున్నారు. అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్య కలపడం, ఇప్పుడు ఉన్న దాదాపు 30 వేల పాఠశాలలను అభివృద్ధి చేసే బదులు కొన్ని ఇంటర్నేషనల్ స్కూల్స్ స్థాపించడం, 17 పబ్లిక్ యూనివర్సిటీలను అభివృద్ధి చేసే బదులు స్కిల్ యూనివర్శిటీ పెట్టడం వంటి చర్యలు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం జరుగుతుందా? అనే ప్రశ్న వస్తుంది.

ఈ విషయాలను చర్చించి, తగిన కార్యక్రమం రూపొందించడానికి హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేటి మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒక రౌండ్ టేబుల్ సమావేశం జరుగనున్నది.

– ప్రొ. కె. లక్ష్మీనారాయణ
కార్యనిర్వాహక కార్యదర్శి,
తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

పంటల బీమాలో ‘ప్రైవేటు’తో ప్రయోజనం లేదు!

అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఒక సమగ్ర పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని చెప్పింది. ఈ హామీ అమలులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం తనదైన ప్రత్యేక ముద్రతో కూడిన పంటల బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించి రైతాంగాన్ని ఆదుకోవాలని నిర్ణయించింది. అంతేకాకుండా భారత దేశంలోనే మొట్టమొదటిసారిగా పంటల బీమా పథకానికి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటాను కూడా ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించింది. రైతు మీద ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అన్ని పంటలను పూర్తిస్థాయిలో సమగ్ర పంటల బీమా పథకం కింద తీసుకొచ్చి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జరిగే నష్టానికి పరిహారాన్ని చెల్లించి రైతులలో ఆత్మస్థైర్యాన్ని నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

గతంలో అమలు చేసిన వివిధ పంట బీమా పథకాలను మూడు దశలుగా విశ్లేషిద్దాం. మొదటి దశ (1985–2000). 1972లో మొదటి సారి గుజరాత్ రాష్ట్రంలో పత్తి పంటతో మొదలైన పంటల బీమా పథకం ప్రయోగాత్మకంగా పరిమితంగా కొన్ని రాష్ట్రాల్లో అమలు చేసిన తర్వాత పూర్తిస్థాయి పంటల బీమా పథకం 1985లో మొదలైంది. ఆనాటి ప్రధాని రాజీవ్‌గాంధీ ముందు చూపుతో సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకువచ్చి 16 ప్రధాన వ్యవసాయ రాష్ట్రాలకు విస్తరింపజేసి అన్ని ప్రధాన పంటలకు వర్తింపచేశారు. ఈ పథకాన్ని ప్రభుత్వ రంగంలోని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేశారు. ఈ కాలంలో సుమారు ఏడు కోట్ల 63 లక్షల మంది రైతులు పంటల బీమా పరిధిలోకి రావడంతో పాటు సుమారుగా రూ.2,319 కోట్ల నష్టపరిహారాన్ని పొందారు. అయితే మొత్తం బీమా సంస్థకు చెల్లించిన ఇన్సూరెన్స్ ప్రీమియం కేవలం రూ.400 కోట్లు మాత్రమే. అనగా రైతులు, రైతుల తరఫున ప్రభుత్వం చెల్లించిన మొత్తం ప్రీమియం కంటే వచ్చిన నష్టపరిహారం సుమారుగా ఐదు రెట్లు ఎక్కువ.

రెండవ దశ (2001–2015). పంటల బీమా పరిధిని మరింత విస్తరించి జాతీయ వ్యవసాయ బీమా పథకం (NAIS) 2001లో భారతదేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన పంటలకు విస్తరింప చేశారు. ఈ దశలోనే పంటల బీమా అమలు ప్రాముఖ్యతను గుర్తించి ‘భారత వ్యవసాయ బీమా కంపెనీ’ (అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా) అనే స్వతంత్ర సంస్థను 2002లో ఏర్పాటు చేసి ఈ సంస్థ ద్వారా ఈ జాతీయ పంటల బీమా పథకాన్ని 2015 వరకు అమలు చేశారు. అయితే, ఈ దశలోనే 2010–11 ప్రాంతంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీతో పాటు ప్రైవేట్ సంస్థలను కూడా పంటల బీమా రంగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ప్రయోగాత్మకంగా రెండు సంవత్సరాలు (2011–12, 2012–13) కొన్ని రాష్ట్రాల్లో కొన్ని పంటలకు సవరించిన పంటల బీమా పథకాన్ని అమలు చేశాక, ఈ పథకం ద్వారా రైతులకు ప్రయోజనం లేదని భావించి 2013లో నిలిపివేశారు. ఎందుకంటే ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో అమలైన సవరించిన పంటల బీమా పథకం ద్వారా చెల్లించిన నష్టపరిహారం కేవలం రూ.237కోట్లు మాత్రమే, కానీ సేకరించిన ప్రీమియం దాదాపు రూ.825కోట్లు. మరోవైపు భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేసిన జాతీయ వ్యవసాయ బీమా పథకం కింద ఇదే కాలంలో సేకరించిన ప్రీమియం రూ.7,565 కోట్లు అయితే రైతులకు చెల్లించిన నష్టపరిహారం రూ.25,000 కోట్లు.

> పంటల బీమా పథకం ద్వారా రైతులకు నిజంగా ప్రయోజనం జరగాలంటే ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించి రాష్ట్ర ప్రభుత్వం తనదైన ప్రత్యేక ముద్రతో ఈ పథకాన్ని భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేయాలి.



మూడవ దశ (2016 నుండి నేటి వరకు). కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చాక 2016లో ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని భారీ అంచనాలతో తీసుకువచ్చారు. ఈ పథకం అమలులో పంట బీమా రంగంలోకి ప్రైవేటు సంస్థలకు గేట్లు తెరిచారు. అంతేకాకుండా బీమా సంస్థలకు చెల్లించే ప్రీమియాన్ని గతంలో అమలు చేసిన పంట బీమా పథకాలతో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్లు పెంచారు. దీని ఫలితంగా ఎన్నో ప్రైవేట్ సంస్థలు పంటల బీమా రంగంలోకి పుట్టగొడుగుల్లాగా పుట్టుకొచ్చాయి. ఇటీవల ఒక నివేదికలో 2020–23 మధ్య కాలంలో భారతదేశంలో మొత్తం ప్రీమియం రూపంలో సుమారు రూ.28,000 కోట్లు వివిధ బీమా సంస్థలకు చెల్లించినట్లు, అదే కాలంలో కేవలం రూ.8000 కోట్లు మాత్రమే ఈ బీమా సంస్థలు రైతులకు నష్టపరిహారం రూపంలో తిరిగి చెల్లించినట్లుగా తెలుస్తుంది. దీన్నిబట్టి పంటల బీమా రంగంలోని ప్రైవేట్ సంస్థలు ఏ విధంగా లాభాలు ఆశిస్తున్నాయో అర్థం అవుతున్నది.

తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ పథకాన్ని 2019 వరకు నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో అమలు చేసింది. ఒకవైపు రైతుల వాటా మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం వాటాల కింద ప్రీమియం రూపంలో ఈ ప్రైవేట్ సంస్థలకు వేల కోట్లు ధారాదత్తం చేయబడ్డాయి. ఇదే కాలంలో, తెలంగాణలోని రైతాంగానికి ఏ ప్రైవేట్ సంస్థ కూడా ఎలాంటి పంట నష్టపరిహారం ఆశించినట్టుగా చెల్లించలేదు. దీనిని నెపంగా చూపించి ప్రత్యామ్నాయ పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టకుండా నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నుంచి పంటల బీమా పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది.

తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన పంటల బీమా పథకానికి ఈ అనుభవాలను ఒక గీటురాయిగా పరిగణించాలి. ప్రస్తుత వానాకాలంలో వరి పంట సుమారు 50 లక్షల ఎకరాలు, పత్తి 42 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 5 లక్షల ఎకరాలు, మిరప లక్ష ఎకరాలలో సాగు చేస్తున్నట్టుగా అంచనాలు వస్తున్నాయి. దీని ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన నూతన పంటల బీమా పథకానికి రైతుల వాటా కింద సుమారు రూ.1600కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద మరో రూ.2000కోట్లు– మొత్తం సుమారు రూ.3600 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బీమా సంస్థలకి ప్రీమియం రూపంలో ప్రతి ఏటా చెల్లించాలి. అదేవిధంగా ఒకవేళ కేంద్రం రూపొందించిన ప్రధాన మంత్రి పంటల బీమా పథకాన్ని యథావిధంగా అమలు చేసినట్లయితే కేంద్ర ప్రభుత్వం వాటా కింద మరో రూ.2000కోట్లు బీమా సంస్థలకు నేరుగా చెల్లించాలి. అనగా తెలంగాణలో రైతాంగాన్ని పూర్తిస్థాయిలో పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలంటే సుమారుగా రూ.5,600కోట్లు మొత్తం ప్రీమియం రూపంలో బీమా సంస్థలకు చెల్లించాలి. అయితే ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని యథావిధిగా అమలు చేసి ప్రీమియంలో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా పొందాలంటే ప్రైవేట్ రంగ సంస్థలను విధిగా భాగస్వామ్యం చేయాలి. టెండర్ విధానం ద్వారా బీమా సంస్థలను ఎంపిక చేయాలి. ఇదే జరిగితే ప్రైవేట్ సంస్థలు సాధ్యమైనంత వరకు తక్కువ ప్రీమియంతో టెండర్ దక్కించుకొని పంటల బీమా పథక ప్రయోజనాలను రైతాంగానికి దక్కకుండా వివిధ అనైతిక పద్ధతులు, షరతులతో రైతాంగాన్ని నట్టేట ముంచే ప్రమాదం ఉంది. గతంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అమలైన పంటల బీమా పథకాలు చెబుతున్న అనుభవాలు కూడా ఇవే.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పంటల బీమా పథకం ద్వారా రైతులకు నిజంగా ప్రయోజనం జరగాలంటే ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించి రాష్ట్ర ప్రభుత్వం తనదైన ప్రత్యేక ముద్రతో ఈ పథకాన్ని భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేయాలి. ఒకవేళ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం ప్రీమియంలోని తన వాటాను ఈ ప్రభుత్వ రంగ బీమా సంస్థకు చెల్లించదు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా, రైతుల వాటాతో కూడిన ప్రీమియంతో (సుమారు రూ.3600 కోట్లతో) ఎలాంటి టెండర్ విధానం అవసరం లేకుండా అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ భాగస్వామ్యంతో రైతులకు మరింత ప్రయోజనం కలిగించే విధంగా పంటల బీమా పథకం అమలు చేసే అవకాశం ఉంది. ఒకవేళ నష్టపరిహారం కనుక రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే మొత్తం ప్రీమియం కంటే తక్కువ ఉన్నట్టయితే, ఆ మిగులు ప్రీమియంలో (కంపెనీ లాభం) సింహభాగాన్ని తిరిగి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించే అవకాశం కూడా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా విధి విధానాలను రూపొందించి ప్రయోజనాత్మకమైన ప్రత్యామ్నాయ పంటల బీమా పథకాన్ని తీసుకొస్తుందని ఆశిద్దాం.

■ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త

ఆంధ్రజ్యోతి

3 హైదరాబాద్ నగర వార్తలు

గురువారం 3 అక్టోబరు 2024

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.6 కనిష్ఠం 22.3





రవీంద్రభారతిలో బతుకమ్మతో యువతి

కొత్తపేటలో..

కొత్తపేట అష్టలక్ష్మి ఆలయం ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు

కూకట్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎంగిలి బతుకమ్మ.. సంబరాన్ని తెచ్చేనమ్మా

- ఘనంగా బతుకమ్మ సంబురాలు
- నగర వాకిళ్లలో పూల పండుగ సందడి

అతివల సంబురం అంబరాన్నంటింది.. ప్రకృతి పండుగ పులకించింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు బుధవారం నగరవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా.. తంగేడు పువ్వొప్పునే గౌరమ్మా.. అంటూ మహిళల గౌరమ్మ పాటలు, యువతుల కోలాటాలు అలరించాయి. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన వేడుకలకు మహిళలు భారీగా తరలివచ్చారు.



రవీంద్రభారతిలో యువతుల కోలాటాలు

ముషీరాబాద్‌లో



హెచ్‌ఎండీఏ పరిశీలన

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం బీటీ రోడ్డు వెడల్పు చేయడం, ఇబ్రహీంపట్నం నుంచి బైపాస్ రోడ్డుకు, నాగనపల్లి రోడ్డు నుంచి నాగార్జునసాగర్ రోడ్డు నిర్మాణం, ఇబ్రహీంపట్నంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆలేరు నియోజకవర్గంలోని బొమ్మలరామారంలో సీసీరోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు చేపట్టేందుకు అధికారులు టెండర్ ప్రక్రియను చేపట్టారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రధానరోడ్డుతోపాటు పలు రోడ్లను వెడల్పు చేసేందుకు హెచ్‌ఎండీఏ పరిశీలిస్తోంది.

మాకూ చేయండి

- హెచ్‌ఎండీఏకు మళ్లీ ఆయా జిల్లాల ఎమ్మెల్యేల సిఫార్సులు
- అభివృద్ధి పనుల కోసం జోరుగా లేఖలు
- శివారు ప్రజాప్రతినిధుల పోటాపోటీ
- గతంలో మాదిరి స్పందించాలని విజ్ఞప్తులు
- ఇప్పటికే పలు పనులకు కమిషనర్ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)కు ఎమ్మెల్యేల సిఫార్సులు మళ్లీ ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వంలో పెద్దఎత్తున ఎమ్మెల్యేలు సిఫార్సులు చేయగా.. కాంగ్రెస్ సర్కారులోనూ అదే తరహాలో కొందరు ఎమ్మెల్యేలు అభివృద్ధి పనుల కోసం లేఖలు రాస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేలకు ఏ విధంగా హెచ్‌ఎండీఏ ద్వారా పనులు చేయించారో... ప్రస్తుతం కూడా అదేరీతిలో పనులు చేయాలని కోరుతున్నారు. ప్రధానంగా శివారు ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు హెచ్‌ఎండీఏ ద్వారా అభివృద్ధి పనులు చేయించుకోవడానికి ఉత్సుకత చూపుతున్నారు. తమ పలుకుబడితో ఉన్నతస్థాయిలో ఆయా పనులకు ఆమోదముద్ర వేయించుకొని హెచ్‌ఎండీఏ కమిషనర్‌ను పురమాయిస్తున్నారు.

ఏడు జిల్లాలు.. 35కు పైగా అసెంబ్లీ స్థానాలు

ఏడు జిల్లాల పరిధిలో 35 అసెంబ్లీ స్థానాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నాయి. ఇందులో దాదాపు 24 నియోజకవర్గాలు జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఉంటాయి. అయితే హెచ్‌ఎండీఏలో శివారు జిల్లాలుగా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి-భువనగిరి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట ఉన్నాయి. హెచ్‌ఎండీఏ అభివృద్ధి పనులన్నీ తన పరిధిలోనే చేపట్టాల్సి ఉంటుంది. పరిధి దాటి ఇతర ప్రాంతాల్లో పనులు చేపట్టే అధికారం లేదు. గత ప్రభుత్వంలో పెద్దఎత్తున హెచ్‌ఎండీఏ నిధులతో పనులు చేయించుకోవడానికి ఎమ్మెల్యేలు పోటీపడ్డారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని ఎమ్మెల్యేలే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు సైతం పనుల కోసం గతంలో లేఖలు ఇచ్చిన పరిస్థితి ఏర్పడింది. అందుకనుగుణంగా నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారు.

12 నియోజకవర్గాల్లో రూ.453 కోట్ల పనులు మంజూరు

గత ప్రభుత్వంలో సిఫార్సుల ద్వారా 12 నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యేలు చాలా వరకు రోడ్ల వెడల్పు, సీసీ రోడ్ల నిర్మాణం, బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్లు, సుందరీకరణ పనులు, పాత నిర్మాణాల పునరుద్ధరణ వంటి పనుల కోసం సిఫార్సులు చేశారు. అందులో 12 నియోజకవర్గాల్లో రూ.453 కోట్లతో

మిగతా 6వ పేజీలో..

మహిళా ఉద్యోగులు ఇంటికెళ్లేదెప్పుడు?

- ఉదయం పదింటికొస్తే రాత్రి 10 గంటల వరకు ఆఫీసులోనే..
- రాత్రుళ్లు ఇంటికి ఫోన్లు.. ఆఫీసుకు రావాలని హుకుం
- హెచ్‌ఎండీఏలో ఓ ఐఏఎస్ అధికారి విచిత్ర వైఖరి



ఆయన హెచ్‌ఎండీఏలో ఐఏఎస్ అధికారి. ఓ ఫైల్ విషయంలో అత్యవసరంగా రావాలంటూ రాత్రి 10:30 గంటలకు మహిళా ఉద్యోగికి ఫోన్ చేశారాయన. మర్నాడు సచివాలయంలో సమావేశం మొదలయ్యేసరికి ఫైల్ సిద్ధం చేస్తాను సర్ అని ఆ మహిళా ఉద్యోగి చెప్పినా ఆ అధికారి వినలేదు. వెళ్లకపోతే మెమో జారీ చేస్తారో, సస్పెండ్ చేస్తారోనన్న భయంతో భర్తను వెంటబెట్టుకొని రాత్రి ఆఫీసుకు వెళ్లింది. అర్ధరాత్రి 12 గంటల దాకా ఆఫీసులోనే ఉండి సంబంధిత రిపోర్టును సిద్ధం చేసి, ఆ ఐఏఎస్ అధికారికి ఇచ్చి ఇంటికి వెళ్లింది. ఇలా ఆమె ఒక్కరే కాదు.. సదరు ఐఏఎస్ అధికారి కింద పనిచేసే మహిళా ఉద్యోగులంతా ఇలాంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నారు. రోజూ డ్యూటీ సమయం ముగిసినా ఆయన తీరుతో రాత్రి 10 గంటల దాకా ఆఫీసులోనే ఉండే పరిస్థితులు ఏర్పడ్డాయి. వాస్తవానికి డ్యూటీ ముగిసేది సాయంత్రం 5 గంటలకు. అప్పుడు ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగానే పలు ఫైళ్లు తీసుకురమ్మంటూ మహిళా ఉద్యోగులకు ఆయన హుకుం జారీ చేస్తారు. అయితే.. గంట, రెండు గంటలు దాటినా చాంబర్‌లోకి పిలవరు. తీరా చాంబర్‌లోకి

మిగతా 6వ పేజీలో..

జాతిపితకు జేజేలు



ప్రపంచానికి శాంతిని నేర్పించిన మహాత్మాగాంధీ జయంతి బుధవారం నగరవ్యాప్తంగా ఘనంగా జరిగింది. పలువురు ప్రముఖులు, ప్రజలు ఆయన చిత్రపటాల వద్ద నివాళులర్పించి స్మరించుకున్నారు. లంగర్‌హౌస్ బాపూఘాట్‌లోని మహాత్ముడి విగ్రహానికి విద్యార్థులు ఇలా పూలు చల్లుతూ జేజేలు పలికారు.

మూసీ నివాసితుల వినూత్న నిరసన

- తమ ఇళ్లపై సీఎం దృష్టి పడొద్దని దిష్టి

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణ పేరిట తమ ఇళ్లు కూల్చొద్దంటూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి తమ ఇళ్లపై పడొద్దంటూ చైతన్యపురి డివిజన్ వినాయకనగర్ కాలనీలో మహిళలు బుధవారం రాత్రి తమ ఇళ్లకు దిష్టి తీశారు. పెత్రఅమావాస్య రోజు తమ ఇళ్లకు రివర్ బెడ్ పేరిట పట్టిన పీడ వదిలిపోవాలంటూ కుంకుమ నీటితో దిష్టి తీసి ఇళ్ల ముందు ఆరబోశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఇళ్ల జోలికిరావద్దని కోరారు.





మా ఇళ్లు కూల్చొద్దు బతుకమ్మ..

'హైడ్రా నుంచి కాపాడు బతుకమ్మ.. మా ఇళ్లు కూల్చొద్దు బతుకమ్మ' అంటూ ఫిల్మ్‌నగర్ చెరువు వద్ద మహిళలు బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. హైడ్రాను వ్యతిరేకిస్తూ 'వుయ్ వాంట్ జస్టిస్' అన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

-బంజారాహిల్స్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి)

మెజారిటేరియనిజంతో పౌరులందరికీ ప్రమాదమే

-తమిళనాడు ఎంపీ శశికాంత్ సెంథిల్



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): 'భారతదేశంలో ఫేక్ మెజారిటేరియనిజం నడుస్తోంది. అది విద్వేషాన్ని పెంపొందించడం కన్నా, భయాన్ని వ్యాప్తి చేయడం ద్వారా మనుగడ సాగిస్తోంది. తద్వారా 20 శాతం మందిని బూచిగా చూపించి 80శాతం మంది ఓట్లు పొందాలని అనుకొంటున్నారు' అని బీజేపీపై తమిళనాడు ఎంపీ శశికాంత్ సెంథిల్ విమర్శలు గుప్పించారు. మెజారిటేరియనిజంతో ముస్లింలకే కాదు, దేశ పౌరులందరికీ ప్రమాదమేనన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మంథన్ సంవాద్ ఆధ్వర్యంలో బుధవారం మాదాపూర్ శిల్పకళావేదికలో వివిధ అంశాలపై సమావేశాలు జరిగాయి. 'కౌంటరింగ్ మెజారిటేరియనిజం - ది వే ఫార్వర్డ్' అంశంపై శశికాంత్ సెంథిల్ ఉపన్యసించారు. 'ఇప్పుడు పరిస్థితులను హిందూ-ముస్లింల మధ్య ఘర్షణగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారు. నిజానికి అసలైన ఘర్షణ ఆధిపత్యానికి - సమానత్వానికి మధ్య కొనసాగుతోంది' అని నొక్కిచెప్పారు. ఆధిపత్యవాదాన్ని సమర్థించే మతతత్వవాదులకు సమానత్వం మింగుడుపడదని, అసమానతలతో కూడిన ఈ కులవ్యవస్థ యథాతథంగా కొనసాగాలన్నదే వారి అభిమతమని ఆరోపించారు. మెజారిటీ ప్రజలైన హిందువులు నిశ్శబ్దం వీడడం ద్వారానే మెజారిటేరియనిజాన్ని తిప్పికొట్టగలమన్నారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేష సమాచారాన్ని, దుష్ప్రచారాలను, అబద్ధాలను చూసి నవ్వుకోవాలే కానీ, వాటికి

మిగతా 6వ పేజీలో..

బతుకుదెరువుకొచ్చి..

గంజాయితో పట్టుబడి

- ఇతర రాష్ట్రాల కూలీలతో గంజాయి సరఫరా
- రోజుకు రూ.10 వేలిస్తామనడంతో ఒప్పుకోలు
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 60 కిలోలు పట్టివేత
- మరో ఘటనలో రూ.30 లక్షల గంజాయి స్వాధీనం



గంజాయి ప్యాకెట్లతో పట్టుబడిన నిందితులు (కూర్చున్నవారు)

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు ఓ వ్యక్తి డబ్బు ఆశచూపించి వారితో గంజాయి సరఫరా చేయించాడు. పైసల కోసం ఆతృత పడిన ముగ్గురు కూలీలు విశాఖ నుంచి హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేసి చివరకు ఎక్సైజ్ పోలీసులకు చిక్కారు. ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సైదులు, పశ్చిమబెంగాల్‌కు చెందిన సుమన్‌సేన్, ఎండీ సోహెల్‌లు పొట్టచేత పట్టుకొని విశాఖకు వచ్చారు. అక్కడ పనికోసం ఆరా తీస్తుండగా స్థానికులు ఆకాశ్ వద్ద పని లభిస్తుందని సలహా ఇవ్వడంతో ఆయన వద్ద కెళ్లారు. ఇదే అదునుగా భావించిన ఆకాశ్.. 'లగేజీ బ్యాగుల్లో గంజాయిని ప్యాకెట్లుగా నింపి ఇస్తా. ప్రయాణికుల్లా వెళ్లి హైదరాబాద్‌లో ఇచ్చి రావాలి. చెప్పిన పనిచేస్తే రోజుకు రూ.10వేలు ఇస్తా' అని చెప్పడంతో వారు సరేనన్నారు. ఒక్కో లగేజీ బ్యాగులో 20 కేజీల చొప్పున గంజాయి ప్యాకెట్లు పార్శిల్ చేసి, వారిని విశాఖ నుంచి హైదరాబాద్‌కు పంపించాడు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి సరఫరా జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) టీం ఎస్సై బాలరాజు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో మాటువేసి ఆ ముగ్గురినీ అరెస్టు చేశారు. మూడు బ్యాగుల్లో రూ.6 లక్షల విలువైన 60 కేజీల గంజాయి, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు ఆకాశ్ పరారీలో ఉన్నాడు.

మరో కేసులో నలుగురి రిమాండ్

కొత్తపేట: ఎల్‌బీనగర్ గంజాయి కేసులో బుధవారం నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. మంగళవారం రాత్రి ఎల్‌బీనగర్ మెట్రోస్టేషన్ వద్ద జంటగా గంజాయి విక్రయిస్తున్న దంపతులను, గంజాయి కొనుగోలు చేస్తున్న ఇద్దరిని ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. విచారణ అనంతరం గుంటూరుకు చెందిన యాపర్తి గోపి, ఉమామహేశ్వరి దంపతులతోపాటు గంజాయి కొనుగోలు చేసిన ప్రభుచరణ్, నగేశ్‌లను రిమాండ్‌కు తరలించారు.

ఓ వైపు గంజాయి, మరో వైపు డ్రగ్స్

ఓవైపు డ్రగ్స్, మరోవైపు గంజాయి సరఫరా చేస్తున్న నిందితుడిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు

మిగతా 6వ పేజీలో..

హైదరాబాద్ - నర్సాపూర్ మార్గంలో..
ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

6

DEVARA THANDAVAM



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.15,9.45

SVC సంగీత 70 - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.30	SVC ఈశ్వర్ 70 - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30
SVC శ్రీలక్ష్మి/ఇంద్ర నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.45,6.30,10.00	SVC శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.00,2.30,6.00,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.30,6.00,9.30	శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి 11.15,2.45,6.30,10.15

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 9.00,9.00,9.15,10.30, 9.45,12.15,12.25,12.30 ,12.45,1.00,3.30,3.45, 3.45,4.00,4.15,6.45,7.00, 7.05,7.15,7.30,10.00, 10.05,10.25,10.30,10.45	జీవిఎస్ఎమ్ - మదీనగూడ 8.00,8.20,8.40,10.45,11.15, 11.35,11.55,12.15,2.20, 2.50,3.10,3.30,3.50,5.55, 6.25,6.45,7.05,7.25,9.30,10.00, 10.20,10.30,10.40,11.00	శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 8.40,9.00,9.20,12.10,12.50,3.40,4.00, 4.20,7.10,7.50,10.00,10.40,11.20
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 8.15,8.20,8.30,8.45,9.30, 10.00,11.35,11.55,12.10,	నెక్లెస్ సత్య - కవాడిగూడ 8.40,9.00,9.40,11.15,12.15, 12.40,2.20,2.50,3.50,5.55,6.25, 7.00,7.25,9.30,10.00,10.30,	సినిమాస్ - బాలానగర్ 8.40,9.00,9.20,12.10,12.50,3.40,4.00, 4.20,7.10,7.50,10.00,10.40,11.20
		సినిమాస్ - చందానగర్ 8.40,9.00,9.20,12.10,12.50,3.40,4.00, 4.20,7.10,7.50,10.00,10.40,11.20
		సినీటౌన్ - మియాపూర్

MASS JATHARA



వరంగల్ · నిజామాబాద్ · ఆదిలాబాద్ · మహబూబ్‌నగర్ · మెదక్ · ఖమ్మం · కరీంనగర్ · నల్గొండ · రంగారెడ్డి · రాయచూర్ · హిందీ వర్షన్

రేపే బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.30am

జీవిఎస్ఎమ్ - మదీనగూడ 2.00pm	సినీ ప్లానెట్ - కొంపల్లి 10.00am	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 1.30pm
నెక్లెస్ సత్య - కవాడిగూడ 11.30am	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 7.30pm	ఏంజెలర్ సినీస్క్వేర్ - నారపల్లి 4.35pm
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.30pm	ఏషియన్ రాధిక - కాప్రా 10.10am	జె.పి.సినిమాస్ - చందానగర్ 4.20pm

ఎస్2 ఎ/సి - వరంగల్	బృందావన్ - ఆర్మూర్	భువనేశ్వరి - బిజా	వెంకటరమణ - జడ్చర్ల
వేణుమాల్ - నిజామాబాద్	రాము ఎ/సి - వనపర్తి	శ్రీరమణ - నాగర్‌కర్నూల్	తిరుమల - గద్వేల్
పిబిఆర్ సినిమాస్ - ఆర్మూర్	శ్రీనివాస - నర్సాపూర్	శ్రీదేవి 70 - కొత్తకోట	మీరట్ - రాయచూర్


SRI LAKSHMI PICTURES RELEASE 9885291789
FOR OTHER LANGUAGE 9491333619

రేపే బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

రేపే బ్రహ్మాండమైన విడుదల



(150/- 100/- 50/-)

శాంతి 70ఎంఎం - నారాయణగూడ
11.00,2.00,6.00,9.00

అర్జున్ 70 - కూకట్‌పల్లి 11.00,2.00,6.00,9.00	ఇంద్ర నాగేంద్ర కాంప్లెక్స్ - కర్మన్‌ఘాట్ 11.15,6.15	మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.15,2.30,6.15,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00	శ్రీలక్ష్మి 70 - కర్మన్‌ఘాట్ 2.15,9.15	తాట్యూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 11.00,2.00,6.00,9.00

ALL MULTIPLEX RATES (200/- 250/-)

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	మంత్రామాల్ - అత్తాపూర్ 10.30,1.45,7.55,11.10	సినీటౌన్ - మియాపూర్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 9.45,12.45,4.35,7.30,10.45	సుధా - శాలిబండ 10.30,2.30,4.50,11.10	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 11.10,4.40,7.50,11.05	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.05,1.10,4.15,7.25,10.30	మూవీటైమ్ - అమీర్‌పేట 11.00,4.30,7.45,10.30
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.45,1.40,4.35,7.30,10.45	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 11.00,1.00,4.00,10.45
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	సినీ ప్లానెట్ - కొంపల్లి 10.35,4.20,7.20,10.45	స్టైమాల్ - సనత్‌నగర్ 10.00,4.00,10.30
గలేరియా - పంజాగుట్ట		టివోలి - సికింద్రాబాద్ 11.00,4.50,10.50
బుకాస్ - హైటెక్‌సిటీ		
పివిఆర్ - ఎర్రమంజిల్		
పివిఆర్ - ముసారాంబాగ్		

ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా కేఎస్.రామారావు

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్(ఎఫ్ఎన్‌సీసీ)కు దేశంలో పేరు రావడానికి కారణం స్వర్గీయ నందమూరి తారక రామారావేనని కేఎస్.రామారావు అన్నారు. 2024-2025 సంవత్సరాలకుగాను.. ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా కేఎస్.రామారావు ఎన్నికయ్యారు. బుధవారం ఆయనను ఎన్టీఆర్ శతజయంతి కమిటీ సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్ఎన్‌సీసీ స్థాపనకు మూలపురుషుడు ఎన్టీఆర్ అని, ఆయన ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, రవిశంకర్, మధుసూదనరాజు పాల్గొన్నారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

అంజలి ఎ/సి - సికింద్రాబాద్ (ఒక రోజు మాత్రమే)
11.00,2.00,6.00,9.00

- PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 4.15pm
- PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 1.40pm
- PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 7.30pm
- PVR పివిఆర్ - ముసారాంబాగ్ 7.50pm
- INOX జీవిఎస్ఎమ్ - మదీనాగూడ 10.30am
- INOX నెక్లెస్ సత్య - కావాడిగూడ 10.40am
- ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 7.20pm
- సినీ ప్లానెట్ - కొంపల్లి 4.35pm
- ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 7.20pm
- ఏషియన్ రాధిక - కాప్రా 10.45am
- శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 2.00pm
- మీరజ్ సినిమాస్ - బాలానగర్ 2.00pm
- మీరజ్ సినిమాస్ - చందానగర్ 2.00pm
- టివోలి - సికింద్రాబాద్ 4.35pm
- లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 2.45pm
- జె.పి.సినిమాస్ - చందానగర్ 10.30pm

BGM STUDIO RELEASE

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.50pm	INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 1.35pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 5.15pm	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 4.50pm
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 11.15am	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.50pm
PVR గలేరియా - పంజాగుట్ట 10.00am	శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 1.30pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 6.00pm	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 2.15pm
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 1.55pm	జె.పి.సినిమాస్ - చందానగర్ 10.40pm
INOX జీవిఎస్ఎమ్ - మదీనగూడ 4.50pm	

వెంకటరామ - వరంగల్	వెంకటేశ్వర - మహబూబ్‌నగర్	పూర్ణిమ - రాయచూర్
PVR వేణుమాల్ - నిజామాబాద్	నటరాజ్ ఎ/సి - సంగారెడ్డి	మంజునాథ్ - సింధనూర్
PVR పిబిఆర్ - ఆర్మూర్	రాము 70ఎంఎం - వనపర్తి	కనకదుర్గ - గంగావతి

RUDRA CREATIONS THRU PARAMJYOTHI FILMS 9848028739


తెలంగాణ భవన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌వీ మహేందర్ కుమార్, తదితరులు


హైదర్‌గూడ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ తదితరులు


వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గాంధీ చిత్రపటానిక్కి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి, తదితరులు

అహింసా మార్గంలో నడుచుకోవాలి

ఘనంగా గాంధీ జయంతి ● చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులు


కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, బీజేపీ నాయకులు, నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధులు ఖుష్బుగుప్తా, అమర్‌సింగ్, రామకృష్ణ, జగపతి, అనిల్ యాదవ్, అజ్జు తదితరులు

సమాజంలోని ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడుచుకోవాలని పలువురు పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పలుచోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నివాళులర్పించారు. సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి కోట్లాది మంది భారతీయులకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాన్ని గాంధీ అందించారని వారు గుర్తు చేశారు.

- జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి

కార్మికులకు బీమాపత్రాలు


కార్మికులతో జల్‌పల్లి కమిషనర్ వాణిరెడ్డి


పహాడిషరీఫ్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ప్రధానమంత్రి బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పత్రాలను జల్‌పల్లి కమిషనర్ వాణిరెడ్డి అందజేశారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గాంధీ చిత్రపటానికి ఆమె నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన కార్మికులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బుడుమల యాదగిరి, పల్లపు శంకర్, మేనేజర్ జ్యోతిరెడ్డి వార్డు ఆఫీసర్లు శ్రీనివాస్, భాను, సుదర్శన్, పర్యావరణ ఇంజనీర్ శ్రీనివాస్, శానిటరీ జవాన్లు కుమార్, హరినాథ్, కామేశ్వర, శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


రాజేంద్రనగర్‌లో గాంధీని స్మరిస్తూ ప్రభాత్ బేరీ నిర్వహిస్తున్న నవజ్యోతి యూత్ క్లబ్ సభ్యులు


గాంధీభవన్‌లో నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్యామ్‌మోహన్, కార్యదర్శి నర్సింగ్‌రావు, మనీలాల్ షా, సురేశ్‌కుమార్, ఠాకూర్ రణ్‌ధీర్‌సింగ్ తదితరులు


ఎన్‌ఐఆర్‌డీపీఆర్ ఆధ్వర్యంలో సంస్థ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేందర్‌కుమార్, రిజిస్ట్రార్ మనోజ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రఘు, డాక్టర్ పీకే ఘోష్ తదితరులు పాల్గొన్నారు


చాంద్రాయణగుట్టలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ సంయుక్త కార్యదర్శి పర్వతాల రాజేందర్ తదితరులు


ఫతేదర్వాజలోని బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్, నాయకులు జి.కన్నయ్యలాల్, భానుచందర్ యాదవ్, అబేద్ అలీ, అహ్మద్ తదితరులు


బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్, పాల్గొన్న డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబ, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏ హకీం, అసిస్టెంట్ క్యూరేటర్లు విష్ణువర్ధన్, అమృత, ఎం.లక్ష్మణ్, ఎఫ్ఎస్ఓ వెంకట్‌రావు, ప్రజా సంబంధాల అధికారి హనీఫుల్లా, బయాలజిస్ట్ ఎం.లక్ష్మీనారాయణ, ఈఓ ఎం.దీపక్ తరుణ్ తదితరులు

మాజీ ఎంపీ తులసీరాం జయంతి

రాజేంద్రనగర్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ మాజీ సభ్యులు వి.తులసీరాం జయంతిని రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో దళిత నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీగా చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో ఆయన దళితులకు పెద్ద దిక్కుగా ఉండేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పచ్చ నర్సింగ్‌రావు, వర్రి లలిత్, పంబాల రాజు, మంత్రి చంద్రశేఖర్, గొడుగు సంజీవ, పి.జంగయ్య, కావలి అనంతరాం, ఎస్.పెంటయ్య, రవి, సుధీర్, నాని, శ్రీకాంత్, చాందీ, గణేశ్, అజయ్, సన్నీ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


తులసీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

ఏడాది వయస్సులో చేరదీసి.. చదువు చెప్పించి

ఘనంగా క్రిస్టినా వివాహం


ఫాదర్లతో క్రిస్టినా-వికాస్

రాజేంద్రనగర్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 22 సంవత్సరాల క్రితం దిక్కుతోచని స్థితిలో ఉన్న ఒడిశాకు చెందిన సమర్పిత, ఏడాది వయస్సుగల ఆమె బిడ్డ క్రిస్టినాను సెయింట్ ఆల్ఫోన్సా కరుణాలయ నిర్వాహకులు చేరదీసి సంరక్షిస్తున్నారు. అప్పటి నుంచి క్రిస్టినాను చదివించారు. క్రిస్టినా చదువు అయిపోయిన తర్వాత కూడా శామీర్‌పేటలో ఆశ్రమంలోనే ఉంటోంది. ఈ క్రమంలో ఆమెకు వికాస్ అనే యువకుడు పరిచయమయ్యాడు. అతడు ఆమెను పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడ్డాడు. తండ్రి బొమ్మరాజును ఒప్పించాడు. దీంతో బుధవారం బుద్వేల్‌లోగల సెయింట్ ఆల్ఫోన్సా కరుణాలయ చర్చిలో ఫాదర్ థామస్ నేతృత్వంలో క్రైస్తవ బోధకులు, సంఘ సభ్యులు, పెద్దల సమక్షంలో క్రిస్టినా-వికాస్‌కు ఘనంగా వివాహం చేశారు. కుమార్తె వివాహం జరుగుతుండడంతో సమర్పిత కళ్లలో ఆనందం భాష్పాలు రాలాయి. ఫాదర్లు జియోమోన్, జోష్ కుట్టి తదితరులు పాల్గొన్నారు.

వంటసామగ్రి అందజేత

బుద్వేల్‌కు చెందిన సామాజిక కార్యకర్త రగడం పల్లి శ్రావణ్ క్రిస్టినా-వికాస్‌కు తన సొంత ఖర్చులతో వంటసామగ్రి అందజేశారు.


బతుకమ్మ వేడుకల్లో మధుపార్కు రిడ్జ్ అపార్ట్‌మెంట్ మహిళలు


అల్కాపూర్‌టౌన్‌షిప్‌వాసుల బతుకమ్మ సంబురాలు

ఘనంగా బతుకమ్మ సంబురాలు

నార్సింగ్/రాజేంద్రనగర్, అక్టోబర్ 2 (ఆంధ్రజ్యోతి): లంగర్‌హౌజ్ టిప్పుఖాన్‌పూల్ బ్రిడ్జి సమీపంలోని మధుపార్కురిడ్జ్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం రాత్రి మహిళలు ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. నెక్నాంపూర్ ఎంజీపార్కులో అల్కాపూర్‌టౌన్‌షిప్‌వాసులు, కోకాపేట్ గ్రామంలో రాజపుష్ప ఆత్రియటౌన్‌షిప్ వారు బతుకమ్మ ఆడారు.


కోకాపేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


రాజేంద్రనగర్ హరిహర క్షేత్రం ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆదర్శ విద్యాలయ హైస్కూల్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పహడీషరీఫ్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారు మామిడిపల్లిలో వెలసిన వేంకటేశ్వరస్వామి(బాలాజీ) ఆలయ బ్రహ్మోత్సవాలను నేటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎల్.మురళీకృష్ణ తెలిపారు. ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు


విద్యుత్ వెలుగులో సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయం

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు వివిధ ఆలయ కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి నుంచి 12వ తేదీ వరకు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. పాతబస్తీలోని లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహాకాళి, ఉప్పుగూడ శ్రీ మహాకాళి, సుల్తాన్‌షాహీ జగదాంబ, శ్రీ మాతేశ్వరి బేలా ముత్యాలమ్మ, హరిబౌలి అక్కన్నమాదన్న మహాకాళి, బంగారు మైసమ్మ, గౌలిపురా మహాకాళి మాతేశ్వరి భారతమాత, జమ్మిచెట్టు దుర్గామాత ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు.

రామాయణ మేళాకు ఆహ్వానం


దత్తాత్రేయకు ఆహ్వానం అందజేస్తున్న గోవింద్‌రాఠీ

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి దసరా రోజు వరకు జరిగే రామాయణ మేళాకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆహ్వానించారు. రామాయణ మేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠీ బుధవారం ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. 12వ తేదీన పట్టాభిషేకానికి హాజరు కావాలని కోరారు.

మురుగు రహిత నగరమే లక్ష్యం

రాజేంద్రనగర్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మురుగు రహిత నగరమే లక్ష్యంగా జలమండలి చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని రాజేంద్రనగర్ జలమండలి జనరల్ మేనేజర్ సాయిలక్ష్మి కోరారు. జలమండలి ఆధ్వర్యంలో 90 రోజులపాటు చేపట్టనున్న ప్రత్యేక కార్యచరణ ప్రణాళికకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆమె రాజేంద్రనగర్‌లోని జలమండలి కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. సివరేజీ ఓవర్‌ఫ్లో లేకుండా చేయడంతో పాటు భూగర్భజలాలను పెంచడం కోసం జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. మ్యాన్‌హోల్స్ నిండినప్పుడు 155313కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం జవహర్, మేనేజర్లు సాజిద్, శ్రావ్యరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు జావీద్, అక్తర్ పాల్గొన్నారు.


జలమండలి 90 రోజుల ప్రణాళిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాయిలక్ష్మి, తదితరులు



నూతన కార్యవర్గ సభ్యులు

ఫుట్‌బాల్ స్కేటింగ్ అధ్యక్షుడిగా పాషా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఫుట్‌బాల్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహ్మద్ ఖాజా పాషా ఎన్నికయ్యారు. బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన ఈ సంఘం ఏజీఎంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నసీరుద్దీన్, కార్యదర్శిగా రాజ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ ఎహ్‌సాన్ అహ్మద్, కోశాధికారిగా షాజియా బేగం కార్యవర్గ సభ్యులుగా నాలుగేళ్ల పదవిలో కొనసాగనున్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో లాభాలు

● సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ బాలభాస్కర్

చార్మినార్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల పెంపకంతో ఎన్నో లాభాలు ఉన్నాయని, పారిశ్రామికంగానూ, ఆర్థికంగానూ ఎదుగుదలకు ఉపయోగపడుతుందని సిటీ కళాశాల ప్రిన్సిపాల్ పి.బాలభాస్కర్ అన్నారు. బుధవారం సిటీ కాలేజ్‌లో వృక్షశాస్త్ర విభాగం, ప్రభుత్వ సిటీ కళాశాల మైకాలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో 'పుట్టగొడుగుల పెంపకం-ఫంగస్ వల్ల మానవాళికి ప్రయోజనం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం డాక్టర్ ప్రసూన పుట్టగొడుగుల పెంపకం పద్ధతులు, మెళకువల గురించి వివరించారు. సెమినార్ నిర్వాహకుడు డాక్టర్ నాగరాజును అభినందించారు. ప్రపంచ శిలీంధ్రాల దినోత్సవం సందర్భంగా ప్రముఖ శిలీంధ్రా శాస్త్ర ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఐ ప్రెసిడెంట్ ప్రొ.ఆర్.ఎన్.ఖార్వార్, ఎస్ఎంరెడ్డి పండాల్ కలకత్తా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ క్రిష్ణందు, మద్రాస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యశపాల్ శర్మ, ఎన్.రామన్, ఎన్.వనన్, ఉస్మానియా విశ్వవిదాలయ విశ్రాంత ఆచార్యులు సీఎం చారి, ప్రొఫెసర్ భాగ్యనారాయణ, ఎస్‌కే మహమూద్ పాల్గొన్నారు.

ఐదుగురు సంతానం ఉన్నా.. అనాథలుగా తల్లిదండ్రులు

● బ్రిడ్జి కింద జీవిస్తున్న వృద్ధ దంపతులు

రాజేంద్రనగర్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆ దంపతులకు ఐదుగురు సంతానం. అయినా అనాథలుగా బతుకుతున్నారు. రెండు వారాల నుంచి గగన్‌పహాడ్ మార్గంలో బ్రిడ్జి కింద ఉంటున్నారు. వారిని చూసిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి, హోంగార్డులు చిరంజీవి, శివకుమార్ ప్రతీరోజూ భోజనం అందజేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలం, మాసన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య, నరసమ్మకు ఐదుగురు సంతానం. నలుగురు కుమార్తెలు, కుమారుడు. వీరు తల్లిదండ్రులను పట్టించుకోకపోవడంతో వృద్ధాప్యంలో ఉన్న దంపతులు రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్ వద్ద బ్రిడ్జి కింద తలదాచుకుంటున్నారు. వారిని చూసిన ట్రాఫిక్ సబ్‌ఇన్‌స్పెక్టర్, హోంగార్డులు ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌కు విషయం చెప్పారు. ఆయన సూచన మేరకు దంపతుల వద్ద పిల్లల ఫోన్ నంబర్ తీసుకొని వారితో మాట్లాడారు. మీ తల్లిదండ్రులు గగన్‌పహాడ్ వద్ద ఉన్నారని చెప్పగా.. వారినుంచి సరైన స్పందన లేదు. మరలా ఫోన్ చేసినా ఫలితం లేదు. దీంతో ట్రాఫిక్ పోలీసులే వారికి భోజనం పెట్టిస్తున్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ పోలీసులు


స్వచ్ఛత సేవ-2024 ప్రచారంలో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకొని భారత్ దివాస్ సందర్భంగా ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్, జనరల్ మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ శుభ్రతను కాపాడుకోవడంలో బాధ్యత కలిగించడమే లక్ష్యంగా ఎస్‌హెచ్ఎస్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.

● హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

డిసెంబర్‌లో ఇండియన్ ఫైటో పాథోలాజికల్ సదస్సు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

రాజేంద్రనగర్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 12, 13వ తేదీల్లో రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఇండియన్ ఫైటో పాథోలాజికల్ సొసైటీ, డెక్కన్ సొసైటీ ఆఫ్ ప్లాంట్ పాథాలజిస్ట్ సంయుక్తంగా నిర్వహించనున్న జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బి.విద్యాసాగర్, డాక్టర్ ఆర్.జగదీశ్వర్, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న వ్యాపారులకు తక్ష ఎక్స్ ఆన్‌లైన్ సేవలు భేష్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జయేష్‌రంజన్, తదితరులు

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్నవ్యాపారులకు తక్ష ఎక్స్ ఆన్‌లైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఏడాదిపాటు ఉచితంగా సేవలందించడం గొప్పవిషయమని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. తక్ష ఎక్స్ ఆన్‌లైన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు జై తపాడియా, విజయ్ తపాడియా, అనిల్ మాల్‌పాని ఆధ్వర్యంలో లెట్స్ గో ఆన్‌లైన్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జయేష్‌రంజన్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం తెలియని చిన్న వ్యాపారులకు ఆధునిక ప్రపంచంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ దాదాపు ఏడువేల మందికి పైగా చిన్న వ్యాపారులు, దుకాణదారులకు డిజిటల్ పద్ధతి కల్పిస్తున్నామని, దీనికి నగరంలోని కళాశాలల యాజమాన్యాలతో ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణా తోష్నివాల్, లక్ష్యా మహేశ్వరి పాల్గొన్నారు.

నేడు సీఎం కప్-2024 లోగో మస్కట్ ఆవిష్కరణ


మాట్లాడుతున్న శివసేనారెడ్డి

బర్కత్‌పుర, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రపంచ చాంపియన్‌లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సీఎం కప్-2024 నిర్వహిస్తుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. బుధవారం ఎల్.బి.స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 33 జిల్లాల్లో క్రీడాజ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు సాయంత్రం 4 గంటలకు ఎల్.బి.స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా క్రీడాజ్యోతిని ప్రారంభిస్తున్నామని, అదే విధంగా సీఎం కప్-2024 లోగో మస్కట్‌ను ఆవిష్కరిస్తారని తెలిపారు. 2023లో గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో విజేతలైన తెలంగాణ క్రీడాకారులకు నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ టార్చ్ రిలే నగరంలోని పలు ప్రాంతాల నుంచి సాగి వికారాబాద్‌కు చేరుకుంటుందన్నారు. 16 రోజుల పాటు 33 జిల్లాల్లో కొనసాగి హైదరాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

మహేశ్వరం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల పట్ల ఆసక్తి చూపించాలని టీపీసీసీ కార్యదర్శి ఏలిమేటి అమరేందర్‌రెడ్డి అన్నారు. బాలాపూర్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ సీజన్ ఫోర్ ఆర్గనైజర్ తాహెర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వంగేటి మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, సర్వర్‌అలీ, నవాబ్‌ఖాన్, అబ్దుల్ కలీం, ఆసిఫ్, జిలానీ, సలీం తదితరులు పాల్గొన్నారు.

పాటల పోటీ విజేతగా నాగభూషణం


నాగభూషణంకు బహుమతిని అందజేస్తున్న డాక్టర్ రామన్ మీనాక్షీసుందరం

రాజేంద్రనగర్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(ఐఐఆర్ఆర్)లో బుధవారం జరిగిన స్వచ్ఛ భారత్, హిందీ పక్వాడ కార్యక్రమాల సందర్భంగా పాటల పోటీలు నిర్వహించారు. సంస్థలో పనిచేస్తున్న ఎం.నాగబూషణంకు పాటల పోటీలో బహుమతి లభించింది. బహుమతిని సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షీ సుందరం అందజేశారు. ఏక్ దుజేకే లియే.. సినిమాలోని తేరే మేరే బీచ్ మే అనే హిందీ పాటను నాగభూషణం ఎంతో చక్కగా పాడి వినిపించారు.

యువకుడి అనుమానాస్పద మృతి


గురుప్రీత్‌సింగ్(ఫైల్)

అమీర్‌పేట, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్కంపేటకు చెందిన సర్దార్ భగత్‌సింగ్ కుమారుడు గురుప్రీత్‌సింగ్(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి మానేశాడు. మంగళవారం అర్ధరాత్రి అమీర్‌పేట కుమ్మరిబస్తీలో ఉంటున్న పెదనాన్న కుమారుడు బల్బీర్‌సింగ్ వద్దకు వెళ్లాడు. భవనం మూడో అంతస్తుకు వెళ్లి సోదరుడి ఇంటి తలుపు కొట్టాడు, అతడి తల్లిని పిలిచినా బయటకు రాలేదు. దీంతో భవనంపైకి వెళ్తుండగా జారి మెట్లపై పడిపోయాడు. అతడి వద్ద ఉన్న కంజర్(కత్తి) కడుపులో గుచ్చుకోవడంతో తీవ్ర రక్తస్రావం అయింది. శబ్దానికి బయటకు వచ్చి బల్బీర్‌సింగ్, అతడి కుటుంబ సభ్యులు చూడగా గురుప్రీత్‌సింగ్ రక్తపు మడుగులో పడి ఉండటం చూసి వెంటనే స్థానికంగా గల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, తండ్రి భగత్‌సింగ్‌కు సమాచారం ఇచ్చారు. గురుప్రీత్‌సింగ్ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. భగత్‌సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాజీ ప్రధాని స్వర్గీయ లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి

వారస్ చెస్ విజేతలు చిద్విలాస్, సంస్కృతి



చెస్ విజేతలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వారస్ అకాడమీ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో సూరపనేని చిద్విలాస్ సాయి, సంస్కృతి విజేతలుగా నిలిచారు. పీర్జాదిగూడలోని వారస్ అకాడమీలో జరిగిన ఈ పోటీల్లో ఓపెన్ కేటగిరీలో చిద్విలాస్ ప్రథమ స్థానం దక్కించుకోగా శ్రీసాయి బస్వంత్, విశాల్ చౌదరి తర్వాతి రెండు స్థానాలను సాధించారు. మహిళల కేటగిరీలో సంస్కృతి తొలి స్థానం దక్కించుకోగా, గౌరి కృష్ణ చైతన్య రెండవ, సాత్విక మూడవ స్థానం సొంతం చేసుకున్నారు. అండర్-15 బాలుర విభాగంలో ప్రణయ్, అర్ణవ్, సంతోష్ తొలి మూడు స్థానాల్లో నిలవగా, బాలికల్లో శరణ్య, హ్రిషిత తొలి రెండు స్థానాలను సాధించారు.

హైదరాబాద్ - నర్సాపూర్ మార్గంలో.. ప్రత్యేకరైళ్లు కొనసాగింపు

హైదరాబాద్ సిటీ/బర్కత్‌పుర, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - నర్సాపూర్ మార్గంలో నడుస్తున్న ప్రత్యేక రైళ్లను ఈనెల 5నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్లు (07631/07632) ప్రతి శని, ఆదివారాల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. ఈ రైళ్లకు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు.

నేడు నాలుగు ఎంఎంటీఎస్‌లు రద్దు

సికింద్రాబాద్ యార్డులో ఆధునికీకరణ పనులు కారణంగా గురువారం నాలుగు ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. ఉమ్దానగర్ నుంచి సికింద్రాబాద్ మార్గంలో ఎంఎంటీఎస్‌లను నిలిపివేసినట్లు సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు.

బతుకమ్మ వేడుకలు షురూ



రవీంద్రభారతిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రవీంద్రభారతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తంగేడు, గునుగు, చామంతి, పట్టుగుచ్చులు ఇలా తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొని బతుకమ్మ ఆడి పాడారు. ఈ సందర్భంగా ఒక్కొక్క పువ్వేసి చందమామ పుస్తకాన్ని ఆవిష్కరించారు. వాణీప్రసాద్ మాట్లాడుతూ.. బతుకమ్మ విశిష్టతను చాటుతూ వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఎంగిలి బతుకమ్మతో వేడుకలు ప్రారంభమయ్యాయని, సద్దుల బతుకమ్మ వరకు కొనసాగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. డప్పు, కోలాటం, జానపద కళాకారులు కళారూపాలను ప్రదర్శించి అలరించారు. పలువురు మహిళలు, కళాకారులతో కలిసి బతుకమ్మ ఆడారు.

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన 15వేల మంది

కొనసాగుతున్న భారతీయ కళామహోత్సవ్

తిరుమలగిరి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): బొల్లారం రాష్ట్రపతి నిలయంలో నాలుగోరోజూ భారతీయ కళామహోత్సవ్ కొనసాగింది. బుధవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా సెలవుదినం కావడంతో సుమారు 15000 మందికిపైగా రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. ఈశాన్య రాష్ట్రాల ఉత్పత్తులు, సాంస్కృతిక కార్యక్రమాలను, భారతదేశ కళా వారసత్వాన్ని వీక్షించారు. నేచర్స్ ఆర్బిట్ కలెక్టివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలోచనాత్మకమైన స్థిర అభివృద్ధి లక్ష్యాలు, వ్యర్థాల నిర్వహణపై సమాచారాన్ని అందించారు. సాయంత్రం నిర్వహించిన ఈశాన్య రాష్ట్రాల కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




రాష్ట్రపతి నిలయంలో ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక కార్యక్రమాలు, హాజరైన సందర్శకులు

ఖైదీలు శాంతి, అహింసా మార్గాలను అనుసరించాలి

● హైకోర్టు న్యాయమూర్తి సంజయ్‌పాల్



వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తి సంజయ్‌పాల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్

సైదాబాద్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): గాంధీజీ సూచించిన శాంతి, అహింసా మార్గాలను ఖైదీలు అనుసరిస్తూ మానసిక పరివర్తనతో తమ జీవితాలను మెరుగుపర్చుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి సంజయ్‌పాల్ సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా చంచల్‌గూడ జైలులో బుధవారం నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ముఖ్యఅతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి సంజయ్‌పాల్, జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా, న్యాయాధికారి పంచాక్షరీ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జడ్జి, బాలభాస్కర్ రావు, రాష్ట్ర ప్రజా ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీందర్ నాయక్, జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు, జైలు సూపరింటెండెంట్‌లు నవాబ్ శివకుమార్‌గౌడ్, టి.వెంకటలక్ష్మీశ్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఖైదీలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

జైళ్లలో ఖైదీల వేతనాలు పెంపు : డీజీ

జైళ్లలో శిక్షపడి పనిచేసే ఖైదీల వేతనాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపిందని జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా తెలిపారు. హైస్కిల్డ్(అతి నైపుణ్యం) ఉన్నవారిని ప్రత్యేకంగా గుర్తించి రోజూ రూ.200, స్కిల్డ్ (నైపుణ్యం)కు రూ.70 నుంచి రూ.150, సెమీ స్కిల్డ్‌కు రూ.50 నుంచి రూ.125, అన్‌స్కిల్డ్(సాధారణ కూలీలు) రూ.30 నుంచి రూ. 50కు పెంచుతున్నట్లు వివరించారు.



డీజీపీ కార్యాలయంలో

డీజీపీ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అదనపు డీజీపీ(శాంతిభద్రతలు) మహేష్ భగవత్, డీజీపీ కార్యాలయ అధికారులు, సిబ్బంది

- హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి)



నిరసన వ్యక్తం చేస్తున్న వెబ్ బాధిత ఉపాధ్యాయులు

'వెబ్ ఆప్షన్‌లో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి'

తార్నాక, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాధారణ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి వెబ్ ఆప్షన్‌లో సాంకేతిక కారణాల వల్ల నష్టపోయిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో 'వెబ్ బాధిత కమిటీ సభ్యులు' నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్, జూలై నెలల్లో జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి వెబ్ ఆప్షన్‌లో సాంకేతిక కారణాలు, అధికారుల తప్పిదాలు, సమయాభావంతో నష్టపోయామని తెలిపారు. మూడు నెలల క్రితం తమకు అధికారులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో అర్జీలను అందజేశామని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు తమ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

శుభకార్యాల్లో మద్యం సేవించం

● మహాత్ముడి జయంతి రోజున హైదర్‌గూడవాసుల ప్రతిజ్ఞ



దావత్‌లలో మద్యం బంద్ చేస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న హైదర్‌గూడకు చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు

రాజేంద్రనగర్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడవాసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. శుభకార్యాలలో మద్యం సేవించమని ప్రతిజ్ఞ చేశారు. హైదర్‌గూడకు చెందిన అన్ని సామాజికవర్గాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శుభకార్యాలలో మద్యం జోలికి వెళ్లరాదని, నిర్వాహకులు మద్యం సర్వ్ చేయరాదని తీర్మానించారు. పెళ్లిళ్లు, డిన్నర్లు తదితర శుభకార్యాల్లో బహిరంగంగా మద్యం తాగడం వల్ల మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని, యువతరంపై దుష్ప్రభావం చూపుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి, మ్యాడం రామేశ్వర్‌రావు, మల్లారెడ్డి, కొమురయ్య నర్సింహమాదిగ, సోమారం రాజ్‌కుమార్, కార్పొరేటర్ మోంగ్ర సంగీత గౌరీశంకర్, మాజీ కౌన్సిలర్ రవీందర్, ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు నర్సింహ, సుధాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీ కళాశాలలో ఘనంగా వయోధికుల దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ లక్ష్మణ్



ఎమ్మెల్సీ కోదండరాం, జస్టిస్ నవీన్‌రావులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కవాడిగూడ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతిని పురస్కరించుకొని ఏవీ కళాశాలలో 21వ వయోధికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఏ, డిస్ట్రిక్ట్ 320డీ, సీనియర్ సిటిజన్స్ ఫోరం గాంధీనగర్ ఆధ్వర్యంలో వయోధికుల దినోత్సవాన్ని, మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన లెమన్ స్పూన్, రన్నింగ్, రన్నింగ్ చైర్, వాలీబాల్ పోటీలలో విజేతలైన వారికి, బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న వారికి అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో నగర నలుమూలల నుంచి వచ్చిన వయోధికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు లయన్ డాక్టర్ కె.సునీల్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ సీనియర్ సిటిజన్స్ డే సెలబ్రేషన్స్ లయన్ బి.సూర్యప్రకాష్, డాక్టర్ జేకే రమణ, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హైటెక్ సిటీ కార్యదర్శి అంజయ్య, వెంకట్రావు, భిక్షపతి, నర్సింహరాజ్‌తో పాటు నిర్వాహకులు, వయోధికులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల హక్కులను కాపాడాలి

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల అవసరాలను గుర్తించి వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. డెవలప్‌మెంట్ ఆఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆడిటోరియంలో అధ్యక్షుడు చొక్కారావు అధ్యక్షతన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జస్టిస్ పొనుగంటి నవీన్‌రావు, ప్రొఫెసర్ కోదండరాం పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో శ్వేత, సుధాకర్‌రావు, అనిత, సాయన్న, ప్రభాకర్, రామకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, అజిత్‌కుమార్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లను శుభ్రంగా ఉంచుదాం

● దక్షిణమధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు

హైదరాబాద్ సిటీ/ బర్కత్‌పుర, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): రైళ్లను, రైల్వేస్టేషన్లను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్క పౌరుడిపైనా ఉందని, స్వచ్ఛరైల్ - స్వచ్ఛ భారత్ మిషన్‌ను పౌరులందరూ తమ కర్తవ్యంగా భావించాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంగణాన్ని శుభ్రపరిచే కార్యక్రమంలో జీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'స్వచ్ఛ రైల్ - స్వచ్ఛ భారత్' మిషన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే అందరి లక్ష్యం కావాలని అన్నారు. ఈ మేరకు సిబ్బందితో జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా 35 మంది పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. అలాగే, స్వచ్ఛభారత్ మిషన్ ప్రాముఖ్యత గురించి ఇటీవల నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, చీఫ్ మెకానికల్ ఇంజనీర్ మధుసూదన్‌రావు, ప్రిన్సిపాల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ జి.ఆర్.ఎస్.రావు, ఆర్‌ఎస్‌పీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, హైదరాబాద్ డివిజనల్ మేనేజర్ లోకేష్ విష్ణోయ్, స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మెజారిటేరియనిజంతో పౌరులందరికీ ప్రమాదమే

(3వ పేజీ తరువాయి)

ప్రతిస్పందించనక్కర్లేదని హితవుపలికారు.

రాజ్యాంగాన్ని మార్చడం వారి తరంకాదు

- సుప్రీంకోర్టు న్యాయవాది అరవింద్ దతర్

ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అరవింద్ పి. దతర్ వ్యాఖ్యానించారు. దేశంలో సమాఖ్య స్ఫూర్తి (ఫెడరలిజం) సన్నగిల్లిందని, రాష్ట్రాల మీద కేంద్రం పెత్తనం పెరిగిందని అన్నారు. న్యాయపరంగా రాష్ట్రాలకు కేటాయించిన నిధుల్లోనూ పక్షపాతవైఖరి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. "కాన్‌స్టిట్యూషన్ ఏట్ 75 - లుకింగ్ బ్యాక్, లుకింగ్ ఫార్వర్డ్' అంశంపై మాట్లాడిన ఆయన.. "రాజ్యాంగానికి ఏడు రకాల ప్రమాదాలు పొంచి ఉన్నాయని, అందులో ఉమ్మడి పౌరస్మృతి, పార్టీ ఫిరాయింపులు, మతతత్వవాదం, వ్యక్తిగత గోప్యతకు భంగం, రాష్ట్రాల హక్కులను కాలరాయడం తదితర అంశాలున్నాయి" అని వివరించారు. పార్లమెంటులో 400 మంది ఎంపీలున్నా రాజ్యాంగాన్ని మార్చడం వారి తరంకాదన్నారు.

ముస్లిం జనాభా పెరుగుతుందనేది అబద్ధం

-ఖురేషి, భారత ఎన్నికల మాజీ ప్రధానాధికారి

"దేశంలో ముస్లింల జనాభా పెరుగుతున్నది అబద్ధం. 2011 జనాభాలెక్కలు ప్రకారం ముస్లింల వృద్ధిరేటు దశాబ్దకాలంలో 29.52శాతం నుంచి 24.60 శాతానికి తగ్గింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అది 2022నాటికి 18.2 శాతానికి పడిపోయింది. భారత్‌లో జనాభా పెరుగుదలకు ముస్లింలు ప్రధాన కారణం అనే అపోహను వ్యాప్తి చేస్తున్నారు. అది సరికాదు" అని భారత ఎన్నికల మాజీ ప్రధాన అధికారి ఎస్‌వై ఖురేషి హితవు పలికారు. మంథన్ సంవాద్‌లో ఆయన 'మిత్ అబౌట్ ముస్లిం పాపులేషన్ గ్రోత్ ఇన్ ఇండియా' అంశంపై మాట్లాడారు. 2021 లెక్కల ప్రకారం దేశంలో హిందువులు 115.9076 కోట్లు ఉండగా, ముస్లింలు 21.3367 కోట్లమంది ఉన్నారన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న మోదీ..

- బాలీవుడ్ దర్శకురాలు కిరణ్ రావు

'రైటింగ్ అండ్ డైరెక్టింగ్, ప్రొడ్యూసింగ్ ఫిల్మ్స్ - ఏ జెండర్ పర్స్‌పెక్టివ్' అంశంపై మాట్లాడారు. స్త్రీ ప్రధాన పాత్రల ఆధారంగా సినిమాలు తీయడమే తనకు ఇష్టమని చెప్పారు. ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని దుయ్యబట్టారు. మంథన్ సంవాద్ నిర్వాహకులు విక్రమ్, కిన్నెర మూర్తి, ప్రొఫెసర్ శాంతాసిన్హా, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, విశ్రాంత ఐఏఎస్ సుజాతారావు, విశ్రాంత ఐపీఎస్ అరుణ బహుగుణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓవైపు రేస్‌కోర్స్‌పై వాయువేగంతో దూసుకుపోతున్న అశ్వాలు... మరోవైపు కళ్లు తిప్పుకోనీయని అందాలతో వయ్యారాలు పోతున్న మోడళ్లు... నగరవాసులకు వినూత్న అనుభవాలను పంచుతూ రేస్ 2 విన్ డాట్ కామ్ దక్కన్ డెర్బీ 2024ను నిర్వహించింది హైదరాబాద్ రేస్ క్లబ్. మలకపేటలోని రేస్ కోర్స్ వద్ద మొట్టమొదటిసారిగా ఫ్యాషన్ డిజైనర్ ద్వయం శివన్ - నరేష్‌లు తమ ఫెస్టివ్ కలెక్షన్ లెవిల్ అండ్ సిరీస్‌ను రేస్ ట్రాక్‌పై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌పూర్ యువరాణి నివృత్తి కుమారి మేవార్‌తో పాటు హైదరాబాద్ రేస్ క్లబ్ చైర్మన్ ఆర్.సురేందర్ రెడ్డి, రేస్ 2 విన్ డాట్ కామ్ ఫౌండర్ వై.గోపీరావు, నటీమణులు శృతిహాసన్, హెబ్బాపటేల్, అవంతిక మిశ్రా, శీరత్ కపూర్, రాశీసింగ్, నగర సెలబ్రెటీలు అస్మితాసూద్, ఆర్తీవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాకూ చేయండి

(3వ పేజీ తరువాయి)

752 పనులను సూచించారు. దాంతో అప్పటి ప్రభుత్వంలో రూ.453 కోట్లు మంజూరు చేయగా, రూ.118 కోట్ల పనులు మాత్రమే చేశారు. మిగతా పనులు పూర్తి చేయాల్సి ఉన్నది. గత ప్రభుత్వంలో హెచ్‌ఎండీఏ పరిధిలోని భువనగిరి, ఆలేరు, మేడ్చల్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మునుగోడు, కంటోన్మెంట్, షాద్‌నగర్, రాజేంద్రనగర్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల ద్వారా పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

గత ప్రభుత్వంలో మాదిరి తమకు అధికంగా నిధులివ్వాలంటూ శివారు ప్రాంతాల ఎమ్మెల్యేలు కొందరు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. హెచ్‌ఎండీఏ ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తించి ఆయా పనులు సకాలంలో చేపట్టాలని అటు ప్రభుత్వానికి, హెచ్‌ఎండీఏకు విజ్ఞప్తులు చేశారు. మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రుల ద్వారా సైతం లేఖలు పంపుతున్నారు.

మహిళా ఉద్యోగులు ఇంటికెళ్లేదెప్పుడు?

(3వ పేజీ తరువాయి)

వెళ్లినా.. ఫైల్స్ పరిశీలన ఐదు, పది నిమిషాల్లో ముగియదు. గంటపాటు పరిశీలిస్తారు. ఆ తర్వాతా తుది నిర్ణయం అనేది ఉండదు. మళ్లీ చర్చిద్దాం అంటూ సంబంధిత ఫైల్‌పై రాసేసి బయటకు పంపిచేస్తారు. ఇలా నిత్యం రాత్రి పదింటి దాకా ఆఫీసులో ఉండాల్సిన పరిస్థితి ఉంటోందని అక్కడ పనిచేస్తున్న ఐదారుగురు మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొద్దున పదింటికి ఆఫీసుకొస్తే.. రాత్రి తొమ్మిదింటికి బయటపడతామో, పదింటికి వెళ్లిపోతామో తెలియని పరిస్థితి ఉన్నదని ఓ మహిళా ఉద్యోగి కన్నీరు పెట్టుకుంది.

ఆయన తీరుతో సెలవుల్లోకి..

సదరు ఐఏఎస్ అధికారి తీరు పట్ల కొందరు అధికారులూ విసుగెత్తిపోతున్నారు. నిర్ణయాలు తీసుకోవాల్సిన అంశాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తారని, ఒకే ఫైల్‌పై పలుమార్లు చర్చించాలంటూ రాయడం, చర్చించిన ప్రతిసారి నిర్ణయం తీసుకోకుండా వదిలేస్తుండటంతో కిందిస్థాయి అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఐఏఎస్ అధికారి తీరుతో కొందరు ఉద్యోగులు పని చేయలేమంటూ సెలవులు పెట్టుకున్న పరిస్థితి ఉంది. ఆ ఐఏఎస్ అధికారి తీరుపై త్వరలో ఆందోళన చేపట్టేందుకు హెచ్‌ఎండీఏ మహిళా ఉద్యోగులు, ఉద్యోగుల సంఘం నేతలు సిద్ధమవుతున్నారు.

బతుకుదెరువుకొచ్చి.. గంజాయితో పట్టుబడి

(3వ పేజీ తరువాయి)

అరెస్టు చేశారు. అతడి నుంచి 7 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 185 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం చెందిన రుషికేశ్వర్‌రావు కొన్నాళ్ల క్రితం కూకట్‌పల్లి వచ్చి వ్యాపారం చేసేవాడు. నష్టాలు రావడంతో డ్రగ్స్, గంజాయి సరఫరా చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా తెలిసిన స్మగ్లర్ల నుంచి ఎండీఎంఏ డ్రగ్స్, గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు రుషికేశ్వర్‌రావు పట్టుకున్నారు.

మరో ఘటనలో..

కార్వాన్ : సౌత్‌వెస్ట్‌జోన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30 లక్షలు విలువజేసే మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ చంద్రమోహన్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన హైమద్‌షేక్ (30), ఇర్ఫాన్ షేక్ (30), మల్లేపల్లి ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ (32) గ్యాంగ్‌గా ఏర్పడి ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తెచ్చి మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధుల్లో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు ఈ ముగ్గురితోపాటు ఒడిశాకు చెందిన గోవర్ధన్‌ను అరెస్ట్ చేయడంతోపాటు వారి నుంచి రూ.30 లక్షల విలువజేసే గంజాయి, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

బిజినెస్

హైదరాబాద్ ● గురువారం 3 అక్టోబరు 2024

గిలీడ్ సైన్సెస్‌తో డాక్టర్ రెడ్డీస్, హెటిరో ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెచ్ఐవీ చికిత్సలో ఉపయోగించే లెనాసెపవిర్ ఔషధాన్ని వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న 120 అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో తయారుచేసి, విక్రయించడానికి గిలీడ్ సైన్సెస్‌తో డాక్టర్ రెడ్డీస్, హెటిరో కంపెనీలు వేర్వేరుగా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ రెండూ రాయల్టీ రహిత, స్వచ్ఛంద లైసెన్సింగ్ ఒప్పందాలే. హెచ్ఐవీ చికిత్సలో ఇతర యాంటి రిట్రోవైరల్ ఔషధాలతో కలిపి ఉపయోగించేందుకు లెనాసెపవిర్‌కు అమెరికన్ ఎఫ్‌డీఏ అనుమతి ఇచ్చింది. ఈ లెనాసెపవిర్‌ను హెచ్ఐవీ (పీఆర్ఈపీ) వ్యాధి వ్యాప్తి నిరోధానికి కూడా ఉపయోగించవచ్చునా అన్న అంశంపై ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ లెనాసెపవిర్ ఔషధాన్ని గిలీడ్ సైన్సెస్ 2022 సంవత్సరంలో సన్‌లెంకా బ్రాండ్ పేరుతో అమెరికా, యూరప్ మార్కెట్లలో ప్రవేశపెట్టింది. హెచ్ఐవీకి సంబంధించి తాజాగా అందుబాటులో ఉన్న ఈ చికిత్సను 120 అల్పాదాయ, మధ్యాదాయ దేశాలకు విస్తరింపచేసేందుకు, తద్వారా వారు మరింత ప్రయోజనం పొందేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ (ఏపీఐ, సర్వీసెస్) దీపక్ సప్రా అన్నారు. భారత్ సహా ఆఫ్రికా, ఇతర అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో రోగులకు ప్రాణాధార ఔషధం అందించి మరింత ప్రయోజనం చేకూర్చేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని హెటిరో గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ బండి అన్నారు.

ఇన్వెస్టర్లకు ఫిబ్రవరి 1 నుంచి 3 ఇన్ 1 అకౌంట్

న్యూఢిల్లీ: సెబీ తాజా ఆదేశాల మేరకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి స్టాక్ బ్రోకర్లు తమ క్లయింట్లకు సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్‌కు యూపీఐ ద్వారా ఫండ్స్ బ్లాక్ చేసుకునే విధానం లేదా 3 ఇన్ 1 (సేవింగ్స్, డీమ్యాట్, ట్రేడింగ్) అకౌంట్‌ను ఆఫర్ చేయాల్సి ఉంటుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	535
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	523	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	116
వరంగల్	110	గుంటూరు	121
కరీంనగర్	110	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	113
కర్నూలు	110	నెల్లూరు	113
విశాఖపట్నం	110	అనంతపురం	113
గోదావరి	116		

రూ.111 లక్షల కోట్లు

తొమ్మిది నెలల్లో పెరిగిన మార్కెట్ సంపద



న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో ఇప్పటివరకు భారత స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కనకవర్షం కురిపించింది. ఈక్విటీ సూచీల రికార్డు ర్యాలీతో మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.110.57 లక్షల కోట్లు పెరిగి మొత్తం 474.86 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. గతనెల 27న బీఎస్ఈ మార్కెట్ క్యాప్ ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.477.93 లక్షల కోట్లకు ఎగబాకింది. కానీ, గత మూడు సెషన్లలో వరుస నష్టాల కారణంగా సంపద కాస్త తగ్గుముఖం పట్టింది.

సెన్సెక్స్ 12,026 పాయింట్ల వృద్ధి

ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడుల దిక్సూచి సెన్సెక్స్ 2024 సంవత్సరంలో సెప్టెంబరు ముగిసే నాటికి ఏకంగా 12,026.03 పాయింట్లు (16.64 శాతం) పుంజుకుంది. 2024లో సూచీ పలు కీలక మైలురాళ్లను దాటేసింది. ఈ ఏడాది ఆరంభంలో 72,271 పాయింట్ల వద్దనున్న సెన్సెక్స్. గత 9 నెలల్లో భారీగా ర్యాలీలో పురోగమిస్తూ ప్రస్తుతం 84,266 స్థాయికి చేరింది. గతనెల 27న సూచీ 85,978.25 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. దేశీయ ఆర్థిక మూలాలు బలంగా ఉండటంతోపాటు ద్రవ్య లభ్యత సమృద్ధిగా ఉండటం, రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు గణనీయంగా పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. గతనెలలో అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీరేట్లను ఒకేసారి అరశాతం తగ్గించడంతో సూచీ మరింత వేగంగా (83,000 నుంచి 85,000కు) ర్యాలీ తీసింది.

టాప్-5 లిస్టెడ్ కంపెనీలు

సంస్థ	రూ.లక్షల కోట్లు
రిలయన్స్ ఇండస్ట్రీస్	19.82
టీసీఎస్	15.50
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	13.16
భారతీ ఎయిర్‌టెల్	9.67
ఐసీఐసీఐ బ్యాంక్	8.98

స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ 34% అప్

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మన మార్కెట్ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకున్నప్పటికీ, దేశీయ మ్యూచువల్ ఫండ్ల పెట్టుబడులు దన్నుగా నిలిచాయని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా అన్నారు. ముఖ్యంగా స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు ప్రధాన సూచీల కంటే అధిక రాబడులు పంచాయని, పలు కంపెనీల స్టాక్స్ ఇన్వెస్టర్లకు మల్టీబ్యాగర్ లాభాలందించాయన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 12,645.24 పాయింట్లు (34.32 శాతం), స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 14,777.09 పాయింట్లు (34.62 శాతం) పెరిగాయి.

గత ఏడాదిలో మార్కెట్ పనితీరు ఇలా..

2023 సంవత్సరంలో సెన్సెక్స్ 11,399.52 పాయింట్లు (18.73 శాతం) వృద్ధి చెందగా.. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.81.90 లక్షల కోట్లు పెరిగింది. గత ఏడాది నవంబరు 29న బీఎస్ఈ మార్కెట్ క్యాప్ తొలిసారిగా 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. కాగా, 5 లక్షల కోట్ల డాలర్ల మార్క్‌ను ఈ ఏడాది మే 21న అధిగమించింది.

కొంత దిద్దుబాటు తప్పదు..

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడంతోపాటు వచ్చే నెలలో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు కొంత దిద్దుబాటుకు లోనుకానున్నాయని ఈక్విటీ విశ్లేషకులు అన్నారు. అయినప్పటికీ, స్టాక్ ఆధారిత పెట్టుబడి అవకాశాలు లభించనున్నాయని, దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి మార్కెట్ దిద్దుబాటు కాలం సరైన సమయమని వారు పేర్కొన్నారు.

వడ్డీరేట్ల నిర్ణయంలో ఆహార ద్రవ్యోల్బణం కీలకమే

రఘురామ్ రాజన్



న్యూఢిల్లీ: కీలక వడ్డీరేట్లు నిర్ణయించే సమయంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని పరగణనలోకి తీసుకోరాదనే వాదనని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ తోసిపుచ్చారు. ఈ సూచనకు తాను పూర్తి వ్యతిరేకమన్నారు. అలా చేస్తే, ధరల కట్టడి కోసం ఆర్‌బీఐ అనుసరిస్తున్న విధానంపై ప్రజలకు నమ్మకం పూర్తిగా పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కీలక రెపోరేటు నిర్ణయించేటపుడు ఆహార ద్రవ్యోల్బణాన్ని మినహాయించాలని 2023-24 ఆర్థిక సర్వేలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ సూచించిన విషయం తెలిసిందే.

దీర్ఘకాలిక ప్రభావం: ఆహార ఉత్పత్తుల ధరలు స్వల్ప కాలంలో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేయకపోయినా, దీర్ఘ కాలంలో మాత్రం ఆ ప్రభావం తప్పక ఉంటుందని రాజన్ స్పష్టం చేశారు. వీటి ధరలు ఎక్కువ కాలం అధికంగా ఉంటే, డిమాండ్‌కు అనుగుణంగా వాటి ఉత్పత్తి కూడా కష్టమవుతుందన్నారు. ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు ఇతర వస్తువుల ధరల తగ్గింపుపై కేంద్ర బ్యాంకులు దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం మన దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం నిర్ణయంలో ఆహార ఉత్పత్తుల వాటా 46 శాతం వరకు ఉంది.

సెబీ చీఫ్‌పై ఆరోపణలు : సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌పై అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన తాజా ఆరోపణలపై రాజన్ స్పందిస్తూ సెబీ వంటి రెగ్యులేటరీ సంస్థల అధినేతల నడవడిక అనుమానాలకు తావు లేకుండా ఉండాలన్నారు. ఈ ఆరోపణలపై అనుమానాలకు తావు లేకుండా క్షుణ్ణంగా దర్యాప్తు జరగాలన్నారు. రెగ్యులేటరీ సంస్థల విశ్వసనీయత ఎంత గొప్పగా ఉంటే, అది ఆ సంస్థలకు, మార్కెట్లకూ అంత మంచిదన్నారు.

ఈ సారీ వడ్డీ రేట్లు యథాతథమే!

సోమవారం నుంచి ఎంపీసీ భేటీ

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) వచ్చే సోమవారం నుంచి మూడు రోజుల పాటు సమావేశమవుతోంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం బుధవారం కీల క రెపోరేటుపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. అయితే ఆహార ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగానే ఉన్నందున ఎంపీసీ ఈ సమావేశంలో కూడా రెపోరేటును యథాతథంగా 6.5 శాతం వద్దే కొనసాగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో కొత్తగా ఎంపీసీ సభ్యులుగా నియమితులైన రామ్ సింగ్, సౌగత భట్టాచార్య, నగేశ్ కుమార్ కూడా పాల్గొంటారు. ఎంపీసీలో వారికిదే తొలి సమావేశం.

ఈ ఏడాది మరో 600 శాఖలు

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: భారీ రెసిడెన్షియల్ టౌన్‌షిప్‌లు సహా కొత్తగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోనూ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకుంటామని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా మరో 600 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐ గత ఆర్థిక సంవత్సరంలో 137 శాఖలను ఏర్పాటు చేసింది. అందులో 59 బ్రాంచ్‌లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించింది. ఈ ఏడాది మార్చి నాటికి ఎస్‌బీఐ దేశవ్యాప్తంగా 22,542 శాఖలు, 65,000 ఏటీఎంలు, 85,000 మంది బిజినెస్ కరెస్పాండెంట్ల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. "మేం 50 కోట్ల మంది కస్టమర్లకు సేవలందిస్తున్నాం. ప్రతి భారతీయుడికి, ముఖ్యంగా ప్రతి భారతీయ కుటుంబానికి బ్యాంకర్ అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నాం" అని శ్రీనివాసులు శెట్టి అన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనింకా ఏమన్నారంటే..

- షేర్‌హోల్డర్లతోపాటు బ్యాంక్ సంబంధిత వర్గాలందరి దృష్టిలో ఎస్‌బీఐని అత్యుత్తమ, అత్యంత విలువైన బ్యాంక్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.
- డిపాజిటర్లను ఆకర్షించేందుకు ఎస్‌బీఐ పలు కొత్త పథకాలను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉంది. క్రమానుగుత పెట్టుబడి (సిప్) వెసులుబాటుతో కూడిన రికరింగ్ డిపాజిట్ పథకం అందులో ఒకటి.
- ఆర్థిక వ్యవస్థ వేగంగా పురోగమిస్తున్న నేపథ్యంలో కస్టమర్లలో ఆర్థిక అవగాహన పెరుగుతోంది. దాంతో వారు సరికొత్త పెట్టుబడి పథకాల కోసం చూస్తున్నారు.
- ఎవరూ తమ పొదుపు సొమ్మునంతా రిస్క్‌తో కూడిన పథకాల్లో లేదా స్పెక్యులేటివ్ అసెట్ క్లాస్‌లో పెట్టుబడిగా పెట్టరు. వారి ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో బ్యాంక్ పథకాలకూ స్థానం ఉంటుంది. కాబట్టి, వారిని ఆకర్షించే పెట్టుబడి పథకాలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నాం.

రియల్టీలోకి రూ.9,660 కోట్ల పెట్టుబడులు

కొలియర్స్ తాజా నివేదిక



న్యూఢిల్లీ: భారత రియల్టీ రంగం పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తోంది. సెప్టెంబరు త్రైమాసికంలో ఈ రంగం 115 కోట్ల డాలర్ల (రూ.9960 కోట్లు) విలువైన పెట్టుబడులు ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువని కొలియర్స్ ఇండియా తెలిపింది. ఈ త్రైమాసికంలో రియల్టీలోకి వచ్చిన పెట్టుబడుల్లో 57 శాతం ముంబై, చెన్నై నగరాలు ఆకర్షించాయి. ఈ త్రైమాసికంలో కార్యాలయాల నిర్మాణ రంగం 61.63 కోట్ల డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది దాదాపు ఏడు రెట్లు ఎక్కువ. నివాస గృహాల విభాగంలోకి వచ్చే పెట్టుబడులు 40 శాతం పెరిగి 38.48 కోట్ల డాలర్లకు చేరాయి. అయితే ఇదే సమయంలో పారిశ్రామిక, గిడ్డంగుల నిర్మాణ రంగంలో మాత్రం పెట్టుబడులు 72 శాతం పడిపోయినట్టు కొలియర్స్ ఇండియా తెలిపింది.

హైదరాబాద్‌లో తగ్గిన ఆఫీస్ స్పేస్ డిమాండ్

సెప్టెంబరు త్రైమాసికంలో హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాలకు డిమాండు తగ్గింది. గత ఏడాది జూలై-సెప్టెంబరు మధ్య కాలంలో హైదరాబాద్, చుట్టు పక్కల ప్రాంతాల్లో 27 లక్షల ఎస్ఎఫ్‌టీ లీజు ఒప్పందాలు నమోదైతే, ఈ సంవత్సరం మూడో త్రైమాసికంలో అది 12.6 లక్షల ఎస్ఎఫ్‌టీకి పడిపోయింది. ఇదే సమయంలో బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, పుణె, ముంబై వంటి నగరాల్లో మాత్రం ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు జోరందుకున్నట్టు జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. హైదరాబాద్ సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో మూడో త్రైమాసికంలో 121.6 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 14 శాతం ఎక్కువని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది.

స్పోర్ట్స్

సర్ఫరాజ్ ద్విశతకం

'రెస్ట్'తో ఇరానీకప్



లఖ్‌నవూ: రెస్టాఫ్ ఇండియాతో ఇరానీ కప్ మ్యాచ్‌లో సర్ఫరాజ్ ఖాన్ దిశ్వతకం (221 బ్యాటింగ్)తో దుమ్మురేపాడు. అజింక్యా రహానె (97) సెంచరీ చేజార్చుకోగా, తనుష్ కోటియన్ (64) అర్ధశతకంతో రాణించడంతో ముంబై జట్టు బుధవారం, రెండో రోజు ఆఖరికి తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 536 పరుగులు చేసింది. ఇరానీ కప్‌లో డబుల్ సెంచరీ చేసిన తొలి ముంబై బ్యాటర్‌గా సర్ఫరాజ్ రికార్డు నెలకొల్పాడు.

సంక్షిప్త స్కోరు: ముంబై తొలి ఇన్నింగ్స్ 536/9 (సర్ఫరాజ్ బ్యాటింగ్ 221, రహానె 97, కోటియన్ 64, శార్దూల్ 36, ముకేష్ కుమార్ 4/109, యశ్ దయాల్ 2/89, ప్రసిద్ధ్ 2/102).

ఖో-ఖో ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యం

న్యూఢిల్లీ: ఖో-ఖో చరిత్రలో తొలిసారిగా నిర్వహిస్తున్న ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది జరిగే ఈ విశ్వకప్‌లో 24 దేశాలు పాల్గొంటాయని జాతీయ ఖో-ఖో ఫెడరేషన్ అధ్యక్షుడు సుధాంశు మిట్టల్ వెల్లడించారు. పురుషులు, మహిళల జట్లకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు.

న్యూజిలాండ్ సారథి సౌథీ రాజీనామా



కొత్త కెప్టెన్‌గా లాథమ్

ఆక్లాండ్: మరో రెండు వారాల్లో భారత్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్ ప్రారంభం కానుండగా.. న్యూజిలాండ్ జట్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పేసర్ టిమ్ సౌథీ టెస్ట్ కెప్టెన్సీకి అనూహ్యంగా రాజీనామా చేశాడు. దాంతో అతడి స్థానంలో వికెట్ కీపర్, బ్యాటర్ లామ్ లాథమ్‌ను నియమించారు. మొత్తం 14 టెస్ట్‌ల్లో సౌథీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇక..ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్ట్‌ల్లో న్యూజిలాండ్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే.

బాబర్ మళ్లీ తప్పుకొన్నాడు

రిజ్వాన్‌కు బాధ్యతలు?

కరాచీ: సరిగ్గా ఏడాదిలో రెండోసారి బాబర్ ఆజమ్ పాకిస్థాన్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. పరిమిత ఓవర్ల సారథ్యం నుంచి తప్పుకొంటున్నట్టు బాబర్ బుధవారం వెల్లడించాడు. గత ఏడాది అక్టోబరులో భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచ కప్‌లో దారుణ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కెప్టెన్సీకి ఆజమ్ రాజీనామా చేశాడు. అయితే గత మార్చిలో అతడిని తిరిగి తెల్లబంతుల జట్ల సారథిగా నియమించారు. కానీ ఆరు నెలల్లోనే అతడు మళ్లీ కెప్టెన్సీకి రాజీనామా చేయడం గమనార్హం. బాబర్ స్థానంలో మహ్మద్ రిజ్వాన్ పరిమిత ఓవర్ల సారథ్య బాధ్యతలు చేపట్టనున్నట్టు సమాచారం. కాగా, వన్డేలు, టీ20లకు వేర్వేరు కెప్టెన్లను నియమించాలని కూడా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భావిస్తోంది.

ఆసీస్‌పై యువ భారత్ గెలుపు

అండర్-19 అనధికార టెస్ట్

చెన్నై: తీవ్ర ఒత్తిడిలో నిఖిల్ కుమార్ (55 నాటౌట్) అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. అండర్-19 అనధికార టెస్ట్‌లో ఆస్ట్రేలియాపై భారత్ 2 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఆటకు మూడో రోజైన బుధవారం ఆసీస్ నిర్దేశించిన 212 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 214/8 స్కోరు చేసి గెలిచింది. నిత్య పాండ్యా (51), కార్తికేయ (35) రాణించారు. మొదటి ఇన్నింగ్స్‌లో శతకంతో అదరగొట్టిన వైభవ్ సూర్యవంశీ (1) విఫలమయ్యాడు. ఐడెన్ ఒకానర్ 4 వికెట్లు, విశ్వ రామ్‌కుమార్ 3 వికెట్లు పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 110/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించి ఆసీస్ 214 పరుగులకు కుప్పకూలింది. స్పిన్నర్ మహ్మద్ ఎనాన్ 6 వికెట్లతో ప్రత్యర్థి వెన్నువిరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 293, భారత్ 296 పరుగులు చేశాయి.

భారత మహిళల క్రికెట్ జట్టు ఆటలో ప్రమాణాలు పెరిగినా, గొప్ప విజయాలు దక్కుతున్నా, కప్పు కల మాత్రం ఇంకా తీరలేదు. దశాబ్దాలుగా ఊరిస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచప్‌ను అందుకునేందుకు మన అమ్మాయిలకు మరో అద్భుత అవకాశం. ఈ మెగా టోర్నమెంట్ మొదలయ్యేది నేడే. యూఏఈ వేదికగా జరగనున్న ఈ ప్రపంచకప్‌లో మొత్తం పది జట్లు పోటీపడుతున్నాయి. రికార్డుస్థాయిలో ఏడో టైటిల్‌పై కన్నేసిన డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, ప్రస్తుతం సూపర్‌ఫామ్‌లో ఉన్న భారత్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీవిండియా తమ తొలి మ్యాచ్‌ని న్యూజిలాండ్‌తో శుక్రవారం ఆడనుంది.

నేటి నుంచి మహిళల టీ20 ప్రపంచకప్



మనమ్మాయిల కల నెరవేరేనా?

తొలి టైటిల్ వేటలో భారత్
మరోసారి ఫేవరెట్‌గా ఆస్ట్రేలియా
బలంగా ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా

నేటి మ్యాచ్‌లు

బంగ్లాదేశ్ X స్కాట్లాండ్
మధ్యాహ్నం 3.30 నుంచి

పాకిస్థాన్ X శ్రీలంక
రాత్రి 7.30 నుంచి

స్టార్ నెట్‌వర్క్, డిస్నీ హాట్‌స్టార్‌లో

దుబాయ్: ఎడారిలో మరో పరుగుల పండుగకు సర్వం సిద్ధమైంది. క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మహిళల టీ20 వరల్డ్‌కప్ 9వ అంచెకు గురువారం తెరలేవనుంది. ప్రపంచకప్ స్వప్నాన్ని నెరవేర్చుకోవాలన్న పట్టుదలతో భారత్ ఉండగా.. ఆరుసార్లు విజేత, డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఇంగ్లండ్, గత టోర్నీ రన్నరప్ దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ సత్తాచాటాలనే కసితో ఉన్నాయి. గతంతో పోల్చితే విగతా జట్ల ప్లేయర్లు కూడా ఫ్రాంచైజీ క్రికెట్ అనుభవం గడించడంతో టోర్నీ ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. షార్జాలో జరిగే ఆరంభ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో బంగ్లాదేశ్ తలపడనుంది. వాస్తవంగా ఈ పొట్టికప్ బంగ్లాదేశ్‌లో జరగాలి. అయితే, అక్కడి రాజకీయ పరిస్థితుల కారణంగా అశాంతి రేగడంతో వేదికను యూఏఈకి మార్చారు. ఈ నెల 20న దుబాయ్ వేదికగా టోర్నీ ఫైనల్ జరగనుంది.

ఎదురులేని ఆస్ట్రేలియా..

మెగా టోర్నీల్లో అత్యంత బలీయమైన జట్టు ఆస్ట్రేలియా అనడంలో ఎలాంటి సందేహం లేదు. టీ20 వరల్డ్‌కప్‌లో కంగారూల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటిదాకా జరిగిన 8 టోర్నీల్లో ఏడుసార్లు ఫైనల్ చేరిన ఆసీస్.. ఆరుసార్లు విశ్వవిజేతగా నిలిచింది. 2009లో జరిగిన ఆరంభ ఎడిషన్‌లో ఇంగ్లండ్ టైటిల్ నెగ్గింది. 2010, 2012, 2014ల్లో వరుసగా మూడుసార్లు చాంపియన్‌గా నిలిచిన ఆసీస్ జోరుకు 2016లో వెస్టిండీస్ చెక్ చెప్పింది. కానీ, 2018, 2020, 2023ల్లో మళ్లీ వరుసగా మూడుసార్లు కంగారూలు కప్‌ను ఎగరేసుకుపోయారు. డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్న ఆసీస్ జైత్రయాత్రను కొనసాగించాలనుకొంటోంది. ఇటీవలి కాలంలో ఇంగ్లండ్, భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఆసీస్‌కు దీటుగా ఎదిగినా.. మెగా ఈవెంట్‌లో మాత్రం కంగారూల ముందు నిలవలేకపోతున్నాయి. మెగ్ లానింగ్ రిటైర్మెంట్ ప్రకటించడంతో అలీస్సా హీలీ కెప్టెన్సీలో ఆసీస్ బరిలోకి దిగుతోంది. జట్టులో ఎలీస్ పెర్రీ, గ్రేస్ హ్యారిస్, ఆష్లే గార్డ్‌నర్ కీలక ప్లేయర్లు.

పటిష్ఠంగా ఇంగ్లండ్..

తొలి టోర్నీలో విజేతగా నిలిచిన ఇంగ్లండ్ మళ్లీ కప్‌ను ముద్దాడలేక పోయింది. మూడుసార్లు ఫైనల్ చేరినా ఆసీస్ చేతిలో పరాజయం పాలైంది. అయితే, యాషెస్‌లో ఆసీస్‌ను ఓడించిన ఇంగ్లండ్ ఈసారి మరింత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఆల్‌రౌండర్లు, పవర్ హిట్టర్లతో బలంగా కనిపిస్తున్న ఇంగ్లండ్ ఈసారి టోర్నీని సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. సోఫీ ఎకిల్‌స్టోన్, సారా గ్లెన్, చార్లీ డీన్, స్కివర్ బ్రంట్ అనుభవం జట్టుకు ప్లస్ కానుంది.

బలహీనతను అధిగమించేనా..

ఆసీస్‌కు గట్టిపోటీ ఇచ్చే జట్లలో ఒకటిగా భారత్ కనిపిస్తున్నా.. తుదిమెట్టుపై తడబాటుకు లోనవడం మనోళ్లకు బలహీనతగా మారింది. 2020 టోర్నీ ఫైనల్లో కంగారూల చేతిలో ఓడిన హర్మన్ సేన.. 2022 కామన్వెల్త్ క్రీడల్లోనూ ఆ జట్టుకు తలొగ్గింది. ఆసియాకప్‌లో భారత్ అద్భుత ప్రదర్శన చేసినా, ఫైనల్లో శ్రీలంక చేతిలో కంగుతింది. ఫిట్‌నెస్, ఫీల్డింగ్‌పై దృష్టిసారించిన భారత్.. ఈసారి ఐసీసీ ట్రోఫీని ఒడిసిపట్టాలనే కసితో ఉంది. షఫాలీ వర్మ, స్మృతి మంధాన, రిచా ఘోష్, హర్మన్‌ప్రీత్ బ్యాటింగ్‌లో కీలకం. దుబాయ్ వికెట్లు స్పిన్‌కు అనుకూలించే చాన్సుండడంతో రాధా యాదవ్, దీప్తి శర్మపై జట్టు ఎక్కువగా ఆధారపడనుంది.

భారత మ్యాచ్‌ల షెడ్యూల్

తేదీ	వేదిక	ప్రత్యర్థి	సమయం
అక్టోబరు 4	దుబాయ్	న్యూజిలాండ్	రాత్రి 7.30
అక్టోబరు 6	దుబాయ్	పాకిస్థాన్	మ. 3.30
అక్టోబరు 9	దుబాయ్	శ్రీలంక	రాత్రి 7.30
అక్టోబరు 13	షార్జా	ఆస్ట్రేలియా	రాత్రి 7.30

గ్రూప్-ఎ: భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక.
గ్రూప్-బి: బంగ్లాదేశ్, ఇంగ్లండ్, స్కాట్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్.

టోర్నీ ఫార్మాట్ 10 జట్లు టోర్నీలో పాల్గొంటున్నాయి. సెమీస్, ఫైనల్ సహా 23 మ్యాచ్‌లు షార్జా, దుబాయ్‌లో జరగనున్నాయి. మొత్తం జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి.

డబ్బే డబ్బు గతంతో పోల్చితే ఈ టోర్నీ ప్రైజ్‌మనీని రికార్డుస్థాయిలో 225 శాతం పెంచారు. పురుషులతో సమానంగా మహిళల విజేతకు నగదు దక్కనుంది.

విజేతకు రూ. 19.64 కోట్లు
రన్నరప్‌కు రూ. 9.82 కోట్లు

తొలిసారి స్మార్ట్ రీప్లే సిస్టమ్

ఐపీఎల్, హండ్రెడ్ లీగ్‌లలో ఉపయోగించే స్మార్ట్ రీప్లే సిస్టమ్‌ను తొలిసారి ఐసీసీ వరల్డ్‌కప్‌లో ఉపయోగించనున్నారు. రివ్యూ ఫలితాన్ని వేగంగా ప్రకటించేందుకు ఈ వ్యవస్థ ఉపకరిస్తుంది. ఇందులో టీవీ అంపైర్‌కు హాక్-ఐ విజువల్స్ నేరుగా ఆపరేటర్ల నుంచి అత్యుత్తమ కోణాల్లో అందనున్నాయి. ఇంతకుముందు హాక్-ఐ ఆపరేటర్లు, థర్డ్ అంపైర్‌కు మధ్య టీవీ బ్రాడ్‌కాస్ట్ డైరెక్టర్ అనుసంధానకర్తగా ఉండేవాడు. ఈ కారణంగా కొంత జాప్యం జరిగేది.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐడీలో బీ డిజైన్



అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ సహా అహ్మదాబాద్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో బీ డిజైన్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. దీని వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల భాషలో నిర్వహిస్తారు. డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్ దశలు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత పొందినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేస్తారు. ప్రతి కేటగిరీలో సీట్ల సంఖ్యకు మూడు రెట్లమందిని మెయిన్స్‌కు అనుమతిస్తారు. ప్రిలిమ్స్, మెయిన్స్ స్కోర్ ఆధారంగా తదుపరి అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు.

బీ డిజైన్

విభాగాలు: యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.

సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 125 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థుల కోసం అహ్మదాబాద్ క్యాంపస్‌లో 19 సీట్లు, మధ్యప్రదేశ్ క్యాంపస్‌లో 11 సీట్లు, హరియాణా క్యాంపస్‌లో 11 సీట్లు అదనంగా ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2004 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. సీబీఎస్ఈ/ఐబీ/ఐసీఎస్ఈ/ఇతర గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2024-25 విద్యా సంవత్సరం నాటికి సైన్స్, ఆర్ట్స్, కామర్స్, హ్యుమానిటీస్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 15 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల 'జాయింట్ సర్వీసెస్ వింగ్ కోర్సు' ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) నుంచి కనీసం అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామ్ పాసైనవారు; బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే మూడేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఎగ్జామ్(లండన్/శ్రీలంక) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్-పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు. మెయిన్స్ ఎగ్జామ్‌ను స్టూడియో సెటప్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఇందులో మల్టిపుల్ టెస్ట్‌లు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 40 శాతం, మెయిన్స్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు రూ.5,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 3
- **ఎడిట్ విండో ఓపెన్:** డిసెంబరు 4 నుంచి 9
- **ప్రిలిమ్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 24 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **ప్రిలిమ్స్ తేదీ:** 2025 జనవరి 5న
- **ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 1న.
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date to Apply: 15-10-2024. *Application mode:* Online applications only.
Short Url: ww.b4s.in/aj/TCPS27

Santoor Scholarship Programme

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.
Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.
Applicants must have: passed Class 10 from a local government school. passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And enrolled in a full-time graduate programme starting in 2024-25.
Note:
- The full-time graduate course must have a minimum duration of 3 years.
- Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply.
- Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum
Last Date to Apply: 15-10-2024
Application mode: Online applications only! Students can apply online at Buddy4study or download the application form from www.santoorscholarship.com.
Short Url: www.b4s.in/aj/SWS7

SCHOLARSHIP ALERT

Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25

Description: Haleon India, makers of Sensodyne, invites applications for the 'Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25' to support meritorious and underprivileged BDS students across India.
Eligibility:
- Open to students pursuing their first year of the Bachelor of Dental Surgery (BDS) programme from government and government-funded colleges only.
- Applicants must have scored a minimum of 60% in their Higher Secondary Education.
- Successful applicants must maintain a 60% score in every semester/year to continue availing of the benefits during their 4-year course.
- The annual family income of the applicant from all sources must not be more than INR 8,00,000.

Prizes & Rewards: INR 4,20,000 for 4 years (INR 1,05,000 per year)
Last Date to Apply: 31-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SSPPS4

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి



నాని పక్కన కేజీఎఫ్ భామ

నాని నటిస్తున్న 32వ సినిమా 'హిట్.. ద థర్డ్ కేస్'. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కేజీఎఫ్ భామ శ్రీనిధి శెట్టి నటిస్తోంది. సినిమాలో ఆమె పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉందని దర్శకుడు చెప్పారు. ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతున్న షూటింగ్‌లో శ్రీనిధి జాయిన్ అయింది. నాని, శ్రీనిధిపై కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. వచ్చే ఏడాది మే ఒకటిన విడుదలయ్యే ఈ సినిమాను ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు.

క్రైమ్ క్యాన్సర్ లాంటిది.. పెరగనివ్వకూడదు



'వారంలో ఎన్‌కౌంటర్ జరిగిపోవాలి' అని రావు రమేశ్ అనగానే 'వారం అక్కర్లేదు.. మూడే రోజుల్లో డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరొస్తుంది' అంటూ స్టయిలిష్ నడకతో ఎంట్రీ ఇచ్చారు రజనీకాంత్. ఆయన హీరోగా నటించిన 'వేట్టయన్.. ద హంటర్' సినిమా ఈ నెల పదిన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం విడుదల చేసిన ట్రైలర్ ఆకట్టుకుంటోంది. అలాగే అమితాబ్, రానా, ఫాహద్ ఫాజిల్ పాత్రల్ని కూడా ఈ ట్రైలర్‌లో పరిచయం చేశారు. 'క్రైమ్ అనేది క్యాన్సర్ లాంటిది. దానిని పెరగనివ్వకూడదు' వంటి డైలాగులు, అద్భుతమైన విజువల్స్ అలరిస్తున్నాయి. 'నన్ను ఏ పోస్టులో తిప్పి కొట్టినా నేను మాత్రం పోలీస్ వాడినే సార్.. నా నుంచి వాడిని కాపాడడం ఎవరి వల్లా కాదు' అంటూ రజనీకాంత్ డైనమిక్‌గా చెప్పే డైలాగ్ ఈ సినిమా మీద అంచనాలు పెంచేసింది. మంజు వారియర్, రోహిణి, అభిరామి, రితికా సింగ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమాను టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించారు.

కోలుకుంటున్న రజనీకాంత్

● ఆయన ఆరోగ్యంపై ప్రధాని ఆరా

తీవ్ర అస్వస్థతకు గురై చెన్నై నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ క్రమంగా కోలుకుంటున్నారు. గురువారం డిశ్చార్జ్ అయ్యే అవకాశముందని ఆసుపత్రివర్గాలు వెల్లడించాయి. ఇంటికి చేరిన తర్వాత ఆయన వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సివుంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలావుండగా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రజనీ ఆరోగ్యం గురించి ఆయన సతీమణి లతా రజనీకాంత్‌కు ఫోన్ చేసి వాకబు చేశారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

శ్వాగ్ లాంటి సినిమా తీయడం కష్టం



'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణు, రీతూ వర్మ నటించిన చిత్రం 'శ్వాగ్'. టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిష్ణు మాట్లాడుతూ "ఇది చాలా పెద్ద కథ. ఇలాంటి కథను తెరకెక్కించడం అంత ఈజీ ఏం కాదు. ఇందులో నాలుగు పాత్రలు పోషించాను. హసిత్ ఈ సినిమాను చాలా బాగా హ్యాండిల్ చేశారు" అని చెప్పారు. "'గూఢచారి', 'జేబీ' 'కార్తికేయ' వంటి సినిమాల్లా.. మార్కెట్ కంటే ఎక్కువ స్పాన్ ఉన్న చిత్రం 'శ్వాగ్'. కచ్చితంగా ఘనవిజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది" అని నిర్మాత టీ.జీ.విశ్వప్రసాద్ అన్నారు. "నిర్మాత విశ్వప్రసాద్ మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. శ్రీవిష్ణు కథను హీరోగా భావించే సినిమా చేసే గొప్ప నటుడు" అని డైరెక్టర్ హసిత్‌గోలి చెప్పారు. "ఇందులోని ప్రతీ పాత్ర కొత్తగా ఉంటుంది. సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది" అని హీరోయిన్ రీతూ వర్మ తెలిపారు.

'గాంధీ' కోసం రెహమాన్ సంగీతం



బాలీవుడ్ డైరెక్టర్ హన్సల్ మెహతా దర్శకత్వంలో మహాత్ముడి జీవితం ఆధారంగా 'గాంధీ' సిరీస్ తెరకెక్కుతోంది. గాంధీ జయంతి సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన ఓ కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం షేర్ చేసుకుంది. ఈ సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారని ప్రకటించింది. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ 'దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ జీవిత కథను ఈ సిరీస్ స్ఫూర్తిదాయక రీతిలో ప్రజెంట్ చేస్తుంది. అటువంటి గొప్ప పోరాట యోధుడి బయోపిక్‌కు సంగీతం అందించటం ఆనందంగా ఉంది" అని అన్నారు. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్రన్ గుహ రాసిన 'గాంధీ బిఫోర్ ఇండియా' పుస్తకం ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కుతోంది. అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది.

ఇన్ ప్రోగ్రెస్

విలన్ ఎవరనేది సస్పెన్స్



'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రంతో పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా పరిచయమవుతున్నారు. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు. ఈ నెల నాలుగున విడుదలవుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను రానా విడుదల చేసి, సుదర్శన్‌కు అభినందనలు తెలిపారు. సస్పెన్స్ జానర్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాలో విలన్ ఎవరన్నది తెలియకుండా ట్రైలర్‌ను కట్ చేసిన విధానం దర్శకుని ప్రతిభను విదితం చేసింది. వరలక్ష్మి శరత్‌కుమార్, శ్రీదీక్ష, నాజర్, రఘుబాబు తదితరులు నటించారు.

ప్రేక్షకులు మెచ్చే ప్రేమకథ



శ్రీనివాస్ మహత్ దర్శకత్వంలో చంద్రహాస్ హీరోగా నటించిన చిత్రం 'రామ్‌నగర్ బన్నీ'. మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మిస్తున్నారు. ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు రామ్‌గోపాల్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'రామ్‌నగర్ బన్నీ' ప్రచార చిత్రాలతో సినిమాపై ఆసక్తి పెరిగింది. చంద్రహాస్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలి' అని ఆకాంక్షించారు. మా టీం అంతా ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు అని దర్శకుడు చెప్పారు. ప్రేక్షకులు 'రామ్‌నగర్ బన్నీ' చిత్రాన్ని ఆదరించాలని ప్రభాకర్ కోరారు. ప్రేక్షకులను ఆకట్టుకునే వినోదంతో పాటు మంచి ప్రేమకథ ఉన్న చిత్రమిది, ప్రేక్షకులను మెప్పిస్తుందని చంద్రహాస్ చెప్పారు.

దీక్ష.. పట్టుదల



కిరణ్‌కుమార్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ దర్శకత్వంలో పినిశెట్టి అశోక్‌కుమార్ నిర్మిస్తున్నారు. 'దీక్ష, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్‌తో చిత్రాన్ని తీశాం. హీరోగా కిరణ్‌కు ఎంతో పేరు తెచ్చే సినిమా ఇది. రాజ్‌కిరణ్ స్వరపరిచిన పాటలు ఆకట్టుకుంటాయి. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. మా నిర్మాత అశోక్‌కుమార్‌గారు వెనుకుండి మమ్మల్ని నడిపిస్తున్నారు' అని చెప్పారు సినిమాలో ఐటెం సాంగ్ చేసిన అక్సాఖాన్ మాట్లాడుతూ 'ఇందులో అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమాతో పాటు 16 భాషల్లో వస్తున్న 'మహిళా కబడ్డీ' సినిమాలోనూ ఆర్ కె గౌడ్ అవకాశం ఇచ్చారు' అని తెలిపారు.

ట్వెల్త్ ఫెయిల్‌కు ప్రీక్వెల్



విధువినోద్ చోప్రా దర్శకత్వంలో తెరకెక్కిన 'ట్వెల్త్ ఫెయిల్' బయోపిక్ ప్రేక్షకుల నుంచి ఎంతటి ఆదరాభిమానాలను అందుకుందో తెలిసిందే. విక్రంత్ మస్సే ఇందులో ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ మనోజ్ కుమార్ శర్మగా.. కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో.. 'ట్వెల్త్ ఫెయిల్' సినిమాకు ప్రీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'జీరో సే రీస్టార్ట్' సినిమాను డిసెంబరు 13న విడుదల చేయనున్నట్లు విధువినోద్ చోప్రా ప్రకటించారు. "మొదటి భాగంలో ఉన్న నటీనటులే ఇందులోనూ కొనసాగుతారు. ఈ ప్రీక్వెల్ కథానాయకుడి బ్యాక్ స్టోరీపై ఫోకస్ చేస్తుంది. ఇందులో మనోజ్ కుమార్ జీవితాన్ని మార్చేసిన సంఘటనలను ఆసక్తికరంగా చూపించనున్నాం" అని చెప్పారు.

ఆ నేపథ్యంలో ఎవరూ చేయని సినిమా



'కరోనా సమయంలో ఆత్మహత్యలు చేసుకొనే వారి సంఖ్య పెరిగింది. అలాంటి ప్రయత్నం చేసినప్పుడు ఎవరైనా అడ్డుకుని వారిని ఆ ఆలోచనకు దూరం చేస్తే బాగుంటుంది.. అనే పాయింట్‌తో దర్శకుడు శివశేష రాసుకున్న కథ విన్నప్పుడు నాకు కొత్తగా అనిపించింది. ఇలాంటి నేపథ్యంలో ఎవరూ సినిమా చేయలేదనిపించి, నా సమర్పణలో 'కలి' చిత్రాన్ని నిర్మించాం' అన్నారు సీనియర్ జర్నలిస్టు రాఘవేంద్రరెడ్డి. ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన 'కలి' చిత్రం ఈ నెల నాలుగున విడుదల కానుంది. లీలా గౌతమ్ నిర్మాత. ఈ నేపథ్యంలో రాఘవేంద్రరెడ్డి చిత్ర విశేషాలను మీడియాకు వెల్లడిస్తూ 'శివరామ్ అనే మంచి వ్యక్తి తన జీవితంలో ఎదురైన కొన్ని ఇబ్బందుల వల్ల ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటాడు. ఆ సమయంలో ఒక అపరిచిత వ్యక్తి అతని ఇంటికి వస్తాడు. అతని రాకతో శివరామ్ జీవితం ఎలా మారింది అనేది 'కలి' కథ. ఎలాంటి సందేశాలు, ఉపోద్ఘాతాలు లేకుండా సినిమా తీశాం. నిర్మాణపరంగా ఎక్కడా రాజీపడలేదు.. ఇందులో బల్లి పాత్రకు ప్రియదర్శి, గోడ గడియారంకు అయ్యప్ప పి.శర్మ డబ్బింగ్ చెప్పారు' అని చెప్పారు రాఘవేంద్రరెడ్డి. దర్శకుడు శివ శేష ప్రతిభావంతుడనీ, పురాణాల మీద మంచి పట్టు ఉందని తెలిపారు. సినిమా మేకింగ్ మీద ప్యాషన్‌తో లీలా గౌతమ్ వర్మ నిర్మాణరంగంలోకి వచ్చారనీ, నిర్మాతగా అతనికి మంచి భవిష్యత్ ఉంటుందని రాఘవేంద్రరెడ్డి చెప్పారు.

ముంగిళ్లకు 'ఎంగిలిపూల' కళతో..



హనుమకొండ వేయిస్తంభాల ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులు

పచ్చని చెట్లు.. రంగురంగుల పూలు.. కళకళలాడుతున్న చెరువులు, కుంటలతో నిండుతనం సంతరించుకున్న ప్రకృతిని దైవ స్వరూపంగా కొలిచేందుకు వేళైంది. పల్లె, ఆటాపాటలతో ఆనందంగా జరుపుకొనే బతుకమ్మ ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మొదలయ్యాయి. తొలిరోజైన బుధవారం రాలుపూలను సేకరించి బతుకమ్మగా పేర్చి 'ఎంగిలిపూల బతుకమ్మ'గా జరుపుకొన్నారు. హనుమకొండలోని వేయి స్తంభాల గుడి వద్ద బుధవారం సాయంత్రం దాదాపు పదివేల మంది మహిళలు బతుకమ్మ ఆడారు. భాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఉత్సవాలు జరిగాయి. 'ఒక్కొక్క పువ్వేసి చందమామ' పేరుతో పాటల పుస్తకాన్ని సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ ఆవిష్కరించారు.

-హనుమకొండ, హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

ఉత్తమ్‌కు రాహుల్‌గాంధీ పరామర్శ

మంత్రికి ఫోన్ చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత



న్యూఢిల్లీ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి మృతి పట్ల కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విచారం వ్యక్తం చేశారు. పురుషోత్తమ్ రెడ్డి మరణం తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్‌కు రాహుల్ ఫోన్ చేసి పరామర్శించారు. పురుషోత్తమ్‌రెడ్డి మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ లేఖనూ పంపారు. తండ్రిని కోల్పోయినందుకు మీ బాధను తాను అర్థం చేసుకోగలనని పేర్కొన్నారు.

రేషన్‌కార్డుల దరఖాస్తులకు బ్రేక్

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల నేపథ్యంలో నిర్ణయం

నేటి నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టు

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రేషన్‌కార్డులు లేనివారు ఈ నెల 2 నుంచి దరఖాస్తు చేసుకోవాలని తొలుత ప్రకటించిన సర్కారు.. తాజాగా ఈ ప్రక్రియను నిలిపివేసింది. ప్రభుత్వం నూతనంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు తీసుకొస్తుండడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. రేషన్ సహా అన్ని సంక్షేమ పథకాలను ఈ కార్డుల ద్వారానే అందజేయాలని నిర్ణయించినందున.. ప్రత్యేకంగా రేషన్ కార్డులు అవసరం లేదన్న భావనకు సర్కారు వచ్చింది. ఈ మేరకే దరఖాస్తుల స్వీకరణకు బ్రేక్ వేసింది. కాగా, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టు గురువారం ప్రారంభం కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒక మునిసిపాలిటీని, మరో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుని కార్యక్రమం చేపడుతున్నారు. గురువారం నుంచి ఐదు పనిదినాల్లో.. కుటుంబాలను గుర్తించే ప్రక్రియను పూర్తి చేయనున్నారు. అనంతరం ఈ నెల 10న పైలట్ ప్రాజెక్టు నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఆర్థిక హోదాలతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికీ ఫ్యామిలీ గుర్తింపు కార్డును ఇస్తారు. కుటుంబ పెద్దగా ఇంటి మహిళను పేర్కొంటూ కార్డు జారీ చేస్తారు. కార్డులో కుటుంబ సభ్యులందరికీ కామన్‌గా పది అంకెలను కేటాయిస్తారు. వ్యక్తిగతంగా మరో పది నంబర్ల సంఖ్యను కేటాయిస్తారు. ఇప్పటికే ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ఉన్నతాధికారుల బృందం పర్యటించి.. ఆయా రాష్ట్రాల్లోని విధానాలపై సర్కారుకు నివేదిక ఇచ్చింది. వాటన్నింటినీ పరిశీలించి తెలంగాణలో అత్యుత్తమ విధానాన్ని రూపొందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఫీజు బకాయిలు రూ.6 వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఫీజులను చెల్లించాల్సిందేనంటూ విద్యార్థులపై ఆయా కాలేజీలు ఒత్తిడి తెస్తున్నాయి. పలు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలవుతున్న నేపథ్యంలో కొందరు విద్యార్థులు అప్పో సప్పో చేసి.. డబ్బులు కట్టేసి సర్టిఫికెట్లు తెచ్చుకుంటున్నారు. అంత మొత్తం కట్టలేని విద్యార్థులు.. ఆయా అవకాశాలను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ నేపథ్యంలో తాజాగా నర్సింగ్ విద్యార్థులకూ ఇదే తరహా పరిస్థితి ఎదురవుతోంది. సర్టిఫికెట్లు ఇవ్వాలంటే మొత్తం ఫీజు కట్టాల్సిందేనని స్పష్టం చేస్తుండడంతో వైద్య విద్య సంచాలకుల కార్యాలయాలకు భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి.

వన్‌టైం సెటిల్‌మెంట్‌పై తర్జనభర్జన

పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ పద్ధతిలో క్లియర్ చేయాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై దృష్టి పెట్టింది. అయితే.. ఈ వన్‌టైం సెటిల్‌మెంట్ విషయంలో ఆయా కాలేజీల యాజమాన్యాలు తమ బిల్లులను కొంత మేర తగ్గించుకోవాల్సి ఉన్న నేపథ్యంలో ఏం చేయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నాయి. ఇప్పటికే కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులకు సమాచారం ఇచ్చిన ప్రభుత్వ పెద్దలు.. బిల్లులను ఏ మేరకు తగ్గించుకుంటారనే విషయంపై ఒక అవగాహనకు వచ్చి, ప్రతిపాదనలను సమర్పించాలని సూచించారు. దీనిపై కాలేజీల యాజమాన్యాలు సమావేశమై చర్చించినట్లు తెలిసింది. అయితే.. ఈ అంశంపై ఏకాభిప్రాయానికి రాలేదని సమాచారం. బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం కారణంగా తాము ఇప్పటికే తీవ్రంగా నష్టపోతున్నామని, పైగా ప్రభుత్వం చెల్లించే ఫీజులు కూడా చాలా తక్కువగా ఉన్నాయని.. ఈ పరిస్థితుల్లో వన్‌టైం పద్ధతిలో ఫీజు తగ్గించడం ద్వారా మరింత దెబ్బతింటామనే అభిప్రాయాన్ని పలు కాలేజీలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. పైగా కాలేజీల నిర్వహణ కోసం ఇప్పటికే బ్యాంకుల నుంచి రుణాలను తీసుకున్నామని, వాటిని తిరిగి చెల్లించలేకపోతున్నామని చెప్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సిబ్బందికి జీతాలను కూడా చెల్లించడం లేదని కాలేజీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పథకంలో 12.50 లక్షల మంది విద్యార్థులు..

రాష్ట్రంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ వంటి కోర్సులను చదువుతున్న విద్యార్థులకు వివిధ ప్రాతిపదికల మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని అమలు పరుస్తున్నారు. ఈ పథకం పరిధిలోకి ప్రతీ ఏడాది సుమారు 12.50 లక్షల మంది విద్యార్థులు వస్తున్నారు. ఇందుకోసం ప్రతీ ఏడాది సర్కారుపై సుమారు రూ.2,250కోట్ల భారం పడుతోంది. రూ.6వేల కోట్ల బకాయిలు ఈ ఏడాది మార్చి వరకు ఉన్నవి మాత్రమే. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైనందున వచ్చే మార్చి నాటికి కొత్త బిల్లులు కూడా జమ కానున్నాయి. దాంతో ఈ బిల్లుల భారం మరింత పెరగనుంది. ఈ పెండింగ్ బిల్లుల్లో సుమారు రూ.380 కోట్ల బిల్లులకు సంబంధించి అధికారులు గత ఏడాది నవంబరులో టోకెన్లను కూడా జారీ చేశారు. వీటికి సంబంధించిన చెల్లింపులను మాత్రం చేయలేదు.

'ఫీజు' రాక.. పీజీలో చేరలేక!

ఫీజు బకాయిలను సర్కారు చెల్లించకపోవడంతో బీటెక్, బీఫార్మసీ పాసైన విద్యార్థులకూ ఏటా ఇదే తరహా పరిస్థితి ఎదురవుతోంది. పీజీఈసెట్‌లో అర్హత పొంది, కౌన్సెలింగ్ ద్వారా సంపాదించిన ఎంటెక్, ఎంఫార్మసీ సీట్లను వదులుకునే పరిస్థితి ఏర్పడుతోంది. కొందరు సీట్లను వదులుకుంటుంటే.. మరికొందరు అప్పోసొప్పో చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తెచ్చుకుంటున్నారు. దీనిపై తక్షణమే ప్రభుత్వం స్పందించాలని.. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేలా కాలేజీలకు ఆదేశాలివ్వాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

నర్సింగ్ కాలేజీలపై ఫిర్యాదుల వెల్లువ

ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రైవేట్ కాలేజీలు నిరాకరిస్తున్నాయి. మొత్తం ఫీజును చెల్లిస్తేనే ధ్రువపత్రాలు ఇస్తామని స్పష్టం చేస్తున్నాయి. 2,050 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి గత నెలలో మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల కాగా, ఈ నెల 14వ తేదీ వరకే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై రెండు రోజుల క్రితం మెహదీపట్నం సమీపంలోని నైటింగేల్ నర్సిం గ్ కాలేజీకి చెందిన వంద మంది విద్యార్థులు కోఠీలోని డీఎంఈ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్టిఫికెట్లు కావాలంటే రూ.65-75 వేలు చెల్లించాలని, పట్టు చీరలు కూడా కొనివ్వాలని సదరు కాలేజీ యాజమాన్యం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బూతులు తిడుతూ దిక్కున్న చోట చెప్పుకోమన్నారని డీఎంఈకి వివరించారు. కొందరు విద్యార్థులు ఇప్పటికే డబ్బులు చెల్లించారంటూ సంబంధిత రశీదులను అందజేశారు. ఇదే విధంగా, వారం రోజుల నుంచి మరి కొన్ని కాలేజీలపైనా ఫిర్యాదులు రావడంతో స్పందించిన వైద్యఆరోగ్య శాఖ.. ముగ్గురు సభ్యులతో మంగళవారం విచారణ కమిటీని వేసింది. తక్షణమే రంగంలోకి దిగిన కమిటీ సభ్యులు విద్యార్థులనుంచి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ హయాం నుంచీ ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండడం వల్లే.. విద్యార్థుల దగ్గర్నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రైవేటు నర్సింగ్ కాలేజీల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి వెల్లడించారు. కాగా, కొన్ని కాలేజీలకు కొద్దిమొత్తంలో బకాయిలు అందినా.. మొత్తం ఫీజు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబం!

- చిల్లర కుటుంబం కేటీఆర్‌ది
- హైడ్రాపై సీఎం రేవంత్ ఆచితూచి అడుగులు
- చెరువుల్లో ఇళ్లు కడుతున్న రియల్ వ్యాపారులకే హైడ్రా వ్యతిరేకం
- బీఆర్ఎస్ పాలనలో పనిచేసిన కొందరు అధికారులకు ఆ పార్టీతో ఇంకా సోపతి
- వారి పనితనంతో మాపై మచ్చతెస్తున్నరు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ దీన్ని గమనించి ముందడుగేయాలి: తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): "ఈ దేశాన్ని 52 ఏళ్లు పాలించిన రాహుల్ గాంధీ కుటుంబం.. ప్రస్తుతం నివాసం ఉంటున్నది ప్రభుత్వ బంగళాలోనే. వారు సంపాదించిన ఆస్తి అదే. ఆ కుటుంబం గురించి ప్రజలకూ బాగా తెలుసు. అలాంటిది.. మూసీ డబ్బుల తో బతకాలని రాహుల్‌గాంధీ అనుకుంటడా?" అంటూ కేటీఆర్‌ను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి నిలదీశారు. అందరూ కేసీఆర్, కేటీఆర్ లాగానే సంపాదిస్తారని అనుకోవద్దన్నారు. రాహుల్‌ది త్యాగాల కుటుంబమైతే కేటీఆర్‌ది చిల్లర కుటుంబమన్నారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశం లో జగ్గారెడ్డి మాట్లాడారు. హైడ్రా విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆచితూచి వ్యవహరిస్తున్నారని, ప్రజలకు సంబంధించి లాభనష్టాల గురించి ఆలోచన కూడా ఆయనకు ఉంటుందని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పని చేసిన కొందరు అధికారులకు ఇంకా ఆ పార్టీతో సోపతి పోలేదన్నారు. వారు తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో జాగ్రత్త చెప్పేందుకే హైడ్రాపైన ప్రకటన ఇచ్చానని చెప్పుకొచ్చారు. అలాంటి అధికారులు అత్యుత్సాహం చూపొద్దనే చెప్పానన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ దీన్ని గమనించి ముందుకు వెళ్లాలనే మీడియా ముఖంగా సందేశం ఇచ్చానన్నారు. హైడ్రా పేదోళ్లకు వ్యతిరేకం కాదని, చెరువుల్లో ఇళ్లు కడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకే వ్యతిరేకమని అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంచి అధికారే కానీ లీడర్ కాదని వ్యాఖ్యానించారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న తూర్పు జగ్గారెడ్డి

కేటీఆర్.. కొండా సురేఖకు క్షమాపణ చెప్పు!

మంత్రి కొండా సురేఖ పైన బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుగా ట్రోల్ చేసినందుకుగాను ఆమెకు క్షమాపణ చెప్పాలని జగ్గారెడ్డి కేటీఆర్‌కు సూచించారు. "బీఆర్ఎస్ సోషల్ మీడియాను కంట్రోల్ చేయకపోవడం.. కేటీఆర్ తప్పు. కంట్రోల్ చేయకపోగా పుండు మీద కారం చల్లినట్లు ఆయన మాట్లాడిండు. అసలే సురేఖ అంటే ఫైర్! తెలిసి కూడా ఆమె జోలికి పోయావు. సురేఖతో కొట్లాడుడు అంత ఈజీ కాదు. ప్రశాంతంగా ఉన్న ఆమెను అనవసరంగా రెచ్చగొట్టి తన్నించుకుంటున్నావు" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్, కేటీఆర్‌లకు దండలు వేసిన ఆడవాళ్లనూ అలాగే చూస్తారా? అని ప్రశ్నించారు. పదేళ్ల రాజభోగాలు అనుభవించిన కేటీఆర్.. ఇంకో పదేళ్ల ఓపిక పట్టాల్సిందేనన్నారు. పరిపూర్ణత చెందిన నాయకునిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

నటనలో పుట్టి పెరిగిన బీజేపీ నేతలు

ఆర్థికంగా ప్రభుత్వానికి ఇబ్బందులు ఉన్నా రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు సీఎం, మంత్రులు రాష్ట్రంలోని రైతులకు రూ.2 లక్షల మేరకు ఏక కాలంలో రుణమాఫీ చేశారని జగ్గారెడ్డి చెప్పారు. మొత్తం రూ.18 వేల కోట్ల మేరకు రైతుల ఖాతాలో వేశారన్నారు. మిగిలిన మొత్తం డాటా సరిగా లేక ఆలస్యమవుతోందన్నారు. అయితే తెలంగాణలో రాజకీయంగా ఉనికి పెంచుకునే పనిలో పడిన బీజేపీ.. రాష్ట్రంలో రుణమాఫీ జరగలేదంటూ ఇందిరా పార్కు వద్ద దీక్ష చేసిందన్నారు. "స్విస్ బ్యాంకుల్లోని నల్లధనం తెచ్చి ప్రతి పేదోడి అకౌంట్లో వేస్తానన్న ప్రధాని మోదీ.. ఈ పదేళ్లలో ఒక్క పేదోడి అకౌంట్లోనైనా చిల్లి గవ్వ అయినా వేశారా? ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల చొప్పున ఇప్పటికి 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండాలి. దీనిపైన బీజేపీ నేతలు చర్చకు సిద్ధమా? రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్నారు. దీనికి సమాధానం ఉందా? రైతుల నడ్డి విరిచే నల్ల చట్టాలు తెచ్చింది నిజం కాదా? దానికి నిరసనగా దీక్షలు చేస్తున్న రైతులను వాహనంతో తొక్కి చంపిన చరిత్ర మీది కాదా? వీటన్నింటికీ తెలంగాణ బీజేపీ నేతలు సమాధానం చెప్పగలరా?" అంటూ నిలదీశారు. బీజేపీ వారిలా తమకు డ్రామాలు వేయడం రాదన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రాక్టికల్‌గా ఉంటే.. బీజేపీ నేతలు నటనలో పుట్టి.. నటనలో పెరిగారని విమర్శించారు.



అతిథి గృహంలో చిన్న కుమార్తెతో డిక్లరేషన్‌పై సంతకం చేయిస్తున్న పవన్

తిరుమల శ్రీవారిని దర్శించుకుని

దీక్ష విరమించిన పవన్

తిరుమల/తిరుపతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల శ్రీవారిని దర్శించుకుని ప్రాయశ్చిత్త దీక్షను విరమించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహార నేపథ్యంలో 11 రోజులపాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఆయన మంగళవారం సాయంత్రం అలిపిరి నడకమార్గంలో తిరుమల చేరుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుమార్తెలు ఆద్య, పొలెనా అంజనతో కలిసి మహాద్వారం గుండా ఆలయంలోకి వెళ్లారు. ఆ తర్వాత ధ్వజస్తంభానికి మొక్కుకుని బంగారువాకిలికి చేరుకున్నారు. తనతో పాటు తీసుకువచ్చిన 'వారాహి డిక్లరేషన్' పుస్తకాన్ని శ్రీవారి పాదాల వద్ద ఉంచి దర్శించుకున్నారు. పవన్ కల్యాణ్ తన చిన్నకుమార్తె పొలెనా అంజనతో డిక్లరేషన్‌పై సంతకం చేయించారు. ఆలయ నిబంధనల ప్రకారం అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వస్తే తమకు హిందూ సంప్రదాయాలంటే గౌరవమని, శ్రీవారిపై నమ్మకంతో వచ్చామని ఉన్న డిక్లరేషన్‌పై సంతకం చేయాలి. పవన్ తన కుమార్తె పొలెనా అంజనతో డిక్లరేషన్‌పై సంతకం చేయించారు. పొలెనా మైనర్ కావడంతో తండ్రిగా పవన్ కల్యాణ్ కూడా ఆ డిక్లరేషన్‌పై సంతకం చేశారు.

పిడుగులు పడి ముగ్గురు మహిళల మృతి

- భద్రాద్రి జిల్లాలో ఎడ్లబండితో వాగులో కొట్టుకుపోయి రైతు మృతి
- ఖమ్మం జిల్లాలో పలుచోట్ల గాలివాన
- 3 నెలలు సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం
- వాతావరణ శాఖ.. నేడు, రేపు మోస్తరు వర్షాలు



నిర్మల(ఫైల్)



రమ(ఫైల్)



లక్ష్మి(ఫైల్)



గాంధీ(ఫైల్)

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 2: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల పిడుగులు పడి హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపల్లిలో ఇద్దరు మహిళా కూలీలు, భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లిలో ఓ మహిళా రైతు మృతి చెందారు. ఆత్మకూరు మండలం చౌళ్లపల్లి గ్రామానికి చెందిన ఇటుకాలపల్లి నిర్మల(51), సోలంకె రమ(45) బుధవారం ఓ రైతు పొలంలో పనులు చేస్తుండగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం మొదలైంది. నిర్మల, రమ దగ్గరలో ఉన్న చెట్టు కిందకి వెళ్లారు. అదే సమయంలో ఆ చెట్టుపై పిడుగు పడడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కారట్లపల్లి లక్ష్మి(45) తన మిరప తోటకు ఎరువు చల్లేందుకు బుధవారం మధ్యాహ్నం వెళ్లగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని మొండ్రాయిగూడెం తండాకు చెందిన బానోత్ బాలు ఇంటి సమీపంలో పిడుగు పడి అస్వస్థతకు గురయ్యాడు. వరద ప్రవాహానికి ఓ రైతు వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన ఘటన బుధవారం భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలంలోని కొత్తతండాలో జరిగింది. అంగోతు గాంధీ(32) అనే రైతు తన భార్య రజిత, తండ్రి లక్ష్మా, మరికొంత మంది కూలీలతో కలిసి పొలానికి వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని సాయంత్రం అందరు ఎడ్లబండిపై తిరిగి వస్తూ వాగు దాటుతుండగా నీటిప్రవాహం ఎక్కువగా ఉండి ఎడ్లబండి కొట్టుకుపోయింది. బండిలో ఉన్నవారిని పక్కన ఉన్నవారు రక్షించారు. అయితే ఎడ్లబండి తిరగబడి వాగులో పడి ఉన్న చెట్టును ఢీకొనడంతో బండి తోలుతున్న గాంధీ మృతి చెందాడు. మరోవైపు ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం గాలి దుమారంతో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా రఘునాథపాలెం మండలంలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వైరాలో గాలి దుమారంతో చెట్లు నేలకూలడంతో వైరా, మధిర, జగ్గయ్యపేట రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఖమ్మంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా అక్టోబరు నుంచి డిసెంబరు వరకు తెలంగాణలో వర్షపాతం సాధారణంకన్నా అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. అక్టోబరు నెలలో ఉత్తర తెలంగాణలో సాధారణంకంటే ఎక్కువగా.. దక్షిణ తెలంగాణలో సాధారణంకంటే తక్కువగా, మిగతా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈమేరకు బుధవారం వర్షాకాల అనంతర దీర్ఘకాల వాతావరణ సూచనను విడుదల చేసింది. అలాగే అక్టోబరులో దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షపాతం సాధారణంకంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలో గురు, శుక్రవారాలు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం రాష్ట్రంలోని వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.



మహాత్ముడికి పలువురు నేతల ఘన నివాళులు

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. శాసనసభ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల ఐలయ్య, శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదన చారి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ తన శాంతి, అహింస అనే ఆయుధాలతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి దేశానికి స్వాతంత్య్రం తెచ్చారని నేడు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మహాత్మాగాంధీ బాటలో నడుస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. గాంధీ స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్‌కు పిలుపునిచ్చారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డిపై చీటింగ్ కేసు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీసుస్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఆయన వ్యాపార భాగస్వామి గంటా రాజశేఖర్ చేసిన ఫిర్యాదు మేరకు ధర్మారెడ్డితోపాటు రియల్టర్ పురుషోత్తం నాయుడుపై పోలీసులు కేసు నమోదు చేశారు. చల్లా ధర్మారెడ్డి, పురుషోత్తంనాయుడు, గంటా రాజశేఖర్ డైరెక్టర్లుగా మొత్తం తొమ్మిది మంది భాగస్వామ్యంతో విజన్ రిసార్ట్స్ అనే సంస్థ నెలకొల్పారు. వీరంతా శామీర్‌పేటలో సుమారు 200 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఆ స్థలాన్ని వెంచర్‌గా అభివృద్ధికి ఇచ్చేందుకు రాజశేఖర్ అంగీకరించకపోవడంతో ముగ్గురు డైరెక్టర్ల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో రాజశేఖర్‌ను డైరెక్టర్ పదవి నుంచి తప్పించేందుకు ధర్మారెడ్డి, పురుషోత్తంనాయుడు సిద్ధమయ్యారు. ఇందుకోసం సంస్థలో రాజశేఖర్ వాటాను తగ్గించి మరొకరి వాటాను పెంచి ఆ వ్యక్తిని డైరెక్టర్ చేస్తున్నట్టు పత్రాలు సృష్టించారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించగా నాంపల్లిలోని రిజిస్ట్రార్ కార్యాలయం రాజశేఖర్ సంతకాలు కోరింది. దీంతో మాదాపూర్‌లోని రాజశేఖర్ ఇంటికి వచ్చిన ధర్మారెడ్డి, పురుషోత్తం నాయుడు తమకు కావాల్సిన సంతకాలు చేయాలని ఒత్తిడి చేయగా ఆయన నిరాకరించారు. తప్పుడు పత్రాలు సృష్టించి వాటిపై సంతకాలు చేయాలని తనని బెదిరిస్తున్నారంటూ రాజశేఖర్ పోలీసులను ఆశ్రయించారు.

ఎన్ని లీగల్ నోటీసులు పంపినా తగ్గేదే లే

- హరీశ్‌కు ఎక్స్ వేదికగా స్పష్టం చేసిన ఎంపీ అనిల్‌కుమార్

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రంగనాయకసాగర్ ప్రాజెక్టు కోసం సర్వే నంబర్ 402లో మాజీ మంత్రి హరీశ్‌రావు గెస్ట్ హౌస్ ఉన్న 2.36 ఎకరాలను భూసేకరణ నుంచి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు విన‌హాయించిందో చెప్పాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. తాను చేసిన ఆరోపణలపై ఎన్ని లీగల్ నోటీసులు పంపినా.. గత పదేళ్లలో నువ్వు చేసిన అక్రమాలను బయటపెడుతూనే ఉంటానని అనిల్‌కుమార్ బుధవారం ఎక్స్ వేదికగా హరీశ్‌కు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలో రంగనాయకసాగర్ ప్రాజెక్టు పక్కనే ఉన్న హరీశ్‌రావుకు చెందిన విలాసవంతమైన ఫాంహౌస్ అక్రమాల చిట్టా ఇదిగో.. అంటూ వీడియో క్లిప్పింగ్‌ను పోస్ట్ చేశారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టు కోసం సర్వే నంబర్ 402లో సామాన్య రైతులకు చెందిన 2.08 ఎకరాల భూములనే ఎందుకు సేకరించారని, హరీశ్ గెస్ట్ హౌస్ ఉన్న 2.36 ఎకరాలను ఎందుకు మినహాయించారని ప్రశ్నించారు. సర్వే నంబరు 402లో ఉన్న 2.36 ఎకరాల భూమిని హరీశ్ రెండు విడతలుగా ఎలా కొనుగోలు చేశారు? దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రంగనాయకసాగర్ భూసేకరణలో అక్రమాలకు పాల్పడింది నిజం కాదా? అధికార దుర్వినియోగంతో ఫాంహౌస్ ఉన్న భూమిని, భూసేకరణ నుంచి మినహాయించింది వాస్తవం కాదా? దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని అనిల్‌కుమార్ సవాల్ విసిరారు.

మోత రోహిత్‌పై కేసు నమోదు

- కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్నందుకు చర్యలు
- నల్లకుంట పీఎస్‌లో ముఠా జైసింహ ఫిర్యాదు

రాంనగర్, హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మూసీ బాధితులను పరామర్శించడానికి వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న యూత్ కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మోత రోహిత్‌పై కేసు నమోదయ్యింది. బుధవారం రోహిత్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో నల్లకుంట పీఎస్ ముందు ధర్నా నిర్వహించారు. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నల్లకుంట ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ జరిగిన ఘటనపై ఉన్నతాధికారులతో చర్చించి మోత రోహిత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, కాంగ్రెస్ నేతలు తెలంగాణభవన్ వద్ద దిష్టిబొమ్మ దగ్ధం చేసే ప్రయత్నం చేస్తే వారిని పోలీసులు ఎందుకు అదుపులోకి తీసుకోలేదని ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల మాటలు విని దాడికి పాల్పడిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతలపై కేసులుపెట్టి.. ఇబ్బందులకు గురిచేయడం తగదని, పోలీసుల తీరుమార్చుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఎక్స్ వేదికగా పోస్టుపెట్టారు.

ఐఆర్‌జీసీని ఉగ్ర సంస్థగా ప్రకటించండి

» భద్రతామండలిలో ఇజ్రాయెల్



న్యూయార్క్, అక్టోబరు 2: ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్(ఐఆర్‌జీసీ)ని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని ఐరాస భద్రత మండలిలో ఇజ్రాయెల్ డిమాండ్ చేసింది. ఐఆర్‌జీసీకి తన-పర బేధం లేదని.. చంపడమొక్కటే ఆ సంస్థ లక్ష్యమని ఐరాసలో ఇజ్రాయెల్ ప్రతినిధి డానీ డానన్ ఆరోపించారు. ఇంకా హమాస్ చెరలో ఉన్న 101 మంది బందీలను విడుదల చేసేదాకా ఇజ్రాయెల్ వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణిదాడుల దాడిపై బుధవారం భద్రతా మండలిలో సుదీర్ఘ చర్చ జరిగింది. లెబనాన్‌లో దురాక్రమణను ఆపాలంటూ ఫ్రాన్స్, తమ దేశంపై ఇరాన్ దాడికి వ్యతిరేకంగా ఇజ్రాయెల్ తీర్మానాలు చేశాయి. స్విట్జర్లాండ్ అధ్యక్షత కొలువుదీరిన భద్రతా మండలిలో ఈ తీర్మానాలపై తొలుత ఐరాస సెక్రటరీ ఆంటోనియో గుటెర్రస్ మాట్లాడారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలని, గాజా, లెబనాన్‌లలో కాల్పుల విరమణ జరగాలని ఆకాంక్షించారు. ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా కూడా ఇదే అభిప్రాయాలను వ్యక్తం చేయగా.. గాజా, లెబనాన్‌లలో దురాక్రమణను ఆపేలా అంతర్జాతీయ సమాజం ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తేవాలని రష్యా.. లెబనాన్‌లో కమ్యూనికేషన్ పరికరాల పేలుళ్ల మొదలు.. ఇజ్రాయెల్ భూతల దాడుల వరకు ఆందోళనకరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని చైనా ఆవేదన వ్యక్తం చేసింది. ఇరాన్ ప్రతినిధి అమీర్ సయీద్ ఇర్వానీ మాట్లాడుతూ.. ఇజ్రాయెల్‌కు అమెరికా, బ్రిటన్ మద్దతుందని.. ఈ మూడు దేశాల వల్లే పశ్చిమాసియా ప్రాంతానికి ముప్పు పొంచి ఉందని ఆరోపించారు. ఇజ్రాయెల్ సేనలు హతమార్చిన హమాస్ నేత హనియేను తమ దేశ ప్రత్యేక అతిథిగా పేర్కొన్నారు. ఇజ్రాయెల్ తన వైమానిక దాడులతో సిరియా, లెబనాన్‌లోని తమ దళాలను మట్టుబెట్టాయని గుర్తుచేశారు. "ప్రాంతీయ భద్రత కోసం ఏం చేయాలో అదే ఇరాన్ చేసింది(మిసైల్ దాడులను ఉద్దేశించి)" అని వ్యాఖ్యానించారు. లెబనాన్ ఉపాధ్యక్షుడు, ఐరాసలో ఆ దేశ ప్రతినిధి డాక్టర్ అమల్ ముదాల్‌అలి మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ తమ దేశంలో ఎలాంటి హెచ్చరికల్లేకుండా మూక హత్యలకు పాల్పడిందని ఆరోపించారు. "మాకు యుద్ధం వద్దు. మాపై దురాక్రమణలను ఆపండి. 1996, 2006 నాటి ఊచకోతలు ఇక వద్దు. ఐరాస తీర్మానం-1701ని కచ్చితంగా అమలయ్యేలా చూడండి" అని భద్రత మండలికి విజ్ఞప్తి చేశారు.

పుణేలో కూలిన ప్రైవేటు హెలికాప్టర్..ముగ్గురి మృతి

పుణే, అక్టోబరు 2: ప్రైవేటు విమానయాన సంస్థకు చెందిన హెలికాప్టర్ కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు, ఒక ఇంజనీరు మరణించారు. మహారాష్ట్రలోని పుణే జిల్లాలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. అదే హెలికాప్టర్‌ను తమ పార్టీ అద్దెకు తీసుకుందని, మంగళవారం ఆ హెలికాప్టర్‌లో తాను బీడ్ జిల్లాలోని పార్లీకి ప్రయాణించానని, బుధవారం కూడా ముంబై నుంచి రాయ్‌గడ్‌కు అదే హెలికాప్టర్‌లో తాను ప్రయాణించాల్సి ఉండగా, అంతలోనే ఈ దుర్ఘటన జరిగిందని ఎన్సీపీ మహారాష్ట్ర అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు సునీల్ తత్కరే పీటీఐకి తెలిపారు. అది ఢిల్లీలోని హెరిటేజ్ ఏవియేషన్ సంస్థకు చెందిన అగస్టా-109 హెలికాప్టర్ అని డీజీసీఏ అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు, భారత వైమానిక దళం(ఐఏఎఫ్)కు చెందిన హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో బుధవారం బిహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ జిల్లాలోని వరద నీటిలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. పొరుగునున్న దర్భంగా ప్రాంతంలో వరద బాధితుల కోసం ఆహారపదార్థాలను జారవిడిచి తిరిగి వస్తుండగా సాంకేతిక సమస్య ఏర్పడిందని జిల్లా కలెక్టర్ సుబ్రత్ కుమార్ సేన్ చెప్పారు.

సాగర జలాలపై ప్రపంచ యాత్ర ప్రారంభం

పనాజీ, అక్టోబరు 2: ప్రపంచాన్ని చుట్టొచ్చేందుకు, సముద్ర జలాలపై అధ్యయనం చేసేందుకు భారత నేవీకి చెందిన ఇద్దరు మహిళా అధికారులు చేపట్టిన సాహస యాత్ర బుధవారం మొదలైంది. లెఫ్టినెంట్ కమాండర్లు దిల్నా కె, రూప కె.. 'నావికా సాగర్ పరిక్రమ' పేరిట చేపట్టిన ఈ యాత్రను గోవాలోని పనాజీలో నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. 'ఇండియన్ నావల్ సెయిలింగ్ వెజెల్ (ఐఎన్ఎస్‌వీ) తారిణి'లో దిల్నా, రూప.. సాగర జలాలపై ప్రపంచాన్ని చుట్టిరానున్నారు. ఎనిమిది నెలలపాటు సాగే ఈ యాత్రలో వారు 21,600 నాటికల్ మైళ్ల (40వేల కి.మీ) ప్రయాణించనున్నారు. ఈ యాత్ర వచ్చే ఏడాది మేలో ముగియనుంది.

వారాణసీ ఆలయాల్లో సాయిబాబా విగ్రహాల తొలగింపు

వారాణసీ, అక్టోబరు 2: వారాణసీ నగరంలోని పలు ఆలయాల్లో ఉన్న సాయిబాబా విగ్రహాలను సనాతన్ రక్షక్ దళ్ కార్యకర్తలు మంగళవారం తొలగించారు. స్థానికంగా ఉన్న ప్రముఖ బడా గణేశ్, పురుషోత్తమ ఆలయాలతో సహా మొత్తం 14గుడుల్లోని సాయిబాబా విగ్రహాలను తొలగించినట్లు తెలుస్తోంది. హిందూ మత గ్రంథాల్లో సాయిబాబా ప్రస్తావన ఎక్కడా లేదని, ఆయన విగ్రహాలు ఆలయాల్లో ఉండకూడదని వారు కొంత కాలంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆలయాల్లో ఉన్న సాయిబాబా విగ్రహాలను తీసేయాలని ఆలయ నిర్వహణాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మహారాష్ట్రలోని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బాబా విగ్రహాల తొలగింపుపై అభ్యంతరం తెలిపారు.

ప్రశాంత్ కిశోర్ సొంత పార్టీ జన్ సురాజ్ ప్రారంభం

పట్నా, అక్టోబరు 2: మాజీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బిహార్‌లో తన సొంత పార్టీ జన్ సురాజ్‌ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. దీంతో సుదీర్ఘకాలంగా సొంత పార్టీని ప్రారంభించాలన్న ఆయన లక్ష్యం నెరవేరింది. రానున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ అన్ని సీట్లకూ పోటీ చేయనున్నట్లు సమాచారం. అధికారంలోకి వస్తే మద్యనిషేధాన్ని పూర్తిగా ఎత్తివేస్తామని ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. ప్రస్తుతం బిహార్‌లో సాగుతోన్న కులం, ఎన్నికల తాయిలాల రాజకీయాన్ని మార్చి రాష్ట్రానికి ఉజ్వల భవిత కల్పించడమే తమ లక్ష్యమని ఆయన చెబుతున్నారు. జన్ సురాజ్ పార్టీ ప్రారంభ కార్యక్రమానికి మాజీ కేంద్రమంత్రి దేవేంద్ర ప్రసాద్ యాదవ్, పవన్ వర్మ, మాజీ ఎంపీ మోనజీర్ హసన్ వంటి వారు హాజరయ్యారు. మాజీ ఐఎఫ్ఎస్ అధికారి మనోజ్ భారతిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు.

ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ రెడీ

నెతన్యాహు సీరియస్ వార్నింగ్.. ఇరాక్ గగనతలంలో ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు!

» ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులను అడ్డుకున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్
» సిరియా, గాజాపై ఐడీఎఫ్ దాడులు
» లెబనాన్ భూతల దాడుల్లో ఇజ్రాయెల్‌కు దెబ్బ.. 8 మంది మృతి
» ఐరాస చీఫ్‌పై ఇజ్రాయెల్ నిషేధం



ఇరాన్ క్షిపణి శకలంపై ఆడుకుంటున్న ఇజ్రాయెల్ పిల్లలు

టెల్‌అవీవ్, అక్టోబరు 2: ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల దాడితో.. పశ్చిమాసియా భగ్గుమంటోంది. ప్రతిదాడికి సిద్ధమంటూ ఇజ్రాయెల్ వర్గాలు చేస్తున్న ప్రకటనలపై అమెరికా, ఐరోపా సహా.. ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పశ్చిమాసియాలోని తమ బేస్‌లలో ఉన్న సిబ్బందిని అమెరికా అప్రమత్తం చేయగా.. మూడు ఫైటర్ స్క్వాడ్రన్లను అదనంగా తరలించింది. ఫ్రాన్స్, బ్రిటన్‌లు కూడా అదే దిశలో చర్యలు తీసుకుంటున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ముదరకుండా చర్యలు తీసుకుంటూనే.. ముందుజాగ్రత్త చర్యలకు సన్నద్ధమవుతున్నాయి. మరోవైపు.. హమాస్ టార్గెట్‌గా గాజాలో, హిజ్బుల్లా టార్గెట్‌గా లెబనాన్‌లో.. ఇతర ఉగ్రవాద సంస్థలే లక్ష్యంగా ఇజ్రాయెల్ క్షిపణి దాడులను ఉధృతం చేసింది. లెబనాన్‌లో భూతల దాడులు ప్రారంభించిన రెండో రోజు.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హిజ్బుల్లాతో ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది సైనికులను కోల్పోయింది. హిజ్బుల్లాకు చెందిన 30 మంది ఫైటర్లు కూడా దుర్మరణం పాలయ్యారు. సిరియాలో రెండు, గాజాలో 51 చొప్పున మరణాలు నమోదయ్యాయి. అటు.. పశ్చిమాసియాపై కమ్ముకుంటున్న యుద్ధమేఘాలపై ఐక్యరాజ్య ఐక్య రాజ్య సమితి(ఐరాస) భద్రతామండలిలో పలుదేశాలు ప్రవేశపెట్టిన తీర్మానాలపై బుధవారం వాడివేడిగా చర్చలు జరిగాయి.

గుణపాఠం చెబుతాం: నెతన్యాహు

తమ దేశంపై క్షిపణుల వర్షం కురిపించిన ఇరాన్‌పై.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం రాత్రి ఇరాన్ జరిపిన క్షిపణుల దాడిని ఓ విఫల ప్రయత్నంగా అభివర్ణించిన ఆయన.. టెహ్రాన్‌కు గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. "ఇజ్రాయెల్‌పై ఎవరు దాడి చేసినా.. మేము వారిని వదిలిపెట్టేదిలేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కాట్జ్ ఏకంగా ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌ను టార్గెట్‌గా చేసుకున్నారు. మంగళవారం రాత్రి నాటి దాడిపై గుటెర్రెస్ ఇరాన్ పేరును నేరుగా ఉచ్చరించకుండా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను ఖండించారు. ఇరాన్ దాడిని గెటెర్రస్ ఖండించకపోవడంతో.. ఆయనను ఇజ్రాయెల్‌లో నిషేధిస్తున్నట్లు కాట్జ్ చెప్పారు. "ఐరాస చీఫ్ మద్దతు లేకున్నా.. ఇజ్రాయెల్ తమ పౌరులను కాపాడుకోగలదు. జాతి గౌరవాన్ని మేం కాపాడుకుంటాం" అని వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే.. ఇరాన్ జరిపిన దాడిని ఖండిస్తూ గుటెర్రస్ కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. మరోవైపు మంగళవారం అర్ధరాత్రి దాటాక ఇరాక్ గగనతలంలో ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు కనిపించాయని అరబిక్ వార్తా సంస్థలు కథనాలను ప్రసారం చేశాయి. దీనిపై ఇరాక్ స్పందిస్తూ.. ఇజ్రాయెల్ తమ గగనతలాన్ని వినియోగించుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. కాగా, ఇరాన్ దాడిలో ఇజ్రాయెల్‌కు కలిగిన నష్టమెంత? ఈ ప్రశ్నలకు అటు ఇరాన్ గానీ, ఇటు ఇజ్రాయెల్ గానీ స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు.


ఖతార్‌కు ఇరాన్ అధ్యక్షుడు

లెబనాన్‌లో భూతల దాడులను ప్రారంభించిన రెండోరోజు ఐడీఎఫ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. లెబనాన్‌లోని పశ్చిమ బాల్బెక్ వద్ద ఉన్న అల్-నయీదా పట్టణంలో ఓ భవనంలో నక్కిన హిజ్బుల్లా ఉగ్రవాదులు బలగాలపైకి మోర్టార్ షెల్స్, రాకెట్లతో దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఐడీఎఫ్ ఎగోజ్ యూనిట్‌కు చెందిన కమాండర్ కెప్టెన్ ఈటాన్ ఇట్జాక్ ఓస్టర్(22) సహా 8 మంది చనిపోయారు. మరో ఐదుగురు గాయపడ్డట్లు ఐడీఎఫ్ అధికారికంగా ప్రకటించింది. బుధవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా హిజ్బుల్లా ఉగ్రవాదులను ఐడీఎఫ్ గుర్తించలేకపోయినట్లు వివరించింది. వెంటనే స్పందించిన ఐడీఎఫ్ జరిపిన ఎదురుకాల్పుల్లో 30 మంది హిజ్బుల్లా ఫైటర్లు హతమైనట్లు తెలిపింది. మరోవైపు, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ బుధవారం ఖతార్ రాజధాని దోహాకు చేరుకున్నారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య మధ్యవర్తిత్వ దేశాల్లో ఖతార్ కూడా ఉంది.

మూడో ప్రపంచయుద్ధం అంచున ఉన్నాం: ట్రంప్

ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి నేపథ్యంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రపంచం మూడో ప్రపంచ యుద్ధం అంచున ఉందని, ఈ పరిస్థితులను నియంత్రించడంలో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ దారుణంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. "మాకు(అమెరికాకు) సరైన నాయకత్వం లేదు. మా దేశాన్ని ఎవరూ పాలించడం లేదు. ఉనికిలో లేని వ్యక్తి మాకు అధ్యక్షుడిగా ఉన్నారు" అంటూ బైడెన్‌పై మండిపడ్డారు. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ కూడా ఎన్నికల కోసం నిధుల సమీకరణలో బిజీగా ఉన్నారని విమర్శించారు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇరాన్‌ను కిమ్మనకుండా చేశానని గుర్తుచేశారు.

లోకం తీరు



అమెరికాకు ఇరాన్ వార్నింగ్

ఇజ్రాయెల్‌పై పోరులో కల్పించుకోవద్దంటూ అమెరికాకు హెచ్చరికలు చేసినట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి. స్విట్జర్లాండ్ ద్వారా ఈ సందేశాన్ని పంపినట్లు వివరించాయి. ఒకవేళ ఇజ్రాయెల్ ప్రతిస్పందనకు దిగితే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశాయి. పశ్చిమాసియాలో అమెరికా, ఐరోపా దేశాల వల్లే అశాంతి నెలకొందని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆరోపించారు. ఆ దేశాలను ఇక్కడి నుంచి పారదోలితేనే పశ్చిమాసియాలో శాంతి సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడిని జీ7 దేశాధినేతలు ముక్త కంఠంతో ఖండించారు. అదే సమయంలో ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి చేస్తే.. దాన్ని మాత్రం తాము సమర్థించబోమని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ అన్నారు. ఇరాన్ తన పరిధులను దాటిందని, ఆ దేశంపై ఆంక్షలు విధిస్తామన్నారు.


భారతీయులు.. జాగ్రత్త

లెబనాన్, ఇరాన్, ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని భారత విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మూడు దేశాల్లోని తమ పౌరుల క్షేమ సమాచారం కోసం అక్కడి భారత రాయబారులతో మాట్లాడి నిరంతరం వివరాలను తెలుసుకుంటున్నట్లు పేర్కొంది.

వచ్చిన క్షిపణిని వచ్చినట్టే..

ఇరాన్ దాడిని సమర్థంగా అడ్డుకున్న ఇజ్రాయెల్

ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులు ఒకవైపు! వాటి రాకను అల్లంత దూరంలోనే పసిగట్టి అప్రమత్తమైన ఇజ్రాయెల్ క్షిపణి రక్షణ వ్యవస్థ యారో పంపిన ఇంటర్‌సెప్టార్లు మరోవైపు!! ఒకదాన్నొకటి ఢీకొనడంతో భారీ శబ్దాలు.. పేలుళ్లు!! ..'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 2' పేరుతో ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల పరంపరను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ అమెరికా సాయంతో సమర్థంగా అడ్డుకుంది! ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిపడ్డ 400కుపైగా మిసైళ్లలో అత్యధిక క్షిపణులను.. వచ్చినదాన్ని వచ్చినట్టే నేలకూల్చామని ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్) వర్గాలు వెల్లడించాయి. అయితే.. కొన్ని మిసైళ్లు మాత్రం తమ ఎయిర్‌బేస్‌లను తాకాయని, వాటివల్ల కొన్ని కార్యాలయాలు, నిర్వహణ (మెయింటెనెన్స్) ప్రదేశాలు దెబ్బతిన్నాయి తప్ప పెద్దస్థాయిలో విధ్వంసం జరగలేదని, పలుప్రాంతాల్లో పెద్ద పెద్ద గుంటలు మాత్రం పడ్డాయని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. తమ వైమానిక దళం ఆపరేషన్స్‌కు ఎలాంటి విఘాతం వాటిల్లలేదని.. తమ యుద్ధవిమానాలకుగానీ, డ్రోన్లు, ఇతర విమానాలు, ఆయుధాలు, కీలక మౌలిక సదుపాయాలకుగానీ ఎలాంటి డ్యామేజీ జరగలేదని తేల్చిచెప్పాయి. ఇరాన్ చెబుతున్నట్టుగా అవి హైపర్‌సానిక్ మిసైళ్లు కావని పేర్కొన్నాయి. కాగా.. ఇరాన్ ప్రయోగించిన ఒక బాలిస్టిక్ క్షిపణి శకలం వచ్చి మీదపడడంతో.. గాజా స్ట్రిప్‌లోని జెరికో వద్ద వర్క్ పర్మిట్‌తో పనిచేస్తున్న సమేహ్ అల్ అసలీ (37) అనే పాలస్తీనా కార్మికుడు మృతి చెందాడు. అతడి మృతదేహం పక్కనే పడి ఉన్న క్షిపణి శకలం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అదే క్షిపణి శకలాల కారణంగా మరో నలుగురు పాలస్తీనియన్లు కూడా గాయపడ్డారు. క్షిపణుల దాడిలో ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. కాగా.. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లలో కొన్నింటిని తమ గగనతలంలో అడ్డుకున్నట్టు జోర్డాన్ ప్రకటించింది. నిజానికి ఇరాన్ ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా ఇదే తరహాలో ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. కానీ, ఇజ్రాయెల్ తన 'యారో' రక్షణ వ్యవస్థతో వాటిని సమర్థంగా కూల్చేసింది. ఆ దాడుల్లో దక్షిణ ఇజ్రాయెల్‌కు చెందిన ఏడేళ్ల బాలిక గాయపడింది.



ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ

భారత్‌పై తీవ్ర ప్రభావం!

(మొదటి పేజీ తరువాయి)

ఎగుమతులు, గల్ఫ్ దేశాల్లో కొన్ని లక్షల మంది భారతీయులు పని చేస్తుండటం.. వీటన్నింటిపైనా ప్రభావం కనిపించే అవకాశం ఉంది.

చమురు: పెట్రోల్, డీజిల్ తదితర చమురు అవసరాలకు మనం పశ్చిమాసియా మీదే అత్యధికంగా (దిగుమతుల్లో దాదాపు 80%) ఆధారపడి ఉన్నాం. అక్కడి నుంచి వచ్చే చమురు సరఫరాలో ఏ కొంచెం ఇబ్బందులు తలెత్తినా మన మీద తక్షణం ప్రభావం పడుతుంది. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ ధరలకు అనుగుణంగానే దేశంలో పెట్రో ధరలను సవరిస్తున్న సంగతి తెలిసిందే. చమురు ధరలు పెరిగితే రవాణాచార్జీలు పెరిగి నిత్యావసరాల ధరలు పెరిగిపోతాయి.

వాణిజ్యం: పశ్చిమాసియాతో భారత్‌కు వాణిజ్యపరంగా సన్నిహిత సంబంధాలున్నాయి. మన దేశం నుంచి అక్కడికి యంత్రాలు, ఔషధాల తదితర పలు రకాల ఉత్పత్తులు ఎగుమతి అవుతుంటాయి. అక్కడి నుంచి మనకు చమురు, సహజ వాయువు, ఎరువులు దిగుమతి అవుతాయి. ప్రస్తుతం ద్వైపాక్షిక వాణిజ్యం 1,95,000కోట్ల డాలర్లుగా (రూ.16,36,949 కోట్లు) ఉంది. దీంతోపాటు గల్ఫ్ దేశాల నుంచి భారత్‌లోకి గణనీయమైన స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయి. భారత్‌లోని మౌలిక సదుపాయాల (ఇన్‌ఫ్రా) కంపెనీలు, టెక్ స్టార్టప్‌లు తదితర రంగాల్లో గల్ఫ్ పెట్టుబడులు ఉన్నాయి. పలు గల్ఫ్ దేశాలతో భారత్.. 'ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్'ల దిశగా ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఒప్పందాలు కుదిరితే వాణిజ్యం, పెట్టుబడులు మరింత పెరుగుతాయి. కానీ, పశ్చిమాసియాలో అస్థిర పరిస్థితులు తలెత్తితే వీటన్నింటిపైనా తీవ్ర ప్రభావం చూపుతాయి.



ఉపాధి: గల్ఫ్ దేశాల్లో దాదాపు 90 లక్షల మంది భారతీయులు పని చేస్తున్నారు. వారి ద్వారా వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం భారత్‌కు లభిస్తోంది. ప్రస్తుత ఉద్రిక్తతలు కొనసాగితే ఇన్ని లక్షల మంది భారతీయుల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకమవుతుంది. వారు ఉద్యోగాలు కోల్పోయి భారత్‌కు తిరిగి వస్తే.. వారికి ఉపాధి ఏమిటన్న కొత్త సవాళ్లు ఎదురవుతాయి.

విదేశాంగ విధానం: ప్రస్తుతం భారత్‌కు అటు ఇరాన్‌తోనూ ఇటు ఇజ్రాయెల్‌తోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. 2010 నుంచి ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు తీవ్రతరం కావటానికి ముందు వరకూ.. ఆ దేశం నుంచి గణనీయమైన స్థాయిలో భారత్‌కు చమురు దిగుమతులు ఉండేవి. ఇక, ఇజ్రాయెల్ నుంచి టెక్నాలజీ, మిలిటరీ సామగ్రి దిగుమతి అవుతున్నాయి. ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పెరిగిపోతే.. తటస్థ వైఖరిని భారత్ కొనసాగించటం కత్తి మీద సాము అవుతుంది. ఇజ్రాయెల్‌కు బలమైన దన్నుగా ఉన్న అమెరికా, పశ్చిమ దేశాలు.. ఈ మేరకు భారత్‌పై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. మరోవైపు, ఇరాన్‌కు అనుకూలంగా రష్యా, చైనా రంగంలోకి దిగితే పరిస్థితి మరింత జటిలంగా మారుతుంది.

హరియాణాలో ఎన్నికల కుస్తీ!

కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోటీ.. ప్రతికూల పవనాల్లో కమలం ఎదురీత

» జేజేపీ, ఐఎన్ఎల్‌డీ ప్రభావంపైనే ఆశలు
» జవాన్, పహిల్వాన్, కిసాన్.. ఆ పార్టీ సవాళ్లు



ఎన్నికల ప్రచారంలో ప్రియాంక, వినేశ్ ఫోగాట్

న్యూఢిల్లీ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): హరియాణాలో బీజేపీకి ప్రతికూల పవనాలు వీస్తున్నాయా!? పదేళ్లుగా అధికారంలో ఉండడం ఆ పార్టీ, ప్రభుత్వంపై వ్యతిరేకతకు కారణమవుతోందా!? రైతులు, కుస్తీ యోధులు, నిరుద్యోగం, ముఠా తగాదాలు ఇందుకు ఆజ్యం పోస్తున్నాయా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి రాజకీయ వర్గాలు! దైనిక్ భాస్కర్ వంటి హిందీ పత్రికలతోపాటు వివిధ సంస్థలు నిర్వహించిన సర్వేల్లో హరియాణాలో బీజేపీ ఎంత బలంగా పోరాడినా 15-20 సీట్లు దక్కకపోవచ్చునని అంచనా వేస్తున్నాయి. బీజేపీ గట్టి పోటీ ఇస్తోందని చెబుతున్న వారే.. ఆ పార్టీ తప్పనిసరిగా గెలిచే స్థానాలు ఏమిటని అడిగితే కచ్చితంగా చెప్పలేకపోవడం కనిపిస్తోంది. నిజానికి, ఈ ప్రజా వ్యతిరేకతను గమనించే కేంద్ర నాయకత్వం ఆరు నెలల కిందట ముఖ్యమంత్రిని మార్చింది. ఎన్నికల సందర్భంగా సగానికిపైగా సిటింగ్ అభ్యర్థులనూ మార్చేసింది. అయినా, సత్ఫలితాలు రావడం లేదని బీజేపీ నేతలే వాపోతున్నారు. ఈ నేపథ్యంలో, ఓట్ల చీలికపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక్కడ ఇండి కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో పొత్తును తిరస్కరించి ఆమ్ ఆద్మీ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తోంది. అలాగే, ఐఎన్ఎల్‌డీ-బీఎస్పీ కూటమి, జననాయక్ జనతా పార్టీ- ఆజాద్ సమాజ్ పార్టీ కూటమి సొంతంగా బరిలోకి సొంతంగా బరిలోకి దిగాయి. ఆయా పార్టీలు, కూటములు కాంగ్రెస్ ఓట్లను చీల్చడంపైనే బీజేపీ ఇప్పుడు ఆశలు పెట్టుకుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ, త్రిశంకు అసెంబ్లీ ఏర్పడితే చిన్న పార్టీలు, స్వతంత్రులు కింగ్ మేకర్ పాత్ర పోషించే అవకాశం ఉందని, కేంద్రంలో అధికారంలో ఉండడంతో ఆ పరిణామం తమకు అనుకూలించే అవకాశం ఉందని బీజేపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. అయితే, కాంగ్రెస్ వాదన ఇందుకు భిన్నంగా ఉంది. హరియాణాలో ముక్కోణపు పోటీ జరిగే అవకాశాలు ప్రతిసారీ తగ్గిపోతున్నాయని, ప్రజలు తమ ఓటును వృథా చేయడం లేదని కాంగ్రెస్ వర్గాలు వివరిస్తున్నాయి. 2014 ఎన్నికల్లో ముక్కోణపు పోటీ 49 స్థానాల్లో జరిగితే.. 2019 ఎన్నికలకు వచ్చేసరికి వాటి సంఖ్య 28 స్థానాలకు తగ్గిపోయిందని, ఈసారి వాటి సంఖ్య పదిలోపే ఉండవచ్చని విశ్లేషిస్తున్నాయి. హరియాణాలో దేవీలాల్ వారసుల పట్టు రోజురోజుకూ తగ్గిపోవడం కూడా పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే పరిమితం కావడానికి కారణమని విశ్లేషిస్తున్నాయి. దేవీలాల్ వారసత్వ పార్టీలైన జననాయక్ జనతా పార్టీ (జేజేపీ), ఐఎన్ఎల్‌డీ రెండింటికీ కలిపి గత లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు 2.61 శాతం మాత్రమే. అదే సమయంలో, గత అసెంబ్లీ ఎన్నికల్లో జేజేపీ పది సీట్లలో విజయం సాధించింది. బీజేపీకి మెజారిటీ రాకపోవడంతో జేజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే, సాగు చట్టాలను చేసిన బీజేపీకి మద్దతు ఇవ్వడంతో జేజేపీపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఇటు జేజేపీ మాత్రమే కాకుండా అటు ఐఎన్ఎల్‌డీ కూడా అన్ని సీట్లలో చిత్తుచిత్తుగా ఓడిపోయాయి. ఈ నేపథ్యంలో, అసెంబ్లీ ఎన్నికల్లో వీటి ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై వివిధ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా.. బీజేపీ ప్రోద్బలంతోనే చిన్న చిన్న పార్టీలన్నీ తమతో తాము సర్దుబాటు చేసుకుని పోటీ చేస్తున్నాయని, కాంగ్రెస్ విజయావకాశాలను అవి దెబ్బ తీయలేవని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక్కడ అధికారంలో ఉన్న బీజేపీ సగానికి సగం సిటింగులను మార్చగా.. ప్రతిపక్ష కాంగ్రెస్ తమ 31 మంది సిటింగ్ అభ్యర్థుల్లో 29 మందికి తిరిగి సీట్లు ఇచ్చింది. గత ఎన్నికల్లో ఓడిపోయిన 17 మందికి మళ్లీ అవకాశాలు కల్పించింది.



వ్యూహాత్మకంగా కాంగ్రెస్

కాంగ్రెస్ కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రైతు ఆందోళనకు కేంద్ర బిందువైన హరియాణాలో రైతన్నలే ఈసారి ఫలితాలను నిర్ణయించనున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎమ్మెస్పీ ధరకు హామీ ఇస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రకటించింది. సైనిక ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న యువత కేంద్ర ప్రభుత్వం అగ్నివీర్ పథకం ద్వారా కేవలం నాలుగేళ్లే ఉపాధి కల్పిస్తామని చెప్పడంతో హతాశులయ్యారు. ప్రపంచ క్రీడల్లో పతకాలు సాధించి పెట్టిన హరియాణా మహిళా మల్లయోధుల పట్ల బీజేపీ వ్యవహరించిన తీరు కూడా ప్రజల్లో నిరసనను పెంచింది. దాదాపు ఏడాదిపాటు మహిళా మల్లయోధులు ఢిల్లీలో నిరసన తెలపడం.. వారికి పురుష పహిల్వాన్లు కూడా మద్దతు పలకడం బీజేపీకి ప్రతికూలంగా మారుతోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక, స్వతంత్రులు, తిరుగుబాటు అభ్యర్థుల మాటకొస్తే వారి సమస్య కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ ఉందని చెబుతున్నాయి. మరోవైపు, కాంగ్రెస్‌లో వర్గపోరు ఆ పార్టీని దెబ్బతీసే అవకాశం ఉందనే విశ్లేషణలు వెలువడ్డాయి. దళిత నేత షెల్జా కుమారి, మాజీ సీఎం భూపేందర్ హుడా మధ్య ఉన్న అంతర్గత తగాదాలు గత వారం వరకు ఆ పార్టీ నేతలకు కలవరం సృష్టించాయి. కానీ, రాహుల్ జోక్యంతో ఈ తగాదాలు సమసిపోయాయి. నాలుగు రోజుల కిందట కర్నాల్‌లో జరిగిన బహిరంగ సభలో రాహుల్‌తోపాటు షెల్జా, హుడా ఇద్దరూ చెట్టపట్టాలు వేసుకుని హాజరు కావడంతో ఆ పార్టీ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. ఇక, ఆప్ ప్రభావం ఈ రాష్ట్రంలో అంతగా ఉండదని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

దేశ శ్రేయోవృద్ధికి స్వచ్ఛ భారత్

» వెయ్యేళ్ల తర్వాతా గుర్తుండి పోతుంది: మోదీ



ఢిల్లీలోని ఓ బడిలో చెత్తను ఊడుస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 2: స్వచ్ఛ భారత్ మిషన్‌తో దేశ శ్రేయోవృద్ధికి సరికొత్త మార్గం ఏర్పడిందని ప్రధాని మోదీ అన్నారు. 21వ శతాబ్దంలో అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ప్రజా ఉద్యమం స్వచ్ఛ భారత్ మిషనేనని పేర్కొన్నారు. దీని ప్రభావం ప్రజారోగ్యంపైనా, వారి జీవన విధానాలపైనా సానుకూల ప్రభావం చూపిస్తోందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వచ్ఛ భారత్ కింద చేపట్టిన రూ.10 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. అదే విధంగా పలు రాష్ట్రాల్లో 'అమృత్ 2.0' మిషన్ కింద ఏర్పాటు చేసిన మురికినీటి శుద్ధి ప్లాంట్లను ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ మిషన్ వెయ్యేళ్ల తర్వాత కూడా గుర్తుండిపోతుందన్నారు. పరిశుభ్రత అనేది వారసత్వంగా మారాల్సిన అవసరం ఉందని మోదీ నొక్కి చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం మహాత్మా గాంధీని ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని విపక్ష కాంగ్రెస్‌పై మోదీ ఈ సందర్భంగా నిప్పులు చెరిగారు. దేశంలో స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించిన తర్వాత ప్రతి ఇంటికీ మరుగు దొడ్డి ఉండాలన్న సంకల్పంతో పనిచేశామని, పదేళ్లలో 12కోట్ల మరుగుదొడ్లు నిర్మించామని మోదీ తెలిపారు. ఈ పరిణామం మహిళల ముఖాల్లో చిరునవ్వులు చిందించేలా చేసిందన్నారు. యూనిసెఫ్ నివేదిక కూడా దీన్ని స్పష్టం చేసిందన్నారు. 2014-19 మధ్య డయేరియా మరణాలు తగ్గుముఖం పట్టి 3లక్షల మంది జీవితాలను స్వచ్ఛ భారత్ నిలబెట్టిందని డబ్ల్యూహెచ్‌వో కూడా పేర్కొన్నట్టు తెలిపారు.

స్వచ్ఛ భారత్‌పై ప్రశంసల వెల్లువ

స్వచ్ఛ భారత్ మిషన్‌కు పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. వీరిలో టాటా ట్రస్టు ఛైర్మన్ రతన్ టాటా, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రాస్ అధనమ్ ఘెబ్రెయాస్, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రెసిడెంట్ మసాట్సుగు అసకవా, ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ తదితరులు స్వచ్ఛ భారత్ మిషన్‌ను కొనియాడారు. ఇదిలావుంటే, బుధవారం జరిగిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో సినీ ప్రముఖులు సైఫ్ అలీ ఖాన్, కరీనా కపూర్, ఆలియా భట్, ఆర్. మాధవన్, మానుషి ఛిల్లార్, టిస్కా చోప్రా, సంగీత దర్శకుడు శంకర్ మహదేవన్ తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.25 లక్షలు

» విరాళమిచ్చిన సీఎంఆర్ టెక్స్‌టైల్ కంపెనీ

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి సీఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యువెల్లర్స్ రూ.25లక్షలు ప్రకటించింది. సంబంధిత చెక్కును సీఎంఆర్ యాజమాన్యం.. సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి అందజేసింది.

వసూళ్లను నిరూపిస్తే మూసీలో దూకుతా

» నిరూపించలేక పోతే కేటీఆర్ దూకుతారా?:మహేశ్ గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరుతో ఒక్క రూపాయి వసూలు చేసినట్లు నిరూపించినా తాను పురానాపూల్ బ్రిడ్జిపై నుంచి మూసీ నదిలోకి దూకుతానని, నిరూపించలేని పక్షంలో కేటీఆర్ దూకుతారా? అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. రాహుల్ గాంధీకి.. హైడ్రా, మూసీలతో ఏంటి సంబంధమని నిలదీశారు. పదేళ్లలో యథేచ్ఛగా కబ్జాలు చేసిన బీఆర్ఎస్ నేతలే హైడ్రాతో బాధ పడుతున్నారన్నారు. ఈ సమయంలో బయటికి రాకుండా కేసీఆర్ ఎక్కడ దాక్కున్నారో కేటీఆర్ ముందు చెప్పాలన్నారు. మూసీ ప్రక్షాళన రూ. వందల కోట్లలోనే పూర్తవుతుందని చెప్పారు. మూసీ ప్రక్షాళనకు, హైడ్రాకు సంబంధం లేదని, మూసీ చుట్టూ ఉన్న ఒక్క ఇల్లును కూడా ఇప్పటి దాకా తొలగించలేదని చెప్పారు. నిర్వాసితులకు చట్టబద్ధంగా పరిహారం ఇస్తామన్నారు.

పీకల్లోతు అప్పుల్లో డిస్కమ్‌లు

» రెండు డిస్కమ్‌లపై రూ.48,548 కోట్ల బాకీ

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయాయి. దీర్ఘకాలిక అప్పులు రూ.30,724.24 కోట్లు ఉండగా, స్వల్పకాలిక రుణాలు రూ.17,823.88 కోట్లు ఉన్నాయి. అందులో దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్)కు రూ.28,619.24 కోట్ల అప్పు ఉండగా, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్)కు రూ.19,928.88 కోట్ల అప్పు ఉంది. గత ఆరేళ్ల కాలంలో 2017-18 నుంచి 2022-23 దాకా అప్పులకు వడ్డీల కింద రూ.3119.72 కోట్లు చెల్లించాయి. వీటిల్లో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) నుంచి తీసుకున్న అప్పులే అధికం. ఈ సమాచారమంతా డిస్కమ్‌లు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి అందించాయి.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కి యాభై ఏళ్లు

» అప్పట్లో పగటి పూట నడిచే తొలి ఎక్స్‌ప్రెస్ రైలు

» మొదట్లో విజయవాడకే... అనంతరం తిరుపతి వరకు..



చిలకలగూడ, అక్టోబరు2 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ పుట్టిన అక్టోబరు 2వ తేదీకి దక్షిణ మధ్య రైల్వేకి విడదీయరాని అనుబంధం ఉంది. ఈ జోన్ పరిధిలో ఎన్నో కార్యక్రమాలు ఇదే రోజున ప్రారంభమయ్యాయి. అంతెందుకు దక్షిణమధ్య రైల్వే ప్రారంభమైందే 1966, అక్టోబరు 2వ తేదీన! అంతేగాక తెలుగువారికి సుపరిచితమైన కృష్ణా ఎక్స్‌ప్రెస్ కూడా యాభై ఏళ్ల క్రితం ఇదే తేదీన మొదలైంది. అక్టోబరు 2, 1974లో సికింద్రాబాద్ నుంచి విజయవాడకి డీజిల్ ఇంజిన్‌తో లాంఛనంగా దీన్ని ఆరంభించారు. ఇరు ప్రాంతాల మధ్య సుప్రసిద్ధమైన కృష్ణా నది ఉండటం వల్లే దానికి 'కృష్ణా ఎక్స్‌ప్రెస్' అనే పేరును పెట్టారు. అప్పట్లో పగటిపూట నడిచే మొట్టమొదటి ఎక్స్‌ప్రెస్ రైలు ఇదే కావడం విశేషం. మొదట్లో సికింద్రాబాద్ నుంచి విజయవాడ వరకు మాత్రమే నడిచేది. తరువాత గుంటూరు వరకు పొడిగించారు. ప్రస్తుతం ఆదిలాబాద్ నుంచి తిరుపతి మధ్య సేవలు కొనసాగుతున్నాయి. దాదాపు ప్రయాణం మొత్తం పగటి పూట కావడంతో ప్రయాణికుల ఆదరణ పొందింది. బుధవారం యాభై ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పలువురు తెలుగువారు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

ధాన్యం టెండర్లలో దగా!

(మొదటిపేజీ తరువాయి)

ధాన్యాన్ని వేలంపాటలో అమ్మడానికి టెండర్లు పిలిచింది. టెండర్లలో పాల్గొన్న 4 కాంట్రాక్టు ఏజెన్సీలు క్వింటాలుకు రూ.1,700 చొప్పున బిడ్డింగ్ కోట్ చేయటంతో.. పౌరసరఫరాల సంస్థకు భారీ నష్టం వస్తుందని భావించి టెండర్లు రద్దు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ప్రభుత్వం టెండర్ల ఫైలును మళ్లీ కదిలించింది. సగటున క్వింటాలుకు రూ.2 వేలు టెండరు రేటు వచ్చింది. ఈ ప్రభుత్వంలో కూడా ఆ నాలుగు ఏజెన్సీలే టెండర్లను దక్కించుకున్నాయి. 38 లక్షల టన్నుల ధాన్యాన్ని 12 లాట్లుగా విభజించి టెండర్లు పిలవగా.. హిందూస్థాన్ ఎంటర్ ప్రైజెస్‌కు ఒకటి, కేంద్రీయ భండార్‌కు నాలుగు, మంచుకొండ ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఒకటి, న్యాకాఫ్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ ప్రొక్యూర్మెంట్ ప్రాసెసింగ్-రిటైలింగ్ కో ఆపరేటివ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)కు ఆరు లాట్లు దక్కాయి. పే అండ్ లిఫ్టింగ్ విధానంలో మూడు నెలల్లో రైస్‌మిల్లుల నుంచి ధాన్యం నిల్వలు ఖాళీ చేయాలనే నిబంధన ఉండగా.. ఇప్పటికీ తొమ్మిది నెలలు గడిచినా ఖాళీ చేయలేదు. వాస్తవానికి వేలం పాటలో ధాన్యం కొనుగోలు చేసిన ఏజెన్సీలు.. ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకోవాలి. లేకపోతే మిల్లింగ్ చేయించుకొని బియ్యం అమ్ముకోవాలి. కానీ కేవలం పైసల వసూళ్లపైనే కాంట్రాక్టర్లు దృష్టి పెట్టారు. అయితే టెండర్ల ప్రక్రియ పూర్తికాకముందే.. కొందరు రైస్‌మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఎలాంటి బ్యాంకు గ్యారెంటీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం ఇవ్వటం, టెండర్ల పనిలో పడి మిల్లింగ్‌కు ఆదేశాలు ఇవ్వకపోవటంతో.. రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ చేయకుండా ధాన్యాన్ని తెగనమ్ముకున్నారు. టెండర్ల సమయంలో ఫిజికల్ వెరిఫికేషన్ చేయిస్తే.. చాలా రైస్‌మిల్లుల్లో ధాన్యం కనిపించలేదు. ఇదే అదనుగా భావించిన టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు ధాన్యానికి బదులుగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే అప్పటి ఎమ్మెస్పీ రేటు ప్రకారమైనా, టెండర్ రేటు ప్రకారమైనా.. (సగటున క్వింటాలుకు రూ.2 వేలు) డబ్బులు చెల్లించేందుకు మిల్లర్లు ముందుకొచ్చారు. కానీ క్వింటాలుకు అదనంగా రూ.223 చొప్పున చెల్లించాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేయటంతో పంచాయితీ మొదలైంది. అధికారబలంతో మిల్లర్లపై ఒత్తిడి చేసి, కేసుల్లో ఇరికించటంతో.. 9.50 లక్షల టన్నుల ధాన్యానికి మిల్లర్లు డబ్బులు చెల్లించారు. కాంట్రాక్టర్లు ఒక్క వడ్ల గింజ కూడా ఎత్తకుండా రూ.2,112 కోట్లు వసూలు చేశారు. ఇందులో రూ.1,900 కోట్లు పౌరసరఫరాల సంస్థకు చెల్లించారు. మిగిలిన రూ.212 కోట్లు కాంట్రాక్టర్లు లబ్ధి పొందారు. వాస్తవానికి 38 లక్షల టన్నుల ధాన్యం విక్రయాల ద్వారా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు రూ.7,600 కోట్ల ఆదాయం రావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.1,900 కోట్లు మాత్రమే రికవరీ అయ్యింది. ఇంకా రూ.5,700 కోట్లు రికవరీ కావాల్సిఉంది.

మిల్లర్ల రివర్స్ గేర్.. కాంట్రాక్టర్ల కలెక్షన్ రూల్

2022-23 యాసంగి ధాన్యం టెండర్లు కొలిక్కిరావటానికి ఏడాదికి పైగా సమయం దొరకటంతో రైస్‌మిల్లర్లు రివర్స్ గేర్ వేశారు. 2023-24 ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోలు చేశారు. గతంలో అమ్ముకొని సొమ్ము చేసుకున్న ధాన్యాన్ని కొందరు మిల్లర్లు ఏవో తంటాలు పడి భర్తీ చేశారు. మరికొందరు రైస్ మిల్లర్లు 2022- 23లో ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని అమ్మకుండా అలాగే పెట్టారు. ధాన్యం తీసుకుంటే అప్పగిస్తాం.. పైసలు మాత్రం ఇచ్చేదిలేదు అని మొండికేశారు. అయితే రైస్ మిల్లర్లు క్వింటాలుకు రూ.2,223 చొప్పున డబ్బులు చెల్లించటానికి మొండికేస్తుండటంతో.. కాంట్రాక్టర్లు తాజాగా క్వింటాలుకు రూ.23 చొప్పున రేటు తగ్గించారు. క్వింటాలుకు రూ.2,200 చొప్పున డబ్బులు చెల్లించాలని మిల్లర్లపై ఒత్తిడి చేస్తున్నారు. ఇంకా 28.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన లావాదేవీలు నిలిచిపోయాయి. హిందుస్థాన్ ఎంటర్ ప్రైజెస్ ఒక్క శాతం కూడా ధాన్యం లిఫ్ట్ చేయలేదు. కేంద్రీయ భండార్ 27శాతం, మంచుకొండ ఆగ్రోటెక్ 36శాతం, న్యాకాఫ్ 21శాతం కలిపి.. సగటున 24శాతం ధాన్యం టార్గెట్ ఇప్పటివరకు పూర్తయ్యింది. ఇంకా 76శాతం ధాన్యం లిఫ్టింగ్ పూర్తికావాల్సి ఉంది.

రాష్ట్రం, దేశం సుఖసంతోషాలతో ఉండాలి

» పాడిపంటలతో వర్ధిల్లాలి: సీఎం రేవంత్

కుషాయిగూడ, హైదరాబాద్ సిటీ, దుండిగల్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): దేశం, తెలంగాణ రాష్ట్రం సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. దుండిగల్‌లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన ప్రార్థనా మందిరాన్ని రేవంత్ బుధవారం ప్రారంభించారు. ఏ కష్టం, నష్టం వచ్చినా దత్తపీఠం ప్రార్థనాలయంలో కూర్చుంటే తప్పక ప్రశాంతత చేకూరుతుందని విశ్వసిస్తున్నానని ఈ సందర్భంగా రేవంత్ పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను మైసూర్‌లో కాకుండా స్వామిజీ తెలంగాణలో నిర్వహించడం రాష్ట్రానికి శుభ సూచికమని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ పేర్కొన్నారు. ఈ ప్రార్థనాలయాన్ని తెలంగాణ భక్తులే నిర్మించారని గణపతి సచ్చిదానంద స్వామిజీ అన్నారు. రేవంత్‌రెడ్డి ధీరుడని, బుద్ధిమంతుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మరోవైపు హైదరాబాద్ మహానగరంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణంపై వాటర్‌బోర్డు చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌ను సీఎం రేవంత్ ప్రారంభించారు. లంగర్ హౌజ్‌లోని బాపూఘాట్ వద్ద మహాత్మాగాంధీకి నివాళులర్పించిన అనంతరం స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. ఇక సరోజినిదేవి ఆసుపత్రి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం కార్యక్రమాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ప్రతి వర్షపు చుక్కను భూగర్భ జలంగా మార్చాలని, అందుకు ప్రజలు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రేటర్ పరిధిలోని వాటర్‌బోర్డుకు చెందిన మొత్తం ఆపరేషన్ మెయింటనెన్స్ డివిజన్లలో సీజీఎం, జీఎంలు ఈ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు. కాగా, గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తల్లి కమలమ్మ మృతి పట్ల రేవంత్‌రెడ్డి సానుభూతి తెలిపారు. బుధవారం రాత్రి చర్లపల్లి డిడిజన్ రెడ్డి కాలనీలోని వారి నివాసానికి వెళ్లి రామ్మోహన్ దంపతులను ఆయన పరామర్శించారు.



సీఎం రేవంత్‌ను సత్కరిస్తున్న గణపతి సచ్చిదానంద



బాపూ ఘాట్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

ఇక ఆర్టీసీలో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే

దీనికి తోషిబా కంపెనీ సేవలు అవసరం.. ఫ్యుయెల్ సెల్ టెక్నాలజీ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రావాలి

» సింగరేణితో కలిసి పని చేయొచ్చు

» జపాన్ పర్యటనలో భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీ ఆర్టీసీ)లో ఇక మీదట మొత్తం ఎలక్ట్రిక్ బస్సులను వినియోగించాలని యోచిస్తున్నామని, ఇందుకు జపాన్‌లోని తోషిబా కంపెనీ సేవలు అవసరమవుతాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జపాన్ దేశంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా టోక్యో నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రముఖ బహుళ జాతి ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఉత్పత్తుల కంపెనీ తోషిబా ప్రధాన కార్యాలయాన్ని డిప్యూటీ సీఎం బుధవారం సందర్శించారు. తోషిబా ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ ఉన్నతాధికారి హిరోషి కనేట, వైస్ ప్రెసిడెంట్ షిగే రిజో కవహర తదితరులు డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికారు. ఆ తర్వాత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తోషిబా ఉత్పత్తులు, సేవలను వివరించారు. సౌర విద్యుత్తులో వినియోగించే ఫొటో వోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ, ఫ్యుయెల్ సెల్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ, శక్తిమంతమైన జనరేటర్లు, జీరో కార్బన్ ఎమిషన్ టెక్నాలజీలను వృద్ధి చేశామని తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో పెద్ద ఎత్తున సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నామని, దీనికి ఫొటో వోల్టాయిక్ మాడ్యూల్స్ పెద్ద సంఖ్యలో కావాల్సి ఉందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఫ్యుయెల్ సెల్ టెక్నాలజీ వినియోగం ఎక్కువగా ఉంటుందని, తెలంగాణలో సంబంధిత యూనిట్‌లను ఉమ్మడి భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని కోరారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా బొగ్గుతో పాటు లిథియం వంటి ఇతర ఖనిజ తవ్వక కార్యకలాపాల్లోకి ప్రవేశించనున్నదని, లిథియం బ్యాటరీల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తోషిబా సింగరేణితో కలిసి ముందుకు పోవచ్చని సూచించారు. ఆ తర్వాత తోషిబా ఫ్యుయెల్ సెల్ తయారీ యూనిట్‌ను సందర్శించారు. అలాగే.. టోక్యో నగరం నుంచి ఒసాకా పట్టణానికి బుల్లెట్ ట్రెయిన్‌లో భట్టి విక్రమార్క వెళ్లారు. 700 కిలోమీటర్ల పొడవైన ఈ రైలుమార్గాన్ని కేవలం 2 గంటల 20 నిమిషాల్లో బుల్లెట్ ట్రెయిన్ ద్వారా చేరుకున్నారు. ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా సాగిందని, ట్రెయిన్‌లో సౌకర్యాలు ఎంతో బాగున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తోషిబా కంపెనీ ప్రతినిధులు స్పందిస్తూ భారతదేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లో మాత్రమే తమ యూనిట్లను ప్రారంభించామని, దీనిలో తెలంగాణ ప్రముఖమైందన్నారు. తెలంగాణ పరిశ్రమల స్థాపనకు, వ్యాపార విస్తరణకు ఎంతో అనుకూలంగా ఉన్నందున.. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో తమ పరిశ్రమలను విస్తరించేందుకు సానుకూలంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుత ఈవీ వెహికల్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా పెంచుతామని, ప్లాంట్ విస్తరణకు ప్రయత్నిస్తామని తెలిపారు.



జపాన్‌లోని తోషిబా కంపెనీని సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి

కొత్తగా 30 ఆర్డినరీ ఎలక్ట్రిక్ బస్సులు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు ఆర్టీసీ కొత్తగా హైదరాబాద్‌లో 30 గ్రీన్ సిటీ ఆర్డినరీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనుంది. ఇవి ఇప్పటికే హెచ్‌సీయూ డిపోకు చేరుకున్నాయి. అక్కడ ఈవీ చార్జింగ్ స్టేషన్లను కూడా సిద్ధం చేసిన ఆర్టీసీ వారం రోజుల్లో ఈ బస్సులను రోడ్లపైకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వీటితో గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 132కు చేరింది. ఈ ఏడాది చివరికల్లా గ్రేటర్ జోన్ పరిధిలో 500 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని తమ లక్ష్యమని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. వీటి కోసం ప్రతి డిపోలో చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రీన్ సిటీ ఆర్డినరీ బస్సులు ఆకర్షణీయంగా ఉన్నాయి. సిటీ ఆర్డినరీ బస్సుల తరహాలో ముందు, మధ్య భాగాల్లో డోర్లు ఉండటంతో ప్రయాణికులు ఎక్కేందుకు, దిగేందుకు సులభంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇవి ఒకసారి చార్జింగ్ చేస్తే 200 నుంచి 220 కిలోమీటర్లు నడుస్తాయి.



ఆరెక్స్ బెనిఫిట్స్ సీఈవో వెండీ బార్నెస్‌ను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌లో ఆర్‌ఎక్స్ బెనిఫిట్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

» వచ్చే రెండేళ్లలో 300 నిపుణులకు ఉద్యోగాలు: మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీలకు వ్యాపార సహకారం అందించే ఆర్‌ఎక్స్ బెనిఫిట్స్ సంస్థ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమెరికా కేంద్రంగా ఉన్న ఆ సంస్థ సీఈవో వెండీ బార్నెస్.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో కేంద్రం ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించారు. కంపెనీ పెట్టుబడులను శ్రీధర్ బాబు స్వాగతించారు. ఇక్కడ కేంద్రం ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో 300 మంది నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సంస్థ తనకు క్లయింట్లుగా ఉన్న ఫార్మసీలకు లాభాలు పెంచుకోవడంలో తోడ్పడుతుందని, హైదరాబాద్ నైపుణ్య కేంద్రం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రొడక్ట్ ఇంజనీరింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత అపారంగా ఉన్నందున బహుళ జాతి సంస్థలకు తెలంగాణ చుక్కానిగా మారిందని తెలిపారు. వ్యాపార విస్తరణకు అనుకూల వాతావరణం ఉండటం, మౌలిక సదుపాయాల పరంగా ఎటువంటి సమస్యలు లేనందున ఆర్‌ఎక్స్ బెనిఫిట్స్ హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుందని వివరించారు. ఆధునిక సాంకేతిక, జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వివిధ రంగాల్లో డిజిటల్ పరివర్తన అనివార్యంగా మారిందని చెప్పారు.

పేదల ఇళ్లపైకి వస్తే తీవ్ర పరిణామాలే!

» సుందరీకరణ పేరుతో ఇళ్లను కూలుస్తామంటే ఊరుకోం

» రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

» గోల్నాక డివిజన్‌లో మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటన

గోల్నాక, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేద ప్రజల పక్షాన నిలబడతామని, వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్‌లోని మూసీ పరివాక ప్రాంతాల్లో కిషన్‌రెడ్డి పర్యటించి, బాధితులను పరామర్శించారు. ఇళ్లను కూల్చేసి, తమను రోడ్డున పడేస్తామంటున్నారంటూ బాధితులు కేంద్ర మంత్రితో చెప్పుకొన్నారు. ఇదేం న్యాయమని వాపోయారు. వారి బాధలు విన్న కిషన్‌రెడ్డి.. 'మీరెవరూ అధైర్యపడొద్దు. మీ ఇళ్లు కూల్చివేయకుండా నేను మీకు అండగా ఉంటా' అని భరోసా ఇచ్చారు. మూసీ సుందరీకరణను ఎవరు కోరుకున్నారని ఆయన సీఎంను ప్రశ్నించారు. సుందరీకరణ చేయాలంటే పేదల ఇళ్లను కూల్చనక్కర్లేదన్నారు. రూ.1.50 లక్షల కోట్లు వెచ్చించి సుందరీకరణ చేయాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ఉన్న మూసీకి ప్రహరీ గోడలను నిర్మించి సుందరీకరణ చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దిక్కుమాలిన చర్యను విరమించుకోవాలన్నారు. మూసీ పరివాక ప్రాంతాల్లో మూడు తరాల వారు నివాసం ఉంటున్నారని, ఇప్పుడు వారి ఇళ్లను కూల్చాలనుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పేదల ఇళ్లను కూల్చే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రూ.50 వేల కోట్లు వెచ్చించి గూడు లేని పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదవాడి ఇంటిపైకి బుల్డోజర్ వస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. పేదల సమాధులపై మొక్కలు పెట్టి సుందరీకరణ చేయాలనుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని కిషన్‌రెడ్డి చెప్పారు. కాగా, వేరొక కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో భాగంగా స్వచ్ఛభారత్ దివస్ సందర్భంగా వేదుల స్ఫూర్తి దియా తీసిన 'టుమారో విల్‌నాట్ కేర్ ఇట్ సెల్ఫ్' అనే షార్ట్ ఫిల్మ్‌ను బుధవారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. పర్యావరణం పట్ల అలసత్వం వహిస్తే భవిష్యత్తులో తలెత్తే పరిణామాలపై స్ఫూర్తి దియా షార్ట్ ఫిల్మ్ చిత్రీకరించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.



గోల్నాక తులసీరాంనగర్ తదితర మూసీ పరివాక ప్రాంతాల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తమ బాధలు చెప్పుకొంటున్న బాధితులు

16 మందికి ఒక డబుల్ ఇల్లా?

మూసీ నిర్వాసితుల్లోని ఓ ఉమ్మడి కుటుంబం వ్యథ

ఓల్డ్‌మలక్‌పేట అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం ఇళ్లు కేటాయిస్తున్నా.. ఇన్నాళ్లూ ఉన్న ఇంటిని కోల్పోయిన ఉమ్మడి కుటుంబాల వారి పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. ఇన్నాళ్లూ ఒక్కటిగా ఉన్నవారంతా కలిసి ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇంటిలో ఉండలేక, వేరు కాపురం పెట్టలేక అవస్థలు పడుతున్నారు. ఓల్డ్‌మలక్‌పేట్ శంకర్‌నగర్‌లో ఇంటిని కోల్పోయిన ముజాహిద్ కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితి ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ముజాహిద్ దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె షాహిన్ బేగం ఉన్నారు. వీరందరికీ పెళ్లి అయి సంతానం కూడా ఉన్నారు. వీరంతా కలిసి మొత్తం 16 మంది శంకర్‌నగర్‌లోని తమ ఇంట్లో నివాసముండేవారు. షాహిన్ బేగం పేరు మీద ఉన్న ఆ ఇంట్లో ఎనిమిది గదులు ఉండడంతో నాలుగు కుటుంబాలు ఇన్నాళ్లూ కలిసిమెలిసి ఉన్నాయి. అయితే, మూసీ పరీవాహక ప్రాంతంలో ఆక్రమణల తొలగింపులో భాగంగా ముజాహిత్ కుటుంబం ఇంటిని కోల్పోయింది. ఇందుకు బదులుగా ఉప్పల్ ప్రతాప్ సింగారం దగ్గర ప్రభుత్వం వారికి ఓ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇచ్చింది. ఇంట్లో నాలుగు కుటుంబాలు ఉన్నప్పటికీ.. సదరు ఇల్లు షాహిన్ బేగం పేరిట ఉండడంతో ఆమె పేరిటే ప్రభుత్వం ఇల్లు కేటాయించింది. ఆ రెండు పడకల ఇల్లు ముజాహిద్ కుటుంబానికి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో ఇన్నాళ్లూ కలిసి ఉన్న ఆ ఉమ్మడి కుటుంబం విడిపోవాల్సిన పరిస్థితి. శంకర్‌నగర్ ప్రాంతంలోని మరికొందరు నిర్వాసితులది కూడా ఇదే దుస్థితి.

డబుల్ బెడ్‌రూమ్ చాలడం లేదు



ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మా కుటుంబానికి సరిపోవడం లేదు. ఒకే ఇంట్లో 16 మంది ఉండేవాళ్లం. ప్రభుత్వం ఇచ్చిన ఇలు మాకు చాలడం లేదు. దీంతో మేము విడిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇల్లు రిజిస్ట్రేషన్ ఒకరి పేరు మీద ఉండడంతో ఒకే ఇల్లు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు.

- ముజాహిద్, శంకర్‌నగర్ నిర్వాసితుడు

డబ్బు సంచుల కోసమే మూసీ ప్రాజెక్టు

హైడ్రాను నడిపిస్తోంది రేవంత్ కాదు.. రాహుల్.. కూల్చివేతలకు కేంద్రం మద్దతు ఉందనిపిస్తోంది

» మంత్రివర్గ విస్తరణ చేసుకోలేని దద్దమ్మ రేవంత్

» మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ ఆరోపణలు

» కూల్చివేతల బాధితులకు అండగా ఉంటాం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణ ప్రాజెక్టును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డబ్బుసంచుల కోసం తెరపైకి తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆయనే వెనక ఉండి పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలను నడిపిస్తున్నది కూడా సీఎం రేవంత్‌రెడ్డి కాదని, రాహుల్ గాంధీయేనని తెలిపారు. ఈ కూల్చివేతలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఉందన్న అనుమానం కలుగుతోందన్నారు. హైడ్రాపై ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించడం కేంద్రానికి తెలియకుండానే జరుగుతుందా? అని ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. "కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు కావాలి.. బాధితుల కష్టాలు పట్టవు. వారు చేసేది మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్" అని విమర్శించారు. మూసీ ప్రాజెక్టును ఏ కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారో త్వరలో బయటపెడతానన్నారు. 2400 కిలోమీటర్ల నమామిగంగ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు ఖర్చయితే.. 55 కిలోమీటర్లున్న మూసీ ప్రక్షాళనకు రూ.1.50 లక్షల కోట్లు ఎందుకవుతుందని ప్రశ్నించారు. పేదలకు కష్టం వస్తే వాలిపోతానని ఎన్నికల సమయంలో చెప్పిన రాహుల్‌గాంధీ.. ఇప్పుడు పేదల ఇళ్లను బుల్డోజర్లతో తొక్కిస్తుంటే ఎక్కడ చచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మంత్రులు అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, కోమటిరెడ్డి వెంకటరెడ్డికి దమ్ముంటే మూసీ పరివాహక ప్రాంతాల్లో ఎటువంటి సెక్యూరిటీ లేకుండా పర్యటించి ప్రజలను ఒప్పించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. "మంత్రివర్గ విస్తరణ చేసుకోలేని దద్దమ్మ రేవంత్‌రెడ్డి.. రాష్ట్రాన్ని బాగుచేస్తానని బయలుదేరాడు" అని కేటీఆర్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు మధ్య సమన్వయం లేదన్నారు.



తెలంగాణ భవన్‌లో మూసీ, హైడ్రా బాధితులతో మాట్లాడుతున్న కేటీఆర్

మూసీ, హైడ్రా బాధితులకు అండగా ఉంటాం

కాంగ్రెస్ ప్రభుత్వ మూర్ఖపు చర్యలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్ అన్నారు. మూసీ, హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హైడ్రా, మూసీ బాధితులతో ఆయన మాట్లాడారు. వారికి న్యాయపరంగా సాయం చేసేందుకు తమ వద్ద న్యాయవాదుల బృందం ఉందన్నారు. అన్ని అనుమతులున్నా.. ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. కాగా, రాష్ట్ర క్యాబినెట్‌లో రెండోస్థానంలో ఉన్న ఓ మంత్రి.. బుధవారం నగరంలోని ఓ హోటల్లో పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీతో సమావేశమయ్యారని కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ సమావేశంలో సునీల్ కనుగోలు కూడా పాల్గొన్నారని తెలిపారు. అదానీతో కాంగ్రెస్ దోస్తీ చేస్తుందా? లేక రాయదుర్గంలోని విలువైన 84 ఎకరాల ప్రభుత్వ భూమిని అదానీకి కట్టబెట్టే కుట్ర చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

స్వచ్ఛందంగా ఖాళీ చేస్తే డబుల్ బెడ్‌రూమ్‌తోపాటు పాతిక వేలు

» మూసీ పరీవాహక ప్రాంత వాసులకు ప్రభుత్వం ఆఫర్

» హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్ల ప్రకటన

» లంక బస్తీలో విషాదం.. గుండెపోటుతో బస్తీవాసి మృతి

హైదరాబాద్ సిటీ, రాజేంద్రనగర్, గోల్నాక, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇండ్లు నిర్మించుకుని ఉంటూ స్వచ్ఛందంగా ఇళ్లను ఖాళీ చేసేవారికి ప్రభుత్వం ఆఫర్ ఇచ్చింది. డబుల్ బెడ్ రూమ్ ఇంటితోపాటు రూ.25 వేలు పారితోషికంగా ప్రభుత్వం ఇస్తుందని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు తెలిపారు. ప్రస్తుతం ఉండే ఇంటిని ఖాళీ చేసి వెళ్లేందుకు, అవసరాల నిమిత్తం పాతిక వేలు ఇస్తామని ప్రకటించారు. రాజేంద్రనగర్, గండిపేట్ మండలాలలో విస్తరించి ఉన్న మూసీ రివర్‌బెడ్ ప్రాంతంలో ఇండ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న వారు రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం, రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయాల వద్ద గ్రీవెన్స్ సెల్‌లను సంప్రదించాలని అధికారులు సూచించారు. అంబర్‌పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్ మూసీ పరివాక ప్రాంతం న్యూ తులసీరాంనగర్(లంక బస్తీ)కి చెందిన గానద శ్రీకుమార్(51) గుండెపోటుతో మృతి చెందారు. ఇండ్లను కూల్చివేస్తారనే ప్రచారం జోరుగా జరగడంతో నాలుగైదు రోజులుగా బెంగగా ఉన్న ఆయన బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఛాతీలో నొప్పి ఉందని కుటుంబసభ్యులతో చెప్పారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుతో మృతి చెందారు. శ్రీకుమార్‌కు ముగ్గురు కుమారులున్నారు. ఘటనతో లంక బస్తీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రముఖ కవి సుమనశ్రీ కన్నుమూత

» మరణ వార్త ఆలస్యంగా వెలుగులోకి
సాహిత్య లోకానికి భావకవిగా పరిచయం

» మెకానికల్ ఇంజనీరింగ్‌లోనూ విశిష్ట సేవలు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, విమర్శకుడు, కథకుడు, తెలుగు సాహిత్యలోకానికి సుమనశ్రీగా సుపరిచితుడైన చెళ్లపిళ్ల కామేశ్వరరావు (77) కన్నుమూశారు. ఏపీలోని విశాఖలో స్థిరపడిన ఆయన తీవ్ర జ్వరంతో బాధపడుతూ సెప్టెంబరు 12న తుదిశ్వాస విడిచారు. సాహిత్య లోకంతో సుమనశ్రీ కుటుంబానికి పెద్దగా పరిచయం లేకపోవడంతో ఆయన మరణవార్త ఆలస్యంగా బుధవారం తెలిసింది. సుమనశ్రీ స్వస్థలం నరసరావుపేట. అక్కడే డిగ్రీ వరకు, తర్వాత అనంతపురంలో మెకానికల్ ఇంజనీరింగ్ (బీఈ) చదివారు. అదే సబ్జెక్టులో ఆంధ్రా యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ చేశారు. తాను చదివిన విశ్వవిద్యాలయంలో ఏడేళ్లు అధ్యాపకుడిగా పనిచేశారు. హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా 2003లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకున్నారు. ఆనాటి నుంచి పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రొఫెసర్‌గా 2018 వరకు సేవలందించారు. కెనడాలోని అట్టావా వర్సిటీలోనూ విజిటింగ్ ప్రొఫెసర్‌గా మూడేళ్లు పనిచేశారు. సాహిత్య జీవితానికొస్తే, సుమనశ్రీ తండ్రి పద్యకవి బంగారేశ్వరశర్మ ప్రోత్సాహంతో 1965 నుంచి కలం పట్టారు. 'గీతం పునీతమౌతుంది', 'రెప్పల మధ్య ఆకాశం', 'రక్తనేత్రోదయం', 'మహాస్వప్నం', 'నేత్రం నా సంకేతం' తదితర కవితా సంపుటాలు, మరికొన్ని కథలు పుస్తకాలుగా వెలువడ్డాయి. అజంతా కవిత్వంపై విశ్లేషణాత్మక వ్యాసాలు 'అజంతా లిపి', ఆధునిక కవిత్వంపై వ్యాసాలు 'కవిత్వం ఒక ఆత్మఘోష' ప్రచురితమయ్యాయి. సుమనశ్రీకి భార్య రమణశ్రీ, ఇద్దరు కుమారులు హేమచంద్రకుమార్, సురేశ్‌బాబు ఉన్నారు. కుమారులు అమెరికాలో స్థిరపడ్డారు. విశాఖలోని అక్కయ్యపాలెం శ్మశానవాటికలో సెప్టెంబరు 15న సుమనశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. పలువురు కవులు, రచయితలు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

కాంగ్రెస్‌ది అరాచక పాలన: ఏలేటి

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. దుర్మార్గపు పాలన చేస్తున్న కాంగ్రెస్ మెడలు వంచేలా బీజేపీ కార్యక్రమాలు చేపడుతుందని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో రైతులు గోస పడుతున్నారని ఆవేదన చెందారు. వడ్లకు బోనస్ ఇస్తానని ఇవ్వలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కుర్చీ కోసం కాంగ్రెస్‌లో కుమ్ములాటలు జరుగుతున్నాయన్నారు.

జర్మనీకి వెళ్లాల్సిన లుఫ్తాన్సా విమానం రద్దు

» ఇజ్రాయెల్, ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో నిర్ణయం

శంషాబాద్, అక్టోబరు 2: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జర్మనీకి వెళ్లాల్సిన లుఫ్తాన్సా విమానం రద్దయ్యింది. మంగళవారం అర్ధరాత్రి జర్మనీ నుంచి రావాల్సిన విమానం శంషాబాద్‌కు రాకపోవడంతో ఈ విమాన సర్వీసు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్‌లో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఆ దేశ గగనతలం నుంచి వెళ్లే ఈ విమానాన్ని రద్దు చేసినట్లు లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ పేర్కొంది. జర్మనీకి వెళ్లడానికి హైదరాబాద్ నుంచి 130 మంది టికెట్ బుక్ చేసుకున్నారు. విమానం రద్దు అయ్యిందని తెలుసుకున్న కొందరు ఎయిర్‌పోర్టుకు రాలేదు. వచ్చిన వారిలో కొందరిని ఇతర విమాన సర్వీసుల ద్వారా జర్మనీకి తరలించామని, మిగిలిన వారికి హోటల్‌లో బస ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

మంత్రాల నెపంతో మహిళపై దాడి

రామాయంపేట, అక్టోబరు 2 : మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి ప్రగతి ధర్మారంలో మంత్రాలు చేస్తుందన్న నెపంతో ఓ మహిళ ఇంటిపై కొందరు దాడికి పాల్పడ్డారు. సుమారు 30 మంది కర్రలు, చెప్పులతో ఆమె ఇంటి మీదికి వెళ్లి కొట్టడమే కాక.. కట్టేసి తీవ్రంగా గాయపరిచారు. గ్రామానికి చెందిన గుర్రం విజయ(52) బుధవారం అమావాస్య కావడంతో అదే వీధిలోని ఓ ఇంటి వద్ద గుడ్లు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ వేసిందన్న అనుమానంతో ఈ దాడి జరిగింది. ఒక్కసారిగా ఆమె ఇంటి వద్దకు చేరుకుని కొట్టడంతో విజయతో పాటు ఆ ఇంట్లోని మరో ఇద్దరు గాయపడ్డారు. పది మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

కేటీఆర్ వల్లే..



(మొదటి పేజీ తరువాయి)

డ్రగ్స్ కేసులో ఇరికించిన కేటీఆర్.. తాను మాత్రం తప్పుకొన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ కేసులను తమ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. అయితే, మంత్రి వ్యాఖ్యలను నాగార్జున, అమల, నాగచైతన్య, సమంత ఖండించారు. అమల తీవ్రమైన పరుష పదజాలంతో సురేఖపై ట్విటర్‌లో విరుచుకుపడ్డారు. మరోవైపు.. మంత్రి కొండా సురేఖకు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. తనపై చేసిన నిరాధార ఆరోపణలను తక్షణం వెనక్కి తీసుకోవాలని.. 24 గంటల్లోగా తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే చట్టప్రకారం ముందుకు వెళ్తానని.. పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. రాజకీయాల కోసమే ఆమె కక్షతో తన పేరును వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు.

అబద్ధం.. అసంబద్ధం..

నాగచైతన్య, సమంత విడాకులుకు కేటీఆరే కారణమంటూ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని నటుడు అక్కినేని నాగార్జున మంత్రి కొండా సురేఖను 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. "రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలను.. మీ ప్రత్యర్థులను విమర్శించడానికి వాడుకోవద్దు. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించండి. బాధ్యత గలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం" అని ఆవేదన వెలిబుచ్చారు. సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించాలని హితవు పలికారు. ఆయన భార్య అమల అక్కినేని.. కొండా సురేఖపై మరింత పరుష పదజాలంతో 'ఎక్స్'లో విరుచుకుపడ్డారు. ఒక మహిళా మంత్రి ఇలా రాక్షసిలా మారి.. ఎలాంటి ఆధారాలూ లేకుండా పాపిష్టి, కల్పిత, నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. పరువుగా బతికే పౌరులను.. మంత్రి తన రాజకీయ యుద్ధంలో బలిపశువులుగా వాడుకోవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని నిప్పులు చెరిగారు. రాజకీయ నాయకులే ఇంతగా దిగజారి, నేరగాళ్లలా ప్రవర్తిస్తే దేశం ఏమైపోతుందని ఆవేదన వెలిబుచ్చారు. 'నా భర్త గురించి ఇలాంటి అసత్యాలను చెబుతున్నవారిని నమ్ముతున్నారా? ఇది సిగ్గుచేటు. మీ రాజకీయ లబ్ధి కోసం మా కుటుంబాన్ని వివాదాల్లోకి లాగొద్దు' అని హెచ్చరించారు. అంతేకాదు.. "మిస్టర్ రాహుల్ గాంధీ, మీరు వ్యక్తుల గౌరవమర్యాదలకు విలువ ఇచ్చేవారైతే, దయచేసి మీ నాయకులను అదుపులో పెట్టండి. మీ మంత్రితో ఈ విషపూరిత వ్యాఖ్యలను వెనక్కితీసుకునేలా చేసి నా కుటుంబానికి క్షమాపణ చెప్పించండి. ఈ దేశ పౌరులను కాపాడండి" అని రాహుల్‌గాంధీని, ప్రియాంకగాంధీని ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

పరస్పర అంగీకారంతోనే మా విడాకులు..

తామిద్దరం పరస్పర అంగీకారంతోనే, సామరస్యపూర్వకంగా విడాకులు తీసుకున్నామని.. అది తమ వ్యక్తిగత వ్యవహారం తప్ప అందులో ఎలాంటి రాజకీయ కుట్రకూ తావు లేదని సమంత, నాగచైతన్య వేర్వేరు ప్రకటనల్లో స్పష్టం చేశారు. తమ విడాకులకు గల కారణాలను బయటపెట్టాలనుకోవడం లేదని, దాని గురించి ఊహాగానాలు చేయడం మానుకోవాలని సమంత తన ఇన్‌స్టా ఖాతా వేదికగా వివరణ ఇచ్చారు. 'మహిళలకు ఆసరా ఇవ్వని గ్లామర్ ప్రపంచంలో నెగ్గుకురావడం, ప్రేమలో పడడం, విఫల ప్రేమ నుంచి బయటపడడం, అయినా నిలబడి పోరాడడం.. అంత సులభం కాదు. మహిళగా జీవించేందుకు, సమాజంలో నిలబడి పోరాడేందుకు చాలా ధైర్యం కావాలి. నా జీవిత ప్రయాణం నన్ను ఆ విధంగా మార్చినందుకు గర్వపడుతున్నాను. దయచేసి దాన్నికించపరచవద్దు' అని సురేఖను కోరారు. 'దయచేసి నా పేరును రాజకీయ పోరాటాలకు దూరంగా ఉంచగలరా?' అని ప్రశ్నించారు. 'మంత్రిగా మీ మాటలకు సమాజంలో ఒక విలువ ఉంటుందని మీరు గ్రహించాలి. ఇతరుల వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడేటప్పుడు బాధ్యతగా, హుందాగా ప్రవర్తించాలని మిమ్మల్ని వేడుకుంటున్నాను. ఇకపై నా వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడడం మానేయండి' అని హితవు పలికారు. ఇక.. విడాకులనేవి అత్యంత బాధాకరమైన, దురదృష్టకరమైన నిర్ణయమని నాగచైతన్య 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. తాను, సమంత ఎంతో ఆలోచించిన తర్వాత.. విభిన్న జీవిత లక్ష్యాలను సాధించే క్రమంలో విడిపోవాలనే నిర్ణయానికి వచ్చామని వివరించారు. మంత్రి సురేఖ తమపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యం, హాస్యాస్పదమే కాక ఆమోదయోగ్యం కూడా కావని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాలో పతాకశీర్షికల కోసం సెలబ్రిటీల వ్యక్తిగత జీవిత నిర్ణయాలను వాడుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వెలిబుచ్చారు. ఇక.. "ఏమిటీ సిగ్గులేని రాజకీయాలు? సినిమా రంగంలో పనిచేసే ఆడవాళ్లంటే చిన్న చూపా?" అని నటుడు ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై చాలాకాలంగా గళమెత్తుతున్న గాయని, సమంత ఆప్తమిత్రురాలు చిన్మయి శ్రీపాద కూడా దీనిపై స్పందించారు. "దురదృష్టవశాత్తు.. కొన్ని యూట్యూబ్ చానళ్లు, మీడియా వ్యక్తులు.. డబ్బుల కోసం, ఫేమ్ కోసం సమంత పేరుతో కొన్ని వీడియోలు పెట్టడాన్ని చూశా. వారి మైలేజీ కోసం సమంత పేరుని ఇలా వాడుకోవడం బాధాకరం. నాకు అర్థమయ్యిందేంటంటే.. ప్రజాదారణ పొందాలంటే వీళ్లందరికీ సమంత పేరు కావాలి. మరో మార్గం లేదు. కానీ కలలో కూడా వారు ఆమె స్థాయిని అందుకోలేరు. సమంత ఎవ్వరికీ అందనంత స్థాయిలో ఉందనేది నిజం. వీరు చేసేదానికి తగిన ఖర్మ అనుభవించాలని కోరుకోవడానికి నవరాత్రికి మించిన సమయం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కినేని కుటుంబంపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలు షాకింగ్‌గా ఉన్నాయని రచయిత కోన వెంకట్ అన్నారు. "ఆమె ప్రతీ మాటను నేను ఖండిస్తున్నాను. సీఎం రేవంత్ ఈ విషయంపై సీరియస్‌గా దృష్టిసారించాలని కోరుతున్నాను. ఇటువంటి అవమానకరమైన, బాధ్యతారాహిత్యమైన మాటలు మాట్లాడినందుకు మంత్రి సురేఖ చేత క్షమాపణలు చెప్పించాలని ఆశిస్తున్నాను. మంత్రి సురేఖ అర్థం పర్థం లేని మాటలను ఖండించాలని సినీ పరిశ్రమను అభ్యర్థిస్తున్నాను" అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.

కొండా సురేఖ క్షమాపణ చెప్పాలి

సురేఖ వ్యాఖ్యలను ఖండించిన హరీశ్‌రావు

సురేఖ నోటిని యాసిడ్‌తో శుభ్రం చేయాలి

బీఆర్ఎస్ మహిళా నేతల మండిపాటు



హైదరాబాద్, శివ్వంపేట, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఖండించారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన కొండా సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ వాదనల్లో పసలేకే వ్యక్తిగత దూషణలకు దిగుతారంటూ దివంగత బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరేట్ థాచర్ గతంలో చేసిన వ్యాఖ్యలను హరీశ్‌రావు తన పోస్టుతో జతపరిచారు. కాగా, బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కేటీఆర్‌పై కొండాసురేఖ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని బీఆర్ఎస్ మహిళానేతలు సత్యవతి రాథోడ్, మాలోతు కవిత, తుల ఉమ, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ ఇలాగే మాట్లాడితే సురేఖను కోర్టుకు ఈడుస్తామన్నారు. ఆమె నోటిని యాసిడ్‌తో శుభ్రం చేయాలన్నారు. కేటీఆర్ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మహిళా మంత్రులను అడ్డుపెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి శిఖండి రాజకీయాలు చేస్తున్నారని, హైడ్రాతో పడిపోతున్న కాంగ్రెస్ గ్రాఫ్‌ను కాపాడుకునేందుకు కొండాసురేఖ, సీతక్కతో మాట్లాడిస్తున్నారన్నారు. బేషరతుగా సమంత, కేటీఆర్‌లకు సురేఖ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కొండా సురేఖను అవమానించిన వారిని వదిలే ప్రసక్తే లేదు

ట్రోలింగ్‌పై ఎంపీ రఘునందన్‌రావు వార్నింగ్

మంత్రి కొండా సురేఖను అవమానిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు హెచ్చరించారు. దీనిపై సైబరాబాద్ సీపీతో పాటు సిద్దిపేట, దుబ్బాక పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఈ దొంగ ఏడుపులు దేనికి?

కొండా సురేఖపై కేటీఆర్ వ్యాఖ్యలు.. మంత్రి ఆగ్రహం

తనను అవమానించేలా పోస్టులు పెట్టారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ.. గతంలో తాను మాట్లాడిన బూతు మాటలు గుర్తు తెచ్చుకోవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేయలేదా? అని ప్రశ్నించారు. మంత్రి సురేఖ బుధవారం తనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడానికి ముందు.. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. "ఈ దొంగ ఏడుపులు పెడబొబ్బలు దేనికి? నేను హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేశానని కామెంట్లు చేశారు. ఆమె ఆరోపణలు చేసిన వాళ్లు మహిళలు కాదా? వాళ్ల కుటుంబాల్లో ఇబ్బందులు ఉండవా? అడ్డగోలు ఆరోపణలు చేసినపుడు మా ఇంట్లో ఉన్న మహిళలు బాధపడలేదా?" అని ప్రశ్నించారు. అంతేకాదు.. "సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన బేకార్ మాటలన్నీ మీకు పంపిస్తా.. మంత్రులు కొండాసురేఖ, సీతక్క కలిసి ఆయన నోటిని ఫినాయిల్, బ్రష్‌తో కడగాలి" అని వ్యాఖ్యానించారు. అనంతరం.. కొండా సురేఖ వద్ద మీడియా కేటీఆర్ వ్యాఖ్యల గురించి ప్రస్తావించగా.. ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "నా వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పెట్టిన అసభ్యకర పోస్టుపై.. మనసున్న మనిషిగా హరీశ్ స్పందించారు. దాన్ని ఖండిస్తూ ట్వీట్ చేశారు. మరి కేటీఆర్ ఎందుకు స్పందించలేదు? ఆయన మనిషా.. పశువా?' అని ధ్వజమెత్తారు. గతంలో మంత్రి సీతక్క, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మిపైనా పోస్టులు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనికి సంబంధించి మూడు అకౌంట్లు దుబాయి నుంచి, మరో మూడు అకౌంట్లు ఇక్కడి నుంచి ఆపరేట్ అవుతున్నాయన్నారు. దీనిపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశామని వెల్లడించారు. కాగా.. సురేఖపై బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు విషయంలో బావ హరీశ్ రావుకు ఉన్న సోయి.. ఆయన బావమరిది కేటీఆర్‌కు లేదని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ వ్యాఖ్యానించారు. దీనిపై మూడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

అమల వ్యాఖ్యలు అభ్యంతరకరం: ఎంపీ మల్లు రవి

రాజకీయ నాయకులందరిపైన, రాహుల్ గాంధీపై అక్కినేని అమల చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. అమల తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో వికృత పోస్టులు బాధించడం వల్ల మంత్రి సురేఖ స్పందించారన్నారు. ఆమెపై వచ్చిన అభ్యంతరకర పోస్టులపై స్పందించని బీఆర్ఎస్ మహిళా నాయకులు ఇప్పుడు మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీసీ మహిళ అయిన సురేఖ తన ఆత్మగౌరవం కాపాడుకునేందుకు సీరియస్‌గా స్పందించారన్నారు. ఈ ఎపిసోడ్‌కు మూలకారణం ఏమిటో ప్రతి ఒక్కరూ తెలుసుకుని స్పందించాలని ఆయన కోరారు.

కేటీఆర్ డైరెక్ట్‌గా వచ్చి మాట్లాడు

» మంత్రి సీతక్క

కనీసం పండగపూటైనా మహిళలను ఆనందంగా ఉండనివ్వరా అంటూ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ చాట్.. చాట్‌గా కాదు డైరెక్ట్‌గా వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. మహిళా మంత్రులను శిఖండి అని ఎట్లా అంటారని ఆమె ప్రశ్నించారు. పని గట్టుకుని సినిమా వాళ్ల గురించి తాము మాట్లాడడం లేదని, సినిమా నటులకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

కేసీఆర్, కేటీఆర్‌పై పోలీసులకు ఫిర్యాదు

మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భద్రాద్రి జిల్లాలో 'గూఢచార రాబందు'!

» కెమెరా, జీపీఎస్ ట్రాకర్‌తో సంచారం..

హైదరాబాద్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి):చర్ల అటవీ ప్రాంతంలో కెమెరా, జీపీఎస్ ట్రాకర్ అమర్చిన 'గూఢచార రాబందు' సంచారం కలకలం సృష్టించింది. అయితే మావోయిస్టుల కదలికలను గుర్తించేందుకు పోలీసులే పంపి ఉంటారని తొలుత భావించగా.. తమది కాదని పోలీసులు స్పష్టం చేశారు. కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని ఏకలవ్య విద్యాలయం సమీపంలో గుట్టపై బుధవారం ఓ రాబందు ఎగరలేని స్థితిలో వచ్చి వాలింది. అది ఆకలి, అలసటతో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు ఆహారం అందించారు. అయితే రాబందు కాళ్లకు కెమెరా, జీపీఎస్ ట్రాకర్ అమర్చి ఉండటంతో.. కొందరు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పంచుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రాబందు ఆహారం ఆరగించిన కాసేపటికే ఎగురుకుంటూ వెళ్లిపోయింది. రాబందు సంచారంపై స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కాగా, చర్లలో సంచరించిన రాబందు మధ్యప్రదేశ్‌లోని టైగర్ రిజర్వుకు చెందినదిగా అధికారులు భావిస్తున్నారు. రెండు డజన్ల రాబందుల కదలికల్ని పర్యవేక్షించేందుకు రెండేళ్ల క్రితం జీపీఎస్‌తో ట్యాగ్ చేసినట్లు చెబుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న 128 పశువుల పట్టివేత

» 21 మూగజీవాల మృతి.. నలుగురి అరెస్టు

పెంచికలపేట, అక్టోబరు 2: నాలుగు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న 128 పశువులను పోలీసులు పట్టుకున్నారు. కంటైనర్లలో పశువులను కుక్కి రవాణా చేయడంతో ఊపిరాడక 21 మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన బుధవారం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగింది. బుధవారం తెల్లవారుజామున 6 గంటలకు పెంచికలపేట మండలంలోని లోడ్పల్లి గ్రామశివారులో పోలీసులు నాలుగు కంటైనర్లను అడ్డుకుని తనిఖీలు చేశారు. అందులో అక్రమంగా తరలిస్తున్న 128 పశువులను పట్టుకున్నారు. మహారాష్ట్ర గడ్చిరోలి నుంచి పశువులను అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న షఫీ, కృష్ణ, సోహీద్, నదీంషేక్‌ను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పట్టుకున్న పశువులను రాధాగోపాలకృష్ణ గోశాలకు అప్పగించినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఓయూలో ఈవెనింగ్ ఎంబీఏ

ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్-ఎంబీఏ ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంబీఏ(టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వీటిని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తోంది. టీజీ ఐసెట్ 2024 అర్హత పొందిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. వీరికి కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. టీజీ ఐసెట్ 2024 రాయని అభ్యర్థులు, రాసినప్పటికీ అర్హత పొందని వారు వర్సిటీ నిర్వహించే ఓయూ ఎంబీఏ సెట్ 2024 రాయాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎగ్జిక్యూటివ్/మేనేజీరియల్/అడ్మినిస్ట్రేటివ్/ఇంజనీరింగ్/డిఫెన్స్ విభాగాల్లో కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. అభ్యర్థులు తాము పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 19
- **ఓయూ ఎంబీఏ సెట్ 2024 తేదీ:** అక్టోబరు 27
- **వెబ్‌సైట్:** http://ouadmissions.com/

ఓయూ ఎంబీఏ సెట్ 2024 వివరాలు

ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి పార్ట్‌లో బిజినెస్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్‌లో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 30 ప్రశ్నలు; రెండో సెక్షన్‌లో జనరల్ ఇంగ్లీష్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్‌తో గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

పెట్రోలియం అండ్ ఎనర్జీలో పీహెచ్‌డీ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- పీహెచ్‌డీ 2024-25 స్ప్రింగ్ సెమిస్టర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెగ్యులర్, ప్రాజెక్ట్, స్పాన్సర్డ్, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఇండివిడ్యువల్ ఫెలోషిప్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయవచ్చు. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్సు వర్క్, పబ్లికేషన్ ఆఫ్ రిసెర్చ్ వర్క్, సెమినార్‌లు, కాంప్రహెన్సివ్ ఎగ్జామినేషన్, వైవా, అవార్డ్ ఆఫ్ పేటెంట్స్ ఉంటాయి. అకడమిక్ మెరిట్, ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

విభాగాలు

బయోసైన్స్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎర్త్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్.

అర్హత

సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ/డ్యూయెల్ డిగ్రీ/ బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయుల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ఎన్‌బీహెచ్‌ఎం/నెట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. లేని పక్షంలో ఏఐసీటీఈ/యూజీసీ గుర్తింపు పొందిన డిగ్రీ కళాశాలల్లో కనీసం మూడేళ్ల బోధన అనుభవం ఉండాలి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్, కోల్, ఎర్త్ సైన్సెస్, కెమికల్ అండ్ ఫర్టిలైజర్, డిఫెన్స్ సంస్థలు; పీఎస్‌యూలు, ఆర్ అండ్ డీ సంస్థలు, నేషనల్ ల్యాబొరేటరీలు, సంస్థ గుర్తింపు పొందిన ఇండస్ట్రీలలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. వీరు స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. ఇండివిడ్యువల్ ఫెలోషిప్ కేటగిరీ కింద ప్రవేశం పొందాలంటే సీఎస్ఐఆర్/యూజీసీ/ డీబీటీ/ఐసీపీఆర్/ఇన్‌స్పైర్ నుంచి వ్యాలిడ్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) అర్హత ఉండాలి. ఐఐటీలు, ఐఐఎస్సీ, ఐఐపీఈ, ఆర్‌జీఐపీటీ సంస్థలనుంచి కనీసం 8 సీజీపీఏతో బీటెక్/ డ్యూయెల్ డిగ్రీ-బీటెక్ అండ్ ఎంటెక్/ అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/జామ్ స్కోర్‌తో రెండేళ్ల ఎమ్మెస్సీ పూర్తిచేసినవారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 15
- **ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** నవంబరు 26 నుంచి 29 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 6న
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in



రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్

అభ్యర్థులకు సంస్థ గరిష్ఠంగా అయిదేళ్లపాటు రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ అందిస్తుంది. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000 చెల్లిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.30,000 ఇస్తారు.

జయశంకర్ వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. విదేశాల్లో నివశిస్తున్న ఎన్ఆర్ఐ అభ్యర్థులు, ఎన్ఆర్ఐలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్(ఇంటర్/పన్నెండోతరగతి మార్కులు) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు రూ.9,53,450లకు డీడీ, రూ.46,550ల నగదుతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. వీరికి ఫీ రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ రాయితీలు లభించవు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.



- **బీటెక్ స్పెషలైజేషన్‌లు:** ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్

బైపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ 10 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

ఎంపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు

సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) 3 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- బైపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు(ఇండియన్/విదేశీ బోర్డు) నుంచి బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే ఏదేని ఇండియన్/విదేశీ బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 1
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఆన్‌లైన్ వీకెండ్ ప్రోగ్రామ్‌లు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు నెలలు. ప్రోగ్రామ్‌నకు 150 గంటల సెషన్స్ నిర్దేశించారు. వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ స్టడీస్, రియల్ వరల్డ్ సినారియోలు, క్విజ్‌లు, ఇండివిడ్యువల్/గ్రూప్ అసైన్‌మెంట్స్, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ అండ్ ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసి ఫైనల్ ఎగ్జామ్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్‌లు ఉపకరంగా ఉంటాయి.

- **ఒక్కో ప్రోగ్రామ్ ఫీజు:** రూ.75,000+18 శాతం జీఎస్‌టీ
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

గ్లోబల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అండ్ పోర్ట్ ఆపరేషన్స్

- ఇందులో ఎనిమిది మాడ్యూల్స్ ఉంటాయి. గ్లోబల్ ట్రేడ్ ప్రాక్టీసెస్, సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, పోర్ట్ ఆపరేషన్స్, లాజిస్టిక్స్ ఆప్టిమైజేషన్ అంశాలను బోధిస్తారు.
- **మాడ్యూల్స్:** ఇండియాస్ ఫారిన్ ట్రేడ్, గ్లోబల్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్, ఎయిర్ లాజిస్టిక్స్, ఓషన్ ట్రాన్స్‌పోర్టేషన్, కస్టమ్స్ రెగ్యులేషన్స్ అండ్ ప్రొసీజర్స్, ఇండియాస్ పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఆపరేషన్స్, సెమినార్ కోర్స్ ఆన్ ట్రేడ్ ఇష్యూస్
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15



ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్

- ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. గ్లోబల్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్, గ్లోబల్ అండ్ ఇంటర్నేషనల్ మార్కెటింగ్, ఫారిన్ ట్రేడ్ పాలసీ, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ ట్రాన్సాక్షన్స్, డాక్యుమెంటేషన్ ప్రొసీజర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు కోర్సు మెటీరియల్‌తోపాటు ఐఐఎఫ్‌టీ లెర్నింగ్ వెబ్ పోర్టల్‌లో లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు.
- **మాడ్యూల్స్:** ఇంటర్నేషనల్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ డాక్యుమెంటేషన్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ అండ్ కస్టమ్స్ రెగ్యులేషన్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్, ఎక్జిమ్ ఫైనాన్స్
- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 15

జాబ్ కార్నర్

హెచ్ఏఎల్‌లో ఖాళీలు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)కు చెందిన రోటరీ వింగ్ అకాడమీ(ఆర్‌డబ్ల్యూఏ)..హెలికాప్టర్ డివిజన్, బెంగళూరు...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 4

1. **ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్: 2**
2. **టెక్నికల్ ట్రేడ్స్‌మన్: 1**
3. **అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్: 1**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ/ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 65 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు రూ.ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ పోస్టులకు రూ.1,64,560; అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులకు రూ.82,280; టెక్నికల్ ట్రేడ్స్‌మన్‌కు రూ.43,054.

దరఖాస్తు ఫీజు: ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులకు రూ.500; టెక్నికల్ ట్రేడ్స్‌మన్ పోస్టులకు రూ.200.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ద డిప్యూటీ జనరల్ మేనేజర్(హెచ్ఆర్), హెలికాప్టర్ డివిజన్, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, పోస్ట్ బాక్స్ నెంబర్-1790, విమనపుర పోస్ట్, బెంగళూరు చిరునామాకు పంపించాలి.

చివరి తేదీ: అక్టోబరు 12

వెబ్‌సైట్:https://halindia.co.in/home



సీ-మెట్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్‌లు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ(సి-మెట్)...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 3

పోస్టు: ప్రాజెక్ట్ అసిస్టెంట్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా(మెటలర్జీ/కెమికల్/మెకానికల్), బీఎస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు రూ.26,300

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఎంపిక ప్రక్రియ: ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీ: అక్టోబరు 16

వేదిక: సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ(సీ-మెట్), ఐడీఏ ఫేజ్-3, చర్లపల్లి, హెచ్‌సీఎల్, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://cmet.gov.in/jobs

ఎంటీపీఎఫ్‌లో టెక్నీషియన్లు

ఆర్మర్డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్)కు చెందిన మహారాష్ట్ర థానే జిల్లా అంబర్‌నాథ్‌లోని మెషిన్ టూల్ ప్రొటోటైప్ ఫ్యాక్టరీ... ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న 81 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ మేనేజర్: **26 పోస్టులు**
2. డిప్లొమా టెక్నీషియన్: **34 పోస్టులు**
3. అసిస్టెంట్: **2 పోస్టులు**
4. జూనియర్ టెక్నీషియన్: **19 పోస్టులు**

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, మార్కెటింగ్ అండ్ ఎక్స్‌పోర్ట్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్, సీఎన్‌సీ ఆపరేటర్, టూల్ డిజైన్, గ్రైండర్, ఎలక్ట్రీషియన్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్‌దరఖాస్తుకు చివరితేదీ: అక్టోబరు 11.

వెబ్‌సైట్: https://avnl.co.in/

లిటిల్స్

తెలివి తక్కువ తోడేలు

ఒక పావురం మరియు కోడిపుంజు అనుకోకుండా అడవిలో కలుసుకుని, మంచి స్నేహితులయ్యాయి.రోజూ అవి కాసేపు కలుసుకుని, కబుర్లు చెప్పుకునేవి. ఒక రోజు ఆ రెండూ అలాగే కలుసుకుని పావురం చెట్టు మీద వాలి, కోడిపుంజు నేలమీద గింజలు వెతుక్కుంటూ ఉండగా, బాగా ఆకలి మీద ఉన్న ఓ తోడేలు అటుగా వచ్చి, మేత కోసం తిరుగుతున్న కోడిపుంజును చూసింది.

చూడగానే మనసులో ఇలా అనుకుంది, 'ఈ కోడిపుంజు చక్కగా కొవ్వు పట్టి ఉన్నది. దీన్ని కానీ ఇంటికి పట్టుకెళ్లగలిగితే నాకు ఇవాళ విందు భోజనమే' అనుకుని, అదను చూసి, చాటునుండి కోడిపుంజు మీద దాడి చేసింది. దాన్ని అలాగే పట్టుకుని తన దగ్గరున్న సంచీలో వేసుకుంది. కోడిపుంజు చాలా భయపడిపోయి, సంచీలోనుంచే గట్టిగా అరవసాగింది. చెట్టు పైన కొమ్మమీద కూర్చుని ఇదంతా గమనించిన పావురం తన మిత్రుడికి ఏదైనా సాయం చేయాలి అనుకుంది. అనుకున్నదే తడవుగా వెళ్లి, తోడేలు వెళ్లే దారిలో చచ్చిపోయినట్టు కదలకుండా పడుకుంది. అది చూసిన తోడేలు' అదృష్టమంటే ఇవాళ నాదే, ఒకేసారి పావురం, కోడిపుంజు ఇవాళ రెండు పూటలా విందు నాకు అనుకుంటూ పావురాన్ని సంచీలో వేయడానికి సంచీ తెరిచి పక్కన పెట్టింది, ఇదే అదనుగా సంచీలోఉన్న కోడిపుంజుమెల్లగా బయటపడి, తన స్థానంలో ఆ సంచీలో ఒక రాయిని పెట్టింది ఈ లోగా తోడేలు దగ్గరికి రావడం గమనించిన పావురం చటుక్కున లేచి, ఎగిరిపోయింది. 'అమ్మ పావురమా పిడికెడు ఉన్నావు నువ్వు నన్ను ఇంత మోసం చేస్తావా?'అనుకున్నది తోడేలు. అలా సంచీని మోసుకుంటూ ఆనందంగా ఇంటికి వెళ్లి, సంచీ తెరిచి చూసి, అందులో కోడిపుంజు కాక పెద్ద రాయి ఉండటంతో అయోమయంగా కోడిపుంజు రాయిగా ఎలా మారిందా అని ఆలోచిస్తూ, ఆ పూట విందు కాదు కదా అసలు భోజనమే పోగొట్టుకున్నందుకు ఏడ్చింది తోడేలు. ఆ రోజు సాయంత్రం మరలా పావురం కోడిపుంజు రెండూ కలిసి తోడేలు తెలివి తక్కువ తనాన్ని తలచుకుని నవ్వుకున్నాయి. సమయస్ఫూర్తితో ,ఉపాయంతో అపాయాల నుండి తప్పించుకోవచ్చు. మనమేకాక మన మిత్రులను కూడా కాపాడుకోవచ్చు.



10 తేడాలను కనిపెట్టండి



ఏవి ఎన్ని?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 425

	5		9	3			4	
3		9			1		2	
					7			
						2		3
8	4						6	5
5		7						
			6					
	6		7			1		2
	7			4	2		3	

సుడోకు - 424 సమాధానం

9	6	3	7	5	8	1	4	2
1	4	8	2	6	9	5	3	7
5	7	2	1	3	4	9	6	8
3	8	6	9	4	7	2	5	1
7	9	4	5	1	2	6	8	3
2	5	1	6	8	3	7	9	4
6	3	5	8	2	1	4	7	9
8	2	9	4	7	5	3	1	6
4	1	7	3	9	6	8	2	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.